రాజా



# రామ్ మోహన్ రాయ్

*Life of RAJARSHI*

# RAJA RAMMOHUNROY



"....నావినమ్రప్రయత్నము లన్నిటిని లోకము న్యాయదృష్టితో
బరిశీలించి కృతజ్ఞతతో స్వీకరించునట్టి దినము తప్పక వచ్చును."

[1]952

[Revi]sed Edition.

[?]K. Ramasastry, *B. A; B. Ed.*
(THARAKAM)

Re. 1/-

ఓమ్

బ్రహ్మకృపాహి కేవలమ్ !

# రాజర్షి
# శ్రీ రాజా రామమోహనరాయలవారి
# జీవితచరిత్ర

గ్రంథకర్త :

శ్రీ కె. రామశాస్త్రి బి, ఏ., బి, ఇ. డి.,

తారకం

★

ప్రచురణకర్తలు :

రాతు బుక్ డిపో,

ఎడ్యుకేషనల్ పబ్లిషర్సు,

రాజమండ్రి.

1952.

కాపీరైటు రిజిష్టర్డు]

[వెల 1—0—0

# విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| 1 | ఉపక్రమణిక | 1–6 |
| 2 | రామమోహనుని పూర్వులు | 6–10 |
| 3 | జననము-బాల్యము-విద్యాభ్యాసము | 10–13 |
| 4 | దేశాటనము | 13–15 |
| 5 | పునరాగమనము | 15–16 |
| 6 | ఉద్యోగము | 17–20 |
| 7 | ఆంగ్లవిద్యాభ్యాసము | 20–23 |
| 8 | ఆత్మీయసభ | 23–26 |
| 9 | సమరసన్నాహము | 26–28 |
| 10 | క్రైస్తవులతోఁ గలహము | 28–33 |
| 11 | బ్రహ్మసమాజస్థాపనము | 34–37 |
| 12 | బ్రహ్మసమాజదానపత్రము | 37–39 |
| 13 | సంఘసంస్కరణ | 39–46 |
| 14 | ఆంగ్లవిద్యావ్యాప్తికిఁ దోడ్పాటు | 46–52 |
| 15 | వార్తాపత్రికల యభివృద్ధి | 52–55 |
| 16 | ఐరోపాఖండయాత్ర | 56–72 |
| 17 | ఆంగ్లదేశమున భారతమాత కొనర్చిన సేవ | 72–79 |
| 18 | అంత్యదశ | 79–83 |
| 19 | అంత్యక్రియలు | 83–87 |
| 20 | రామమోహనుని శీలము | 87–116 |
| 21 | రామమోహనుని ఘనత | 116–119 |
| 22 | రామమోహనుని మతము | 119–121 |
| 23 | రామమోహనుని జీవితసందేశము | 121–124 |

ఓమ్

# భూమిక

రాజర్షి, యుగపురుషుఁడు, లోకసేవాపరాయణుఁడు, మహావిద్వాంసుఁడు, బ్రహ్మమతస్థాపనాచార్యుఁడు, నాదర్శ పురుషుఁడును నగు శ్రీ రాజా రామమోహనరాయలవారి యుత్తమచరిత్రము భరతఖండవాసు లందఱకు నవశ్యము పఠనీయ మన్నమాట నిర్వివాదాంశము. జనసామాన్యమునకు శ్రీ రామమోహనునిచరిత్రము సమగ్రముగాఁ దెలియఁజేయు నట్టి చిన్నగ్రంథము తెలుఁగుభాషలో నింతవఱకు రచియింపఁ బడలేదు. ఆకొఱత చిరంజీవి కంభంపాటి రామశాస్త్రి తీర్పఁ గలిగినందులకు నేను సంతసించుచున్నాను. ఈతఁడు బాల్య మునందే బ్రహ్మసమాజసిద్ధాంతములను నిర్భయముగా నాచ రణలోనికిఁ దెచ్చి జీవితమునందుఁ బ్రదర్శింపఁగలిగిన యువకుఁ డగుటచే నీగ్రంథము రచియించుట సముంజసముగా నున్నది. ఈగ్రంథమందలి శైలి సులభమై రసవంతమై కథానాయ కుని జీవితము పాఠకమహాశయులకుఁ గరతలామలకముగాఁ జేయునట్టిదై యున్నది. ఈ గ్రంథమందు రామమోహనుని జీవితసందర్భమున ననేకులు మున్ను వినియెఱుంగని క్రొత్తవిష యములు గలవు. ఇది మిక్కిలి యుపయోగకరమగు పుస్తకము కావున నాంధ్రమహాజనులు సంపూర్ణమైన యాదరముఁ జూపుదురుగాక !

రాజమహేంద్రవరము
8-12-1936

చిలకమర్తి లక్ష్మీనరసింహము

ఓమ్

బ్రహ్మకృపాహి కేవలమ్!

# రాజర్షి

# శ్రీ రాజా రామమోహనరాయలవారి జీవితచరిత్ర

క్రీ. శ. 1772 (పదునెనిమిదవ శతాబ్దాంతము)

ఆర్యఋషులు భక్తిపారవశ్యముచే సృష్టికర్తయగు భగవంతునిఁగూర్చి గానము చేసిన యీభారతభూమి, గౌతమబుద్ధుఁడు అహింసాతత్త్వమును, ధర్మజీవనమును నెలకొల్పిన ఈ ఆర్యావర్తము, అక్బరుపాదుషా విశాలమై, విశ్వజనీనమైన మతస్థాపన కువ్విళ్లూరి దేహత్యాగము చేసిన ఈ హిందూస్థానము, పదునెనిమిదవ శతాబ్దాంతమున నధోగతిపాలై, యంధకారబంధురమై యుండెను.

ఉపనిషన్మతమందలి యాధ్యాత్మికారాధన మంతరించి మతముపేర మూఢవిశ్వాసము లనేకము లిచ్చటఁ బ్రబలి యుండెను. అద్వితీయుఁడగు నేకేశ్వరుని, మానసికోపాసనకు బదులు ప్రజలు వివిధములగు విగ్రహములను బూజించుచుండిరి. భక్తవరేణ్యులు, జగన్నాథరథచక్రములక్రిందఁ బడి మోక్షము

కొఱకుఁ బ్రాణము లర్పించుచుండెడివారు. ముఖ్యముగా వంగదేశమున జంతుబలులు, మద్యపానము, వ్యభిచారము విరివిగా వ్యాపించియుండెను. చైతన్యుని భక్తిప్రభావ మాతని యనుచరులలో సైతము నిర్జీవమై యుండి, ప్రేమామృతము వెదచల్లుట మానివేసెను.

దేవళములందలి యర్చకులకును, సామాన్యమానవులకును మతగ్రంథములందలి సిద్ధాంతములుతప్ప రవ్వంత లోకజ్ఞానమైన లేకుండెను. వారలు జ్ఞానశూన్యు లగుటయేగాక నీతిబాహ్యమగు వర్తనకు లోనై దురాచారములకుఁ జేయూఁత నొసంగుచుండెడివారు.

ఆంగ్లవిద్యావ్యాప్తియొక్క ప్రారంభదశయందు నాస్తికవాదులసంఖ్య వంగదేశమం దెక్కువగా నుండెను. ఆంగ్లవిద్య మాట యటుండ జనసామాన్యమందు, అందు ముఖ్యముగా స్త్రీజాతియందు దేశవిద్య యంతగాఁ బ్రబలలేదు.

సాంఘికజీవనము వర్ణించుటకు నలవికాని ఘోరదురాచారములకు లోనైయుండెను. బ్రాహ్మణులతోపాటు శూద్రుఁ డెంతగొప్పవాఁడైన నొక్కతివాసిమీఁదఁ గూర్చుండుటయే తప్పు. ఆ దినములలో సుగంధద్రవ్యము లమ్ముకొని జీవించు నొకశూద్రుఁడు వేయిమంది బ్రాహ్మణులపాదధూళి తనయొక్క కుష్ఠరోగనివారణకు సేకరించుచుండెడివాఁడఁట! బ్రాహ్మణేతరుల మూఢవిశ్వాస మెట్లుండెనో తెలిసికొనుట ప్రబలనిదర్శనము. వర్ణాంతర వివాహములును, సహ

పంక్తి భోజనములును బాపకృత్యములక్రిందనే పరిగణింపఁబడుచుండెడివి. అగ్రజాతులు కానివారు విద్య నభ్యసించుటకే భయపడి సామాన్యమైన కూలిపనితోఁ దృప్తి నొందెడివారు.

కాని, యాకాలమున వంగనారీమణు లనుభవించిన కష్టము లూహించుటకుసహితము నలవికానివి. అంతకు ముందుఁ గొన్ని శతాబ్దములనుండియు వంగదేశమందు బ్రాహ్మణులలోసహితము 'కులీనులు' అను ప్రత్యేకశాఖ యుండెడిది. బహుభార్యాత్వము వారిలో నొకయాచారమై యుండెను. ఈ కులీనులు వంశపారంపర్యపుహక్కు లనుభవించుచుండుటచే నితరబ్రాహ్మణులు తమకన్యలను వారి కిచ్చి వివాహము చేయుట గౌరవముగా నెంచి వారితో సంబంధబాంధవ్యములకుఁ బ్రయత్నించుచుండెడివారు. బహుభార్యాత్వముచేత, వివాహితలైన వేలకొలఁది స్త్రీలు, ఇంచుమించుగా కన్యలుగానే యుండెడివారు. అట్టిచోఁ బెనిమిటిపోయిన విధవలగతి చెప్పనేల? పోయినపెనిమిటి యొకఁడు; ఆతని మరణమువలన వైధవ్య మనుభవించు యువతు లనేకులు. తామే యిష్టపడియో లేక యితరులచేఁ బ్రోత్సహింపఁబడియో యీవిధ లందఱును సహగమన మాచరించుచుండెడివారు. ఏకో మందియో చావలేక బ్రతుకుటకు సిద్ధమైనను, అట్టి బ్రతుకు భూలోకనరకముగాఁ బరిణమించుచుండెడిది. కావున నీ నరకప్రాప్తినుండి మరణమే శరణ మగుచుండెను. అన్ని

జ్వాలలలో దుమికినపిదప దుర్భరమగుబాధ భరింపలేక పరువు లిడుదు రనుభయముచే విధవలు పెనిమిటియొక్క కాష్ఠము నకుఁ బెద్దత్రాళ్ళతోఁ గట్టఁబడుచుండెడివారు. పరువులిడఁ బ్రయత్నించిన కొంతమందిని బంధువులు పట్టి తీసికొనిపోయి ప్రాణము లుండఁగనే వేఱుగ దహించెడివారఁట. పెనిమిటి పోయినపుడు దూరదేశమునందున్న భార్యలుసహిత మచ్చట నేదోయొకకఱ్ఱకుఁ బసుపుగుడ్డఁ గట్టి దానిపైఁ బడి యగ్ని జ్వాలలలో దేహత్యాగము చేయవలసినదే! ఇట్టి విపరీత ఘోరదురాచారమును వినుటవలననే శరీరము కంపించు నప్పుడు, ఆకాలమందలి నైజస్థితిఁ దలఁచుకొనుటకుఁగూడ నశక్యము.

ఇఁక నాకాలమునాఁటి జనసామాన్యముయొక్క దైనిక చర్యఁ బరికింతము. కొంచెముస్థితిగలవారు గాలిపటముల నెగుర వేయుటలోను, గొఱ్ఱెపొట్టేళ్ళ పందెములలోను, భోగపుమేళ ములతోను దమకాలమును, ధనమును వ్యర్థపఱచుచుండెడి వారు. ఇంకను జెప్పనలవికాని క్రీడావినోదములకై కాలము వెళ్ళఁబుచ్చుచుండెడివారు. ఈశ్వరచంద్రుఁడను నాడియా రాజు 1790 సం॥రములో రెండుమర్కటములకు వివాహము చేయువినోదముకొఱకై లక్షరూప్యముల ఖర్చుపెట్టెనఁట! బీదసాదు లవాచ్యములగు బూతుపాటలతోఁ గాలక్షేప మొనర్చుచుండెడివారు.

రాజకీయరంగములో మహమ్మదీయరాజ్య మప్పుడే కూలుచుండెను. మహారాష్ట్రప్రతిభ యంతరించెను. తూర్పు

ఇండియా వర్తకసంఘపుఁ జేతులలోనికిఁ దెలియకయే రాజ్యము పోవుచుండెను. కాని యాంగ్లేయు లింకను రాజ్యభారము మాత్రము సంపూర్ణముగా వహింపలేదు. తలవనితలంపుగా లభించినరాజ్యము మరలఁ బోవునేమో యనుభీతిచే నాంగ్లేయులు వర్తకపుదృష్టితప్ప నెట్టి ప్రజాహితకార్యములపట్లఁగాని సంఘసంస్కరణములయెడలఁగాని జోక్యము గలుగఁజేసికొన కుండిరి. విద్యావ్యాప్తి కూడఁ దమబాధ్యత కాదని తటస్థముగా నుండిరి. సంస్కృతము, అరబ్బి, పర్షియన్ భాషలు కొద్దిగా నేర్పెడి పూర్వపుఁబాఠశాలలు తప్ప దేశమం దెచ్చటను సక్రమపద్ధతిని విద్యగఱపు కళాశాలలే లేకుండెను.

ఇట్టిపరిస్థితులలో దేశమంతట నావరించిన యజ్ఞానాంధకారముఁ బాపుటకుఁ బంపఁబడిన దేవదూతయో యనునట్లును, ఆర్యావర్తగగన మంతయు నిండిన దట్టమగు ఘోరదురాచార మేఘములను బటాపంచలు కావించుట కేతెంచిన జంఝామారుతమో యనునట్లును, భారతజాతికి నవజీవనధార వోయుటకు హిమవత్పర్వతములలో నుద్భవించిన యమృతవాహినియో యనునట్లును, అనేక భక్తవరేణ్యుల కాలవాలమైన మన మాతృగర్భమున మరల నపూర్వమైన యీశ్వరాంశ సంభూతుఁ డగు నొకయద్భుతవ్యక్తి వంగదేశమున నుదయించెను. అతఁడే యుగపురుషుఁడు, నవభారత పితామహుఁడు, రాజర్షి, జ్ఞానభానుఁడు, రామమోహనుఁడు.

శ్రీ రాజా రామమోహనరాయలవారి జీవిత మొక పురాణగాథ; అది యొక ప్రేమగీతిక; అది జీవితయాత్రకు మార్గముఁ జూపు ధ్రువతార; పాదభాగము భూమిపై నున్నను సదా గగనమును వీక్షించు మహోన్నతగిరిశిఖరము; సృష్టి గానములో లయమైన వేణుగానము; మానవజాతిని, విశ్వేశ్వ రాలయమందారాధనకు రమ్మనుటకు సముద్రఘోషను బోలిన ఆహ్వానము; కోయిలపాటలోని మేలుకొల్పు; ప్రాక్పశ్చిమములఁ గలుపుచు స్వేచ్ఛాగానము చేయుచు గగనమార్గమున విహరించు విహంగము; కాళరాత్రిని ఛేదించు అరుణోదయము; మూఢగజములపాలిటి సింహగర్జనము; వేయేల, అది యొక నిరంతర విశ్వేశ్వరస్తోత్రము; ప్రాణేశ్వరుని జయగానము.

## రామమోహనుని పూర్వులు

శ్రీ రామమోహనరాయలవారి పూర్వులు సుప్రసిద్ధ బ్రాహ్మణకుటుంబమువారు. అలంఘీర్ పాదుషానాఁటినుండియు మూర్షిదాబాదునవాబుక్రింద నున్నతోద్యోగములు చేసిరి. వారిలో నగ్రగణ్యుఁడు కృష్ణచంద్రబెనర్జి యనునాతఁడు. ఆతఁడు తన బుద్ధికుశలతచేఁ బ్రభువుమన్ననలకుఁ బాత్రుఁడై 'రాయ్' అను బిరుదాంకితుఁ డయ్యెను. అతఁడే తన నివాసమును రాధానగరమున స్థిరపఱచెను.

కృష్ణచంద్రబెనర్జిగారికి అమర్‌చంద్, హరిప్రసాద్, బ్రిజ్బినూద్ మొదలగు కొమరు లుండిరి. వీరిలో బ్రిజ్బినూద్

సత్యవాది, భగవద్భక్తుఁడు నని ప్రసిద్ధి. కృష్ణచంద్రుఁడు కొంతకాలము సురాజ్ద్దౌలావద్ద నుద్యోగముఁ జేసి కొన్ని చిక్కులు తటస్థించుటవలన నుద్యోగమునుండి విరమించెను. చరమదశయం దీతఁడు గంగానదీతీరమునఁ దపస్సు చేసికొను చుండెను. ఇట్లుండ నొకానొకదినమున శ్యామభట్టాచార్యుఁ డను శాక్తేయుఁ డాయనయెదుటికి వచ్చి "తమ్ము నొకవరము వేఁడవచ్చితిని; అనుగ్రహింతెద నని వాగ్దానము చేసినచో నా యభీష్టమును జెప్పుకొనియెదను" అని విన్నవించెను. ఆలో చింపకయే కృష్ణచంద్రుఁ డందులకు 'వల్లె' యనెను. అంత భట్టాచార్యులు వివాహమునకు సిద్ధముగానున్న తనకొమార్తె నాయనకొమరులలో నొకనికిఁ జేసికొనుట కంగీకరింపఁ బ్రార్థించెను. ఈ కోర్కెకు నిశ్చేష్టుఁ డయ్యు నాడితప్పనివాఁ డగుటచేఁ గృష్ణచంద్రుఁడు తన ముగ్గురుకొమరులను రావించి కలఁతఁజెందిన మనస్సుతో జరిగిన వృత్తాంతమును వినిపించి, తనవాగ్దానము నిలుపుకొనుటకు వారిలో నెవ్వరు సంసిద్ధు లయ్యెద రని యడుగ నైదవపుత్రుఁడగు రమాకాంత రాయలు తండ్రిని సంతోషపెట్టుటకుఁ దన యంగీకారమును దెలిపెను. ఈవిచిత్రసంఘటనవలన రమాకాంతరాయలకును శ్యామభట్టాచార్యుని పుత్రికాతిలకమగు 'ఫూల్ ఠాకురాణి' యని పిలువఁబడు తారిణీదేవికిని బరిణయ మాయెను. ఈ యపూర్వవివాహఫలితమే రామమోహనుఁడు. ఇట్లు జన కునివైపున వైష్ణవసంప్రదాయమును, జననివైపున శైవసంప్ర

దాయమును మన రామమోహనున కుగ్గుపాలతోఁ గలిసి సర్వమతసమన్వయమునకు దారిచూపెను.

రమాకాంతరాయలు పుత్త్రునికి విద్యాబుద్ధులు గఱపుటయం దెక్కువ శ్రద్ధాభక్తులును, పట్టుదలయుఁ జూపెను. ఆయనశీలము ప్రశంసనీయము. తారిణీదేవి నాఁటి స్త్రీలలో నెల్ల మణి; సౌందర్యరాశి; సౌందర్యమును మించిన పాతివ్రత్యము గల యామె పూర్వాచారపరాయణురా లగుటచేఁ దన సుపుత్త్రుని మతబోధ నంతరాత్మ యంగీకరించినను ఆకాలపు టాచారముల ననుసరించి తన చరమావస్థయం దొంటరిగాఁ బెక్కుకట్లు కోర్చి యాభక్తురాలు జగన్నాథ మేగి స్వామిరథ చక్రములక్రిందఁ బడి ప్రాణములను విడిచెను. తలిదండ్రుల పట్టుదలయును, భక్తివిశ్వాసములును, కార్యదీక్షయు రామమోహనునియందు సంపూర్ణముగా మూర్తీభవించెను.

తారిణీదేవి రమాకాంతుల కొక పుత్త్రికయు నిరువురు పుత్రులును గలిగిరి. వారిలోఁ గడపటివాఁడే మన రామమోహనుఁడు. జమీందారీకుటుంబమున జన్మించినవాఁ డగుటచే సమస్తభాగ్యభోగ్యములతోఁ దులతూఁగుచు గారాబుపట్టియై పెరుగుచుండెను. బాల్యమం దప్పుడప్పుడు తల్లితోఁ దాతగారియింటి కేగినసందర్భమునఁ జెప్పఁబడిన యొక యితిహాసము కలదు. తాతగారు శాక్తేయులు; రామమోహనుఁడు

వైష్ణవసంప్రదాయమునకుఁ జెందినవాఁడు నని చెప్పితిమికదా! ఒకనాఁడు సూర్యోదయమున మాతామహుఁడు పూజానంతరమున మనుమనిచెవిలో బిల్వపత్రము నుంచెను. ఇది చూచిన తారిణీదేవి పరుగిడివచ్చి యాపూజాదళమును దీసి పాఱవైచి తండ్రితో "నాయనా! మేము వైష్ణవుల మని తెలిసియుఁగూడ నీయిష్టదైవమునకుఁ బ్రియమైన దళమును నా కొమరున కిచ్చితి వేమి?" అని కసరి రామమోహనుని చెవిని దుడిచివేసెను. అంతఁ గోపోద్దీపితుఁడైన శ్యామభట్టాచార్యులు రామమోహనుని కులభ్రష్టుఁడగుటకు శపించెనఁట! కొమార్తె భయముతోఁ గంపించి యేడువసాగెను. ఇఁకఁ జేయునది లేక భట్టాచార్యు లామె నోదార్చి "దుఃఖపడకుము. కులభ్రష్టుఁడైనను నీపుత్త్రుఁ డొక యపూర్వవ్యక్తిగా వర్ధిల్లును. దేశదేశములందును నితనికీర్తి వ్యాపించును" అని తారిణీదేవికి దుఃఖోపశమనముఁ గావించెను. కుశాగ్రబుద్ధిగల రామమోహనుఁడుసైతము తనలోఁ దాను "నాతల్లి కొకదేవుఁడును, నా తాతగారి కొకదేవుఁడునా! అందువలనఁ గలహములా! ఈ విచిత్రములో నున్న సత్యము నన్వేషింపవలయును" అని తర్కించుకొనఁ బ్రారంభించెను. తాతగారిశాపము రామమోహనుని జీవితచరిత్రమం దెట్టి మహదాశీర్వచనముగాఁ బరిణమించెనో యిఁక గ్రహించెదముగాక!

రామమోహనుఁడు దృఢకాయుఁడు. ఆజానుబాహుఁడు. పుష్టిగా నుండెడివాఁడు. విశాలవక్షముఁ గలిగి చూచుట

కింపుగా నుండెడివాఁడు. చామనచాయ గలిగి స్ఫురద్రూపియై యుండెను. వెడల్పగు నొసలు, తీవితోఁగూడిన చూపు, కాంతితో నిండిన నల్లనికన్నులు గలవాఁడు. మనస్సు నొచ్చినపుడు నయనము లశ్రువులతో నిండుచుండెనఁట. పొడవై, తిన్ననై కొనదేరిన ముక్కు, స్వేచ్ఛాశక్తిని బ్రతిఫలించు పెదవులు, చిన్నదైన మీసము, పొడవై దట్టమైన యుంగరములతోఁ గూడిన తలకట్టును నుండెడివి. ఇది రామమోహనుని బాహ్యరూపము. గంభీరమై, సౌందర్యవంతమై, ప్రేమపూరితమైన ఆయనస్వరూపమును, వర్చస్సును, చూచువారల కచ్చెరువొనర్చుచుండెడి దని సమకాలికులే వ్రాసియున్నారు.

## జననము ; బాల్యము ; విద్యాభ్యాసము

వంగదేశమందలి యప్పటి బర్ద్వాన్ జిల్లాయందలి రాధానాగూర్ లేక రఘునాథపూర్ అనుగ్రామమున తారిణీరమాకాంతులకు రామమోహనుఁడు క్రీ. వె. 1772 సంరం మే 22 వ తేదీని జన్మించెను. ఆతఁడు 1784 లో పుట్టెనని కొన్ని గ్రంథములలో నున్నది కాని, 1772 లోనే జన్మించినట్లు నిదర్శనములు చాల కనఁబడుచున్నవి. రమాకాంతరాయలకు మఱియొక భార్యవలన రామలోచనుఁ డను పుత్త్రుఁ డుద్భవించెను. ఆతనిగుఱించి మన కేమియుఁ దెలియదు. ఫూల్ఠాకురాణియందుఁ బుట్టిన యిద్దఱుకొమరులలో జగన్మోహనుఁ డనునాతఁడు రామమోహనుని యన్న. పుష్పము

విడినతోడనే సువాసనల వెదచల్లురీతిని రామమోహనుఁడు తొలుతనే గొప్ప ధీశక్తిఁ బ్రదర్శింపసాగెను. తండ్రి యాతని యద్భుతమేధను గుర్తించినవాఁడై కొమరునియెడఁ బ్రత్యేక శ్రద్ధయు, నాదరణయు వహించియుండెను. కాని, యప్పటి మూఢాచారములప్రకారము బాల్యమునందే తండ్రి కొమరు నకు వివాహ మొనర్చెను. మొదటిభార్య శైశవమునందే చనిపోయినందున రామమోహనుఁడు తొమ్మిదివర్షముల వాఁడై యుండఁగనే యొకసంవత్సరములో మఱి యిద్దఱభార్య లను బెండ్లిచేసెను. రెండవభార్య 1824 లోఁ జనిపోయెను. మూఁడవభార్య రామమోహనుని యనంతరము 1858 లోఁ జనిపోయినట్లు తెలియుచున్నది. ఇట్లే మూఁడు వివాహము లును రామమోహనునకు సరిగా విద్యాభ్యాసప్రారంభము కాకమున్నే జరిగియుండెను.

తల్లిదండ్రులు చిన్నతనమందే యథావిధిని విద్యాభ్యా సము చేయించి గ్రామ 'పాఠశాల'కు రామమోహనుని బంపు చుండెడివారు. ఇంటివద్ద వేఱుగ నొక మౌల్వీచేఁ దండ్రి సమక్షమునఁ బర్షియన్ భాష నేర్పించుచుండెడివారు.

ఈవిధమున స్వగృహమునఁ గొంతకాలము విద్య నేర్చిన పిదప రామమోహనుఁడు పర్షియన్, అరబ్బీభాషలు నేర్చు కొనుటకు పాట్నానగరమునకు వెడలెను. ఆదినములలో నీ భాషలు నేర్చుట నాగరికతాలక్షణము. పాటలీపుత్ర మందు లకు మూలస్థానము. ఇచ్చటనే రామమోహనుఁడు మహమ్మ

దీయుల వేదగ్రంథమగు ఖురాను నరబ్బీభాషలోఁ బఠించు చున్నప్పు డాయనకు హిందువుల విగ్రహారాధనవిషయమై శంకలు బయలుదేఱెను. 'సూఫీ' లను మహమ్మదీయభక్తవరే ణ్యులు వ్రాసిన వ్రాతలు వేదాంతసారముతో నేకీభవించుటఁ జూచి యాతఁ డచ్చెరు వొందెను. తన జీవితాంతమువఱకు ఇస్లామువాసన యాతని దైనిక, నైతికచర్యలందు విడువలేదు. పైజామాలఁ దొడిగి, లాల్చి ధరించి, శాలువ నొకదానిని తలకుఁ జుట్టి యింటివద్దసైతము తల నొకటోపీయైనను లేకుండఁ గూర్చుండక మిత్రులతో మాట్లాడునపుడుగూడ "హాఫీజ్, రూమి, సాది" మున్నగు సూఫీభక్తవరేణ్యుల గ్రంథములనుండి యుదాహరణము లిచ్చుచుండువాఁడు. ఇట్లు వేషభాషలందుఁ గూడఁ జిన్ననాఁ డబ్బిన మహమ్మదీయ సంప్రదాయములనే యనుసరించుచుండెడివాఁడు. దారిపోవువారలకు మొగలాయి పాదుషావలెఁ గాన్పించువాఁడు. తినుబండములందుసైతము రాత్రివేళలందు "హారీర" యను నొక మహమ్మదీయులమితా యిని దినువాఁడు. పెద్దవాఁ డైనపిదప మహమ్మదీయుఁ డగు నొకయనాథబాలునిఁ బెంచి పెద్దచేసి తనతో సీమదేశమునకుఁ దీసి కొనిపోయెను. తుదిని ప్రాణములు విడుచుచున్నప్పుడు దగ్గఱ నున్న రాజారామ్ ఈమహమ్మదీయబాలుఁడే! చిన్నతనమునఁ బాటలీపుత్రమం దభ్యసించిన యరబ్బీభాష రామమోహనుని జీవితవిధానమం దెట్టిపరిణామముఁ గల్పించెనో చూచితిరా! అరబ్బీభాషలోని కనువదింపఁబడిన యూక్లిడ్, ఎరిస్టోటిల్ రచిం

చిన గణిత, ఖగోళశాస్త్రాదులు తాను సంపూర్ణముగాఁ బఠించెను. ఇట్లు రెండుసంవత్సరములు పాటలీపుత్రమునఁ గడపి, పిదప స్వగృహముఁ జేరెను. ఈకాలపు పెద్దలును, చిన్నలును, రామమోహానునివలె రెండుమతముల గ్రంథములనుగూడఁ బఠించినచో నేఁటి హిందూమహమ్మదీయకక్ష లుండవుకదా !

12 సంవత్సరముల వయస్సులోని రామమోహానుఁడు కాశి కేగి సంస్కృతభాషలోఁ బ్రవీణుఁ డాయెను. 16, 17 సంవత్సరముల బాలుఁడైన యీతఁ డింటివద్దఁ బ్రతిదినము మతవిషయమై యాలోచించుటయు నేదియోదీక్షతో వ్రాయుచుండుటయుఁ దండ్రి చూచుచుండెను. ఒకప్పు డావ్రాతప్రతి యేమై యుండునని రమాకాంతరాయలు రహస్యముగఁ జూడ నది విగ్రహారాధన మున్నగు పూర్వాచారములను ఖండించునదిగాఁ గాన్పించెను. రమాకాంతుఁ డాగ్రహపడి కొమరుని రావించి వానితో వాదించెను. కాని, నిష్ప్రయోజన మగుటచే రామమోహాను నింటినుండి వెడలిపోవ్వనెను.

## దే శా ట న ము

షోడశవర్షప్రాయుఁడగు రామమోహానుఁ డీకఠినశాసనమున కెంతమాత్రమును జంకక దేశాటనమునకు నిర్భయముగాఁ బయన మయ్యెను. కాలినడకతోనే పెక్కువేలమైళ్లు వివిధదేశములలోఁ దిరిగినట్లును, ఆర్యావర్తముఁగూడ దాఁటి వెడలినట్లును, రామమోహానుఁడు స్వీయచరిత్రయందు వ్రాసి

కొనెను. మానవమాత్రులకు దాఁటుట కశక్యమైన హిమాలయములనుసహితము దాఁటి బౌద్ధమతమునుగూర్చి తెలిసికొనుటకు టిబెట్టునకుఁ బోయెనఁట. రామమోహనుఁ డీవిషయమై లండనులోఁ దనతో స్వయముగా ముచ్చటించినట్లు కార్పెంటర్ దొరగారు వ్రాసియుండిరి. రామమోహనుఁడు బౌద్ధమతమును గుఱించియు, మధ్యహిందూస్థానమందలి కొండజాతుల మతాచారములను గుఱించియుఁ, బాట్నాలో నున్నప్పుడే కొంతవఱకు విన్నవాఁడై యప్పటినుండియు దానిని స్వయముగఁ దెలిసికొనుటకుఁ గుతూహలపడుచుండెడివాఁడు. విజ్ఞానసేతు లేని యీదినములలో విగ్రహారాధన నిరసించుచు నొక చిన్నపుస్తకము వ్రాయుటయుఁ దత్ఫలితముగఁ బ్రయాణసౌకర్యము లేని యాకాలములో వేలకొలఁదిమైళ్ళు మతాన్వేషణకై సాహసముతోఁ బదునాఱేండ్లబాలుఁడు సంచరించుటయు నెవరికైన నాశ్చర్యముఁ గొల్పకమానదు. ఆకాలములో మన కథానాయకుని యూరులోనున్న బైరాగిగుంపులు దేశాటనముఁ జేయుచుఁ బుణ్యతీర్థములు సేవించు వాడుక గలదు. ఇట్టిగుంపులలో మన రామమోహనుఁడుకూడఁ గొంతకాలము చేరియుండవచ్చును.

టిబెట్టులో సుమారు మూఁడుసంవత్సరము లుండెను. అచ్చటఁగూడ విగ్రహారాధన ఖండించుటచే "లామా" అను బౌద్ధమతగురువుల నారాధించువారల కాగ్రహము కల్గించినవాఁడాయెను. ఎచటికిఁ బోయినను తన యంతరాత్మప్రబోధమును వీడని రామమోహనునకు నిట్టియిక్కట్లు కలుగుటలో

నాశ్చర్య మేమియు లేదు. కొందఱు 'లామా' పక్షపువార లీత నిని జంపఁ బ్రయత్నింపఁగాఁ గరుణారసపూరితలగు కొంతమంది టిబెట్టుకాంత లీతని కావిషయము నెఱింగించి రక్షించిరి. ఇట్టి ప్రాణదానమున కాతఁడు స్త్రీజాతియెడఁ గృతజ్ఞుఁడై తనయా వజ్జీవము వారి యభ్యుదయమునకుఁ బాటుపడెను. నలువది సం వత్సరముల యనంతర మీవిషయము తనతో స్వయముగ రామమోహనుఁడు తెలిపినట్లు కార్పెంటర్ దొరవారు ప్రక టించియుండిరి.

## పు న రా గ మ న ము

ఇరువదవయేఁట రామమోహనుఁడు స్వదేశమునకుఁ దిరిగివచ్చెను. పుత్రవియోగబాధ ననుభవించుచుండిన తల్లి దండ్రులు కొమరుని పునరాగమనమునకు సంతసించిరి. రామ మోహనునికి మొదటిభార్య గతించియుండుటచేఁ దండ్రి పట్టు దలతో రెండువివాహములను మరలఁ జేసెను. కాని, తమ జీవితములందును, గృహవ్యవహారములందును గల యనేక వ్యత్యాసములు, తండ్రికొడుకుల కప్పుడప్పుడు వాగ్వాదము లకు, మతకలహములకుఁ గారణ మగుచుండెను. అందుచే నాతఁడు స్వగృహమున నెక్కువకాల ముండక కొన్నిసంవత్స రములపాటు కాశీలో నుండి సంస్కృతమం దసామాన్యపాండి త్యమును గడించి యుపనిషత్తులు మున్నగు హిందూవేదాంత గ్రంథములను బఠించెను.

రమాకాంతరాయలు 1803 సంవత్సరములో మరణించెను. తనతండ్రి మరణశయ్యపై నున్నపు డాతని ప్రక్కనే నిలువఁబడి కడవఱకు నాతఁడు చేయుచుండిన రామనామస్మరణ విస్మయవిషాదములతోఁ దాను గనియుంటి నని రామమోహనుఁడు తనమిత్రుఁడగు 'ఏడం' దొరగారితోఁ జెప్పియుండెనఁట. పితృమరణానంతరమున మన కథానాయకుఁడు మూర్షిదాబాదులో నివాస మేర్పఱచుకొనెను. అచ్చటనే 'తుఫాత్ ఉల్ మువాహిద్దీన్' అను పర్షియన్‌గ్రంథము నొకదానిని అరబిక్ ఉపోద్ఘాతముతోఁగూడఁ బ్రచురించెను. అందుఁ గొన్ని మతములందున్న విగ్రహారాధనవిధానములను దదితరమూఢవిశ్వాసములను సహేతుకముగా ఖండించి 'ఈశ్వరుఁ డొక్కఁడే' అని నిరూపించి విశ్వజనీనమగు మతమునకుఁ బునాది వేసెను. వివిధమతములవిషయమై చర్చలతోఁగూడిన 'మనాజరతుల్ అదియాన్' అను మఱియొక పర్షియన్‌గ్రంథముఁగూడ నాకాలమందే ప్రచురించెనఁట.

## ఉ ద్యో గ ము

రామమోహనుఁడు 1803 సం॥రం మార్చి 7 వ తేదీని ఢక్కా జలాల్‌పూర్ (ఇప్పటి పరిద్‌పూర్) జిల్లాకలెక్టరగు వుడ్‌ఫోర్డుదొరవారిక్రిందఁ దూర్పిండియా వర్తకసంఘములో 7–3–1803 వ తేదీని ప్రప్రథమమున దివాన్ ఉద్యోగము స్వీకరించెను. కాని, ఆ కలెక్టరుదొరకు జబ్బుచేసి సెలవు పెట్టి

టచే రామమోహనుఁడుకూడ 14—5—1803 తేదీని ఉద్యోగమునకు రాజీనామా నిచ్చెను. ఇది జరిగిన కొలఁదికాలమునకే పితృవియోగము సంభవించెను. తిరిగి వుడ్‌ఫోర్డుదొరగారు 1804 వ సంవత్సరం మార్చి నెల ప్రాంతమున మూర్షిదాబాదుకోర్టు రిజిష్ట్రారుగాఁ బ్రవేశించినపుడు రామమోహనుఁడుకూడ నచ్చటనే చేరెను.

1805 వ సంవత్సరంలో "జాన్‌డిగ్బీ" యను దొరగారు రంచిపట్టణసమీపమున నుండు రామ్‌ఘుర్‌లో జిల్లాకోర్టు రిజిష్ట్రారుగా నుండిరి. అప్పుడు రామమోహనున కాయనతోఁ బరిచయము కలిగెను. 1806 సంవత్సరం ఆగస్టు మొదలు, అక్టోబరువఱకు డిగ్బీదొరగారు మేజస్ట్రేటుపదవిలో నుండఁగా వారి క్రింద మన రామమోహనుఁడు కోర్టు సిరస్తదారుగా నుండెను. 1808 వ సంవత్సరము జనవరి మొదలు, జూలైవఱకు జెస్సూర్ కలెక్టరుగానున్న డిగ్బీదొరగారి కాంతరంగికుఁడగు "మున్షీ" గాఁ బనిచేసెను. 1809 సంవత్సరము జనవరి 1వ తేదీని భగల్‌పూర్‌లో జిల్లాకోర్టు రిజిష్ట్రారుగానున్న డిగ్బీదొరవారి వద్దకే పోయి వారి సొంతయుద్యోగములో నుండెను. వారితోఁ దిరిగి రంగపూర్ పోయెను. అచ్చట 1809 సంవత్సరం డిసెంబరు నెలలో కలెక్టరుఆఫీస్ దివాన్‌గిరి ఖాళీ రాఁగా నాస్థానమునకు రామమోహనుఁడు నియమింపఁబడెను. కాని, ఆ యుద్యోగము 5 మాసములు మాత్రమే చేసి రెవిన్యూబోర్డువారి యం

గీకారము బడయనందున విరమింపవలసివచ్చెను. డిగ్బిదొరగారుమాత్రము రామమోహనునియం దత్యంతాదరణమును, గౌరవమును గలవారగుటచే నాయనను విడువక రంగపురమం దొక జమిందారీకుటుంబమందలి మైనర్లకు రక్షకుండుగా నియమించెను. 1815 సంగరం మార్చిలో, ఆ జమీందారీయువకులు స్వయముగా వ్యవహారములు చూచుకొనుటకుఁ దగినయీడు వచ్చినందున రామమోహనుఁడు వారిని విడిచి కలకత్తాలో స్థిరనివాస మేర్పఱచుకొనెను. ఇదియే యాయన యుద్యోగదశయొక్క సంగ్రహచరిత్ర.

స్వాతంత్ర్యేచ్ఛయే ప్రధానలక్షణముగాఁగల మనరామమోహనుఁడు డిగ్బిదొరగారివద్ద నుద్యోగము స్వీకరించినరీతి యొక విచిత్రఘట్టము. పిత్రార్జిత మెంతమాత్రమును జిక్కకుండుటకుఁ గొంద ఱసూయాపరులు ప్రయత్నముచేసిరి. రామమోహనుఁ డందుచేత వ్యాజ్యములలోఁ జిక్కుకొని తనకుఁ జెందిన యాస్తినంతటిని భక్తివిశ్వాసములతో మాతృదేవతకే సమర్పించి యుద్యోగప్రయత్నము చేసెను. డిగ్బిదొరగారు రంగపూరు కలెక్టరుపదవిలో నున్నప్పు డీతఁ డొకదరఖాస్తు వ్రాసి యిచ్చెను. అందుఁ దా నాయనవద్దకు వచ్చినపుడెల్ల నుచితరీతిని సుఖాసీనుఁడుగాఁ జేయఁబడుటయు, సదా సగౌరవముగ నాదరింపఁబడుటయుఁ దన యుద్యోగస్వీకరణమునకు ముఖ్యమైన షరతులుగాఁ గోరెను. నేఁటికిని ఎట్టియున్నత

పదవులం దున్నవార లైనను తమయధికారులకు వంగి వంగి సలాములు చేయువార లుండ నొకశతాబ్దమునకుమున్నే భార తీయుఁ డొకయాంగ్లయజమానునికి మొగమాటము లేకుండ షరతుల నియమించి యాత్మగౌరవమును నిలువుకొనుట ఎట్టి సాహసకృత్యమో పాఠకులే గ్రహింతురుగాక! ఉదారస్వభా వులైన డిగ్బిదొరగా రిరువదినాలుగు వత్సరముల యువకుని స్వేచ్ఛాశక్తియు, నాత్మగౌరవమును విస్మయముతోఁ గాంచి, మెచ్చి రామమోహనున కుద్యోగము నిచ్చి, యెప్పటికప్పుడు తమ వెంటనే తీసికొనిపోవుచుండెడివారు. ఇట్టి గుణగ్రహణ పారీణతగల డిగ్బిదొరగారుకూడఁ బ్రశంసాపాత్రులు. అధికా రులలో నట్టివా రరుదుగ నుందురు. ఈసంబంధమే వారిరు వురకును బరస్పరాదరణాభిమానములు వృద్ధి నొందించి శాశ్వ తబంధ మాయెను. దేశసౌభాగ్యమున కిరువురును ననేకవిష యములలోఁ బనిచేసి యుండిరి.

రంగపురమం దున్నకాలమున రామమోహనుఁడు వృథాగ కాలము గడుపలేదు. ఒకవైపున వివిధవిషయము లలో విజ్ఞాన మార్జించుచు మఱియొకవైపున హిందూ మహ మ్మదీయ జైనమతస్థులతో వాగ్వివాదము సల్పుచుఁ దాను నమ్మిన సర్వమతసారాంశము ప్రజలపై వెదచల్లుచుండెను. జైనమతమందలి 'కల్పసూత్రము' మున్నగు గ్రంథములు సం పూర్ణముగాఁ బఠించెను. వేదాంతశాస్త్రమునే గాక నవీనతాం త్రికశాస్త్రమును గూడ హరిహరానందతీర్థస్వాములవారి

సాహాయ్యమునఁ బఠించుచుండెను. తనగృహమందుఁ బ్రతి సాయంకాలము వివిధజాతులవారుఁ జేరి మతచర్చలు సాగించు చుండిరి. ఈచర్చలవలనఁ గొంతకాలమునకు రంగపురనివాసు లలో నాందోళన బైలుదేఱె పర్షియన్ సంస్కృతవాఙ్మయ ములయందుఁ బ్రజ్ఞగల గౌరీకాంతభట్టాచార్యుఁడను బ్రాహ్మ ణపండితుని నాయకత్వమున సనాతనహిందూమతోద్ధరణకు పోటీసభలు జరుగుచుండెను. రంగపురములోఁ గోర్టునకు నాలుగుమైళ్ళదూరముననే మహీగంజి యను స్థలముసమీప మున రామమోహనుఁ డొక సొంతగృహము నిర్మించుకొని యుండెనఁట. ప్రజోపయోగార్థ మనేక కార్యములకుఁ గూడ ధనము వెచ్చించుచుండెనని ప్రతీతి కలదు. ఇప్పటికిని అచ్చట నున్న పెద్దచెఱువు, ఆయన త్రవ్వించినదే యని యొకవాడుక కలదు. రంగపురవాస్తవ్యులు రామమోహనుని యసామాన్య పాండిత్యముఁ జూచి "మౌల్వీ" యని పిలుచుచుండిరఁట.

## ఆంగ్లవిద్యాభ్యాసము

తూర్పిండియా వర్తకసంఘములో నుద్యోగము చేయ నెంచిన రామమోహనుఁడు తన యిరువదిరెండవయేఁట, ఆంగ్ల భాష నభ్యసింప మొదలిడి డిగ్బిదొరగారి సాంగత్యలాభమునఁ గొలఁదిసంవత్సరములలోనే యాంగ్లమున బాగుగఁ జదువను వ్రాయను నేర్చుటయేగాక నా వాఙ్మయమం దపారపాండి

త్యము సంపాదించుకొనెను. రామమోహనుని యాంగ్లభాషాభివృద్ధినిగుఱించి డిగ్బిదొరగారే ఆంగ్లమున ననువాదమైన రామమోహనరాయలవారి యుపనిషత్తు వేదాంతసారము అను గ్రంథముల యుపోద్ఘాతములలో నిట్లు వ్రాసిరి. “1895 వ సం॥రమున మొట్టమొదట రామమోహనుని పరిచయభాగ్యము నా కబ్బునరి కాయన తనభావము లర్థమగురీతి నాంగ్లములో సంభాషణఁ జేయఁగల్గియుండెను కాని తప్పులు లేక వ్రాయుట కప్పటికి నేర్పు రాలేదు. నేను కలెక్టరుగనున్న 5 సం॥రములలో నావద్ద నుద్యోగములో నుండి నాయుత్తరప్రత్యుత్తరములను దగుశ్రద్ధతోఁ బరీక్షించుచు, నావద్దకు వచ్చుచుండెడి యైరోపా దేశస్థులతో నాంగ్లమున జంకు లేక సంభాషించుచుఁ దుదకు సరియగుభాషలో వ్రాయుటకును, సంభాషించుటకును దగుజ్ఞాన మలవఱచుకొనెను. ఆయనకుఁ బ్రతిదిన మాంగ్ల వార్తాపత్రికలు చదువుటయందుఁగూడ నభిరుచి మెండుగా నుండెను. ఆయన ముఖ్యముగ నైరోపాఖండ రాజకీయములన్నా నాతురతతోఁ జదివెడువాఁడు. ఫ్రెంచివిప్లవమునందును, నెపోలియన్ దిగ్విజయవార్తలందును అమితోత్సాహముఁ జూపుచుండువాఁడు. నెపోలియన్ రాజ్యభ్రష్టుఁ డైనపిదప, ఆయన యెడలఁ గొంతగౌరవము తగ్గినను స్వాతంత్ర్యోద్యమములందు మాత్ర మెప్పటికాంక్షఁ జూపుచు విదేశవార్తాపత్రిక లన్నియుఁ గడుశ్రద్ధతోఁ జదివెడువాఁడు. 1818వ సం॥రమునకుఁ దనతో మాట్లాడునప్పు డాంగ్లభాషయం దద్భుతమగు పాండిత్యముఁ

జూపినట్లు బకింగ్‌హామ్‌దొరగారు వ్రాసియున్నారు. జెర్మీ బెంతిహామ్ అను సుప్రసిద్ధాంగ్లతత్వవేత్త రామమోహన రాయలవారి యాంగ్లగ్రంథము నొకదానినిఁ జూచి 'గ్రంథకర్త పేరుఁ జూచియుండనిచో నీగ్రంథము నెవరో ఆంగ్లపండిత శ్రేష్ఠుఁడు రచించిన ట్లనుకొనియుందును' అని జాబు వ్రాసిరి. ఆజాబునందే సుప్రసిద్ధులు జేమ్సుమిల్ దొరగారి శైలితో రామ మోహనుని శైలిఁ బోల్చియుండిరి."

ఇట్లు రంగపురమం దనేక కార్యములందు నిమగ్నుఁ డయ్యు రామమోహనుఁ డపూర్వాంగ్లవిద్యాభ్యాసముఁగూడఁ జేసియుండెను. ఉద్యోగములో నున్నను ముందు తాను నెఱ వేర్చవలసిన జీవితాశయము మఱవక తాను జేయవలసిన ఘన కార్యములకు సర్వవిధముల సంసిద్ధుఁ డగుచుండెను.

తండ్రి గతించినపిదపఁ బిత్రార్జిత మంతయు జగన్‌మో హనరాయి యెనిమిదిసంవత్సరములు చూచి 1811 వ సం॥ర ములో నాతఁడుగూడ మరణించెను. పిత్రార్జిత మేమైనను సోద రుని మరణానంతర మైనను రామమోహనునకుఁ దక్కెనా? యను విషయము నేఁటికిఁగూడ సంశయాస్పదముగ నున్నది. పిత్రా ర్జిత మాావంతయైనను బొందక స్వార్జితమువలననే జీవించుచుం డిన ట్లాకాలపుఁగోర్టు శాగితములలో నిదర్శనము లున్నవి. కొంత కాలము రామమోహనునకును, అన్నకొమరుఁడగు గోవింద ప్రసాదునకును వ్యాజ్యములు జరిగి తుదకు గోవిందప్రసాదే రామమోహనుని క్షమార్పణ వేఁడినట్లు తేలుచున్నది. ఏది

యెట్లున్నను రామమోహనుఁడు పిత్రార్జితమువలని సుఖ మేమి యు లేక మొదటినుండియు స్వశక్తిపై నాధారపడియుండి నట్లు స్పష్టము.

## ఆత్మీయ సభ

1814 వ సం॥రమున డిగ్బిదొరగారు స్వదేశమున కేగఁ గనే రామమోహనుఁడు 1815 వ సం॥ర ప్రాంతమునఁ దా ననుసరింపఁదలంచిన జీవితవిధానమునకుఁ గలకత్తానగరమున స్థిరనివాస మేర్పఱచుకొనెను. ఇప్పటి కాతనికి నలుబదిసంవత్సరములు దాఁటెను. కలకత్తాకు వచ్చిన మఱుసటిసంవత్సరమే తాను తర్జుమాచేసిన వేదాంతభాగమును ప్రచురించి, ఆత్మీయ సభ యను నొకసంఘమును స్థాపించెను. మతవిషయకచర్చలను నిరాఘాటముగ సాగించుటయు, శాశ్వతమగు మతసఖ్యమును ప్రచారము సేయుటయు నీసభయొక్క ముఖ్యోద్దేశములు. రంగపురమందు రామమోహనుని దినచర్య లన్నియుఁ బలుతావులం దావఱకే వ్యాపించియుండుటచే నాయనయొక్క సంస్కరణసూత్రము లన్నియు విద్యాధికుల కందఱకును దెలిసియే యుండెను. ఆయనయశస్సు నలుదిశలయందును వ్యాపింప మొదలిడెను. అనేకు లాయనయెడల సానుభూతిఁ గల్గియుండిరి. పాశ్చాత్యనాగరకతయందుఁ గలకత్తా ముందంజ వేయుటచే నచ్చటివిద్యాధికు లందఱును నీయనకుఁ దమసానుభూతిఁ జూపుచుండిరి. కావున రామమోహనుఁ డేతెంచినతోడనే యనేక

సంపన్నగృహస్థులు, గౌరవముగలవారు, ఆయనచుట్టును జేర మొదలిడిరి. అందు నేటి యాసియాకవిసార్వభౌముఁడగు రవీంద్రుని తాతగారగు ద్వారకనాథ్ ఠాకూరుగారు ముఖ్యముగాఁ జేర్కొనఁదగినవారు. ఇంకను ననేకులు విద్యావంతులు, ధనవంతులు రామమోహనుని స్నేహముఁ గోరి యాత్మీయసభాగోష్ఠికి హాజరగుచుండిరి.

నేఁడు కలకత్తా అప్పర్ సర్క్యులర్ రోడ్డులో 113 వ నెంబరుగల గృహమే యానాఁడు 'మణిక్తల ఉద్యానవననివాస' మనుపేర రామమోహనుఁడు నివసించిన గృహము. అది సుమారు 5 యకరములభూమి—పాశ్చాత్యఫక్కి—నమర్చఁబడిన బంగాళా. ఇచ్చటికే దేశదేశములనుండి రామమోహనుని జూచుట కనేకులు వచ్చుచుండెడివారు. రామమోహనునకుఁ గలకత్తాలో 'సిమ్లాగృహ' మనుపేర మఱియొక నివాసముండెడిది. ఇప్పు డది అమ్‌హరెస్టువీధిలో 84వ నెంబరున్న గృహము. ఆగృహమందే రామమోహనుని కొమరులగు రాధాప్రసాద్ రామప్రసాద్ నివసించెడివారలు. అందుఁ బ్రథమపుత్త్రుఁడు న్యాయవాదివృత్తి నవలంబించెను. రామప్రసాద్ కలకత్తా ఉన్నతన్యాయస్థానమునకు నియమింపఁబడిన భారతీయన్యాయాధికారులలోఁ బ్రప్రథముఁడు.

రామమోహనునివద్దకు వచ్చెడివార లంద ఱేకోద్దేశముతో వచ్చువారు గారు. ఆయన సాంగత్యమే మహాగౌరవమని యెంచెడివారలు కొందఱును, దమ యైహికకష్టనష్టము

లను జెప్పుకొని యాయన సలహాను, సాహాయ్యమును నపే క్షించువారు మఱికొందఱును, నిజముగ నాయనభావము లతో నేకీభవించెడివారు కొందఱును నయ్యెడువారు. తన యాశయములతో సంపూర్ణసానుభూతిని జూపించు కొలఁది మందితో, ఆత్మీయసభ సాగించువాఁడు. అందుఁ బెక్కు మంది తన యీఁడు జోడు వారగుటచే వారలను పర్‌ష్యన్ భాషలో సోదరు లని సంబోధించుచుండెడివాఁడు. పూర్వ శాస్త్రపరిశోధనలందుఁ దన కమితముగఁ దోడ్పడువారు పం డిత శివప్రసాద్ మిశ్ర, హరిహరానందస్వామి యనువా రిరువు రుండిరి. ఈస్వాములవారి విషయమై యింతకుముందే విని యుంటిమి. ఈతఁడు కలకత్తా కనేకపర్యాయములు వచ్చి రామ మోహానునితోఁ గాలముఁ గడపుచుండెడివాఁడు. ఒకమాఱు తనకనిష్ఠసోదరుఁడగు రామచంద్రుని వెంటఁగొనివచ్చి రామ మోహానునకు నొప్పఁజెప్పెను. ఈతనినే తరువాత బ్రహ్మ సమాజమునకుఁ బ్రధానాచార్యునిగా నియమించి రామమోహా నుఁడు సీమ కేగెను. పండిత రామచంద్రవిద్యావాగీశుఁడు అను సుప్రసిద్ధాచార్యవర్యుఁ డీతఁడే.

మొదటి రెండుసంవత్సరములును వారమున కొకసారి యాత్మీయసభాసమావేశములు రాముమోహానుని యుద్యాన వనగృహమున జరుగుచుండెను. అందు శివప్రసాద్‌మిశ్ర హిందూమతగ్రంథమందలి మహావాక్యముల నుపదేశించు చుండెను. రామమోహానుఁడు చేసిన కొన్నిగీతములు 'గొలామ్

అబ్బాన్' అను గాయకశిఖామణి పాడుచుండెడివాఁడఁట. రెండుసంవత్సరములకుఁ బిమ్మట రామమోహనుని సిమ్లా గృహమందుఁ గొంతకాలము, బీహారీలాల్‌గారి గృహమందుఁ గొంతకాలము ఈ సమావేశములు జరుగుచుండెను. ఇచ్చటనే 1819 వ సం॥రములో రామమోహానునకును, తనపేరు విని చెన్నపురినుండి యేతెంచిన సుబ్రహ్మణ్యశాస్త్రి యను బ్రాహ్మణోత్తమునకును విగ్రహారాధనవిషయమై యఖండముగ వాగ్వాదములు జరిగెను. ఈచర్చను వినుటకుఁ గలకత్తా యందలి ముఖ్యు లెల్లరును వచ్చియుండిరి. వారిలో నప్పటి సనాతనహిందూనాయకుఁడగు రాధాకాంతదేవ్ అనునాతఁడు కూడ నుండెను. ఈవాదములో రామమోహనుఁడు చూపిన యపారపాండిత్యము, అసాధారణప్రజ్ఞ యసమానము లని ప్రఖ్యాతిఁ గాంచెను. 1819 వ సంవత్సరాంతమున కాత్మీయ సభ రద్దు చేయఁబడెను.

## సమరసన్నాహము

కలకత్తానగరమందు స్థిరనివాస మేర్పఱచుకొన్న పిదప నొకదానివెనుక మఱియొకటిగా ననేకగ్రంథములు ప్రకటించుచుండెను. సంస్కృతవాఙ్మయపఠనమం దుపనిషత్తులందలి మహోన్నతములైన యాస్తికసిద్ధాంతప్రమాణములను జూచి యుచ్చైరువంది 1819 వ సం॥రములో ముఖ్యమైన యుపనిషత్తులను నాంగ్ల వంగ భాషలలోనికి ననువదించి తన యుపోద్ఘాత

ములతోసహా ప్రచురించెను. వేదాంతసూత్రములలోఁ గొన్నిం టికిఁగూడ నుపోద్ఘాతముల వ్రాసి ప్రచురించెను. అతఁడు తలంచినట్లే యీబహుగ్రంథప్రచురణముచేత వంగదేశమం దలి హిందూసంఘములో నధికమగు నల్లకల్లోలములు ప్రారంభ మయ్యెను. ఈ యాందోళన సీమవఱకుఁగూడ వ్యాపించెను. ఆంగ్లదేశమునందును, ఫ్రాన్సుదేశమందును రామమోహ నుఁడు ప్రచురించిన వేదాంతసారము ప్రసిద్ధికెక్కెను. ఈ గ్రంథప్రచురణ ప్రారంభించినదాది సాంఘికబహిష్కారము విజృంభించెను. తన యనుచరులలో ముఖ్యులుసహితము సంఘమును విడనాడిరి. సంఘముయొక్కయు, మిత్రబృందము యొక్కయుఁ గ్రోధావేశమంతయు నపూర్వమగు సహనము తోను, ఆత్మశక్తియందుఁగల విశ్వాసముతోను రామమోహ నుఁడు సహించెను. 'నాయంతరాత్మప్రబోధము ననుసరించి బ్రాహ్మణకులమందుఁ బుట్టిన నేను, బంధుమిత్రులదూషణ లకు లోనైతిని; కాని యిట్టినిష్ఠురము లెన్నివచ్చినను నెప్పటి కేని నావినయపూర్వకములైన ప్రయత్నము లన్నియు న్యాయ దృష్టితోఁ బరిశీలింపఁబడునట్టియుఁ గృతజ్ఞతతో స్వీకరింపఁ బడునట్టియు దినము రాకపోదను నమ్మకమున వానిని శాం తితో సాధింపఁగలను. మానవమాత్రు లేమన్నను నాకొక మనశ్శాంతిమాత్రము గలదు. అంతరంగికముగ వీక్షించు వాఁడును, బహిరంగముగ బహూకరించువాఁడును నగు నాసర్వసాక్షికిమాత్రము నాయుద్దేశములు స్వీకరణీయములే

యని యాంగ్లములోని కనువదించిన వేదాంతసంగ్రహము యొక్క యుపోద్ఘాతములో నాయన వ్రాసెను. అదెంత సత్యమోకదా !

1820 వ సం॥రములో 'జీసస్ ఉపదేశములు – శాంతి సౌఖ్యములకు మార్గము' అను క్రొత్తగ్రంథముఁ బ్రచురించి తనమిత్రులను శత్రువులనుగూడ నివ్వెఱపాటొందునట్లు చేసెను. ఇంతవఱకును హిందూమతగ్రంథములే తనవాదముల కాధారముగాఁ జేసికొనెను. కాని యిప్పుడు నూతనపథముఁ ద్రొక్కఁ బ్రారంభించెను. ఈపుస్తకము బైబిలునందలి నాల్గవయధ్యాయములోని సారమును వ్యక్తపఱచెను. జీసస్ వాక్యములందలి స్వమతాభిమానబోధనలను వీడి సామాన్యమానవుల కెల్లర కనుసరణీయ మైనట్టినీతుల నిం దుదాహరించి మానవజాతి కుపకారము చేయుటయే యీగ్రంథప్రచురణమం దతని యుద్దేశము.

## క్రైస్తవులతోఁ గలహము

శరంపూరులోని క్రైస్తవమతప్రచారకు లగు కేరి, మార్షమాన్ మున్నగువారలు 'ఫ్రెండు ఆఫ్ ఇండియా' (Friend of india) అను మతవిషయమైన యాంగ్లవారపత్రికలో రామమోహనుఁడు రచించిన క్రొత్తగ్రంథము నెక్కువగా దూషించిరి. గ్రంథకర్తను విగ్రహారాధకుఁ డని తూలనాడిరి. మానవముక్తికి జీసస్ చెప్పిన నైతికాధ్యాత్మికసూత్రములే కాక యాయన యమోఘప్రభావములు గూడ నవసరమని

వాదన. క్రైస్తవసంప్రదాయములోఁ జెప్పఁబడిన త్రివిధము లగు నీశ్వరసాక్షాత్కారములను గుఱించి తీవ్రమగు వాద ప్రతివాదములు బయలుదేఱెను. రామమోహనుఁడు 'సత్య స్నేహితుఁడు' అనుపేర 'క్రైస్తవులకు విజ్ఞప్తి' యను శీర్షిక క్రింద, అద్వితీయమగు వాదనాశక్తితో, అసామాన్యమగు పాండిత్యగరిమతోఁ గూడిన నిరుపమానమైన మూఁడువ్యాస రాజములు ప్రచురించెను. దానికిఁ బరమేశ్వరుని యేకత్వము (ఏకమేవా ద్వితీయం బ్రహ్మ) నిరూపించుటయే యాయన ప్రధానోద్దేశము. ఈవ్యాసములందుఁ గన్పట్టు ప్రజ్ఞాపాండిత్య ములఁ జూడ రామమోహనుఁడు క్రైస్తవమతగ్రంథములను సహిత మాంగ్లమునసే గాక మూలభాషలగు హీబ్రూ, గ్రీకు భాషలలోఁగూడఁ జక్కఁగాఁ బరిశీలించియుండె నని స్పష్ట మగును. క్రైస్తవులతో మతవిషయమై యీకలహములందు రామమోహనుఁడు చూపిన ఓర్మి, గౌరవము, భాషాప్ర యోగము లపూర్వములని ప్రశంసింపఁబడియున్నవి. క్రైస్తవు లెంతదూషించినను మతవిషయక వివాదములందు మర్యా దగా మెలఁగుట తనవిధి యని రామమోహనుఁడు తనసహ చరులతో ననుచుండెను.

ఇట్లుండ మఱియొకవిషయము ప్రాముఖ్యముఁ గాంచి యాదినములలో నాందోళనకుఁ గారణ మాయెను. విలియం ఏడం అను నొకక్రైస్తవమతప్రచారకయువకుఁడు 1831 వ సంllరములో రామమోహనుని ప్రబోధమువలన బహిరంగ

ముగ యునిటేరియన్‌రక్షలోఁ (ఏకేశ్వరవిశ్వాసకులగు క్రైస్తవులు) జేరెను. రామమోహనుఁడు, ఏట్సు అను క్రైస్తవ మతప్రచారకునితోఁ గలిసి బైబిలులోని నాల్గధ్యాయములు వంగభాషలోఁ దర్జుమా చేయుచుండ ఏడమ్‌కూడ వారితోఁ జేర్రెను. ఈపని చేయుచున్నపు డేసుక్రీస్తుయొక్క యీశ్వరాంశమునుగూర్చి వాగ్వాదములు జరుగుచుండెను. రామమోహనుని వాక్చాతుర్యమునకును, పాండిత్యధోరణికిని, ఆగలేక యేట్సు పనినుండి తప్పుకొనెను. ఏడమ్‌మాత్రము క్రైస్తవ సంప్రదాయమందలి తప్పులు తెలిసికొని తనవిశ్వాసమును బహిరంగముగఁ బ్రకటింప సాహసించెను. ఈవిశేషమువలనఁ గ్రైస్తవులలో సంచలనము కలిగెను. పూర్వాచారపరాయణులగు క్రైస్తవులక్రోధావేశమున కంతు లేక యాయువకుని స్వదేశమున కంపుటకుఁగూడఁ బ్రయత్నించిరి. కాని, వారిపన్నుగడలు సాగలేదు. 'పడిపోయిన రెండవ ఆదాము' అని యాతనిని క్రైస్తవులు హేళన చేయుచుండిరి. వారు తమ యాంగ్ల వార్తాపత్రికయందేకాక 'సమాచార దర్పణము' అను వార్తాపత్రికలోఁగూడ తీవ్రమగు విమర్శనలు చేయుచుండిరి. ఎప్పటికప్పుడు రామమోహనుఁడు యుక్తియుక్తముగ నాప్రాతల ఖండించుచుండెను. కొంతకాలమున కితని ప్రత్యుత్తరములు సయితము తమపత్రికలోఁ బ్రచురించుట మానివేసిరి. కాని రామమోహనుఁడు జంకక "బాహ్మొనికల్ మాగజైన్" అను నూతనపత్రికను స్వయముగా వెలువఱిచి యందు బహుదేవ

తారాధనతోఁ గూడుకొనియున్న సామాన్య హిందూసంప్ర
దాయములకంటెఁ ద్రివిధములగు నీశ్వరసాక్షాత్కారములను
విశ్వసించు క్రైస్తవసంప్రదాయముయొక్క ఘనత యేమియు
లేదని ప్రకటింపసాగెను. మఱియు నాతఁడీవాదనకుఁ గ్రైస్తవు
లిచ్చు ప్రత్యుత్తరములను దనవిమర్శనలతోఁ గూర్చి సొంత
ఖర్చుపైని ముద్రింపించి ప్రచురించెద నని ఘంటాపథముగాఁ
జెప్పెను. ఈప్రకటన మఱియొక విచిత్రమగు పోరాటమునకుఁ
ద్రోవతీసెను. ఆదినములలోఁ దూర్పిండియావర్తకసంఘ
ములో వైద్యవృత్తిలోనున్న టైట్లర్ నామధేయుఁ డొకఁ డుం
డెను. కయ్యమునకుఁ గాలుదూసి క్రైస్తవసంప్రదాయసం
రక్షణార్థ మొకవ్యాసమును వ్రాసి పంపెను. దానిపైఁ గ్రైస్త
వపండితులలోఁ దగువార లెవరైనను జూచి సంతకముఁ
జేయనిదే రామమోహనుఁడు ప్రచురింపన నెను. టైట్లర్ దొర
గారు క్రోధావేశముతో "బెంగాల్ హర్కారు" పత్రికకుఁ
దనవ్యాసమును పంపెను. అంతట "రామదాసు" అను
మారుపేరుతో రామమోహనుఁడు పరిహాసముతోఁ గూడిన
కొన్నియుత్తరములు ప్రకటించెను. ఈశ్వరుఁడు మనుష్యావ
తార మెత్తునను విశ్వాసముగల క్రైస్తవహిందూమతముల
వారి కుభయులకు రామమోహనుఁడు విరోధియే కనుక
రామమోహనుని ప్రతిఘటించుటకుఁ దనతో టైట్లర్ దొరవా
రేకీభవింపవలెనని ఛలోక్తిగా వ్రాయుచుండెను. దీనిపై టైట్లర్

దొరవారికి మఱింత యహంకార ముదయించెను. అవాచ్యము లగు దూషణములు మొదలిడెను. "పరమేశ్వరునియెదుట నీ విరోధి" యని తన వ్యాసముక్రింద సంతకముఁ జేయుచుండెను. ఇదియంతయు శాంతితో రామమోహనుఁడు సహించుచుండెను.

క్రైస్తవులతో జరిగిన వివాదఫలితముగ 1821వ సం॥ రమున రామమోహనుని సాయముతో ఏడమ్‌దొరవారు కలకత్తానగరమున 'యునిటేరియన్ సంఘమును' స్థాపించిరి. తాను పంపిన కడపటివిజ్ఞప్తి ముద్రించని కారణమున 1823 వ సంవత్సరములో యునిటేరియన్ ముద్రణాలయమునుగూడ వ్యయప్రయాసముల కోర్చి రామమోహనుఁడే స్వయముగా స్థాపించెను. అప్పటినుండియు బ్రహ్మసభ స్థాపింపఁబడువఱకును తాను 'హిందూ యునిటేరియన్' అని రామమోహనుఁడు చెప్పుకొనుచుండెడివాఁడు. అనఁగా బహుదేవతారాధనను, అవతారములను విశ్వసింపక, అద్వితీయపరబ్రహ్మమును మానసికోపాసన చేయు హైందవుఁ డని యర్థము. ఏడమ్‌దొరవారి సాయమునిమిత్తము రామమోహనుఁడు చూపిన త్యాగము ప్రశంసనీయము. తాను, తనకొమరులు, ద్వారకనాథ్ ఠాకూర్ మున్నగువారలు యునిటేరియన్‌సంఘమునఁ జేరుటయేకాక యాసంఘముతరపున నెలకొల్పఁబడిన, ఆంగ్లోహైందవపాఠశాలకును, యునిటేరియన్ ఆలయమునకును, దానిప్రచురణలకును ఏడమ్‌దొరగారి జీవితోపాధికిని తన ధన మెంతయో ఖర్చు

పెట్టెను. రామమోహనుఁడు క్రైస్తవులకును, ప్రభుత్వము వారికి విరోధి యయ్యెను. రామమోహనునిచే నెలకొల్పఁబడిన ముద్రణాలయము 'ధర్మతుల్లా' వీధిలో నుండెను. అందే తన రచన లన్నియు ముద్రింపఁబడుచుండెను. ప్రతి యాదివారపు టుదయమున ఏడమ్‌దొరగారిచే నిర్వహింపఁబడుచుండిన యునిటేరియన్ ప్రార్థనాదికములకు రామమోహనుఁడు తనబంధుమిత్రులతోఁ దప్పక హాజరగుచుండెడివాఁడు. ఇందువలన రామమోహనుఁడు పెక్కుమందియాగ్రహమునకు గుఱియాయెను. "యునిటేరియన్ ప్రార్థనాలయమునకుఁ జను టెందులకు?" అను ప్రశ్నకు రామమోహనుఁడు 'చంద్రశేఖరదేవ్' అను తన శిష్యునినామమును దాను వహించి సహేతుకముగ జవాబు నిచ్చెను. క్రైస్తవశాస్త్రములందును, వేదములందును గూడ నంగీకరింపఁబడియున్న పరమేశ్వరుని యేకత్వమునందే యునిటేరియనులు విశ్వాస మున్నవారలు గాన నేను వారి దేవాలయమున జరుగు ప్రార్థనాదులకుఁ బోవుచున్నా" నని నిర్భయముగఁ బ్రత్యుత్తర మిచ్చెను. కాని రామమోహనుఁ డొక్కఁ డెంతసాయమును జేసినను నితరులనుండి తగిన సానుభూతియు, ప్రోత్సాహము లేనందువలన ఏడమ్‌దొరగారి యుద్యమ మభివృద్ధి నందలేదు. ఏడమ్‌దొరగారిచే నుపన్యాసము లిప్పించుటకును ఆయన స్థాపించిన సంఘమును బునరుద్ధరించుటకును రామమోహనుఁడు చేసినప్రయత్నములు విఫలములయ్యెను.

## బ్రహ్మ సమాజ స్థాపనము

రామమోహనునినామము శాశ్వత మొనర్చినది బ్రహ్మ సమాజస్థాపనము. బ్రహ్మసమాజము నెలకొల్పువిషయమై రెండుగాథలు కలవు. యునిటేరియన్ సంస్థ క్షీణించుటఁ జూచి ఏడమ్‌దొరగారే యాసంఘమునకు బదులు మఱియొక సంస్థ నెద్దేని వేఱుపేరుతో నెలకొల్పమని విన్నవించినట్లొకకథ గలదు. రామమోహనుఁ డొకదినమున ఏడమ్‌దొరగారి ప్రార్థనకూటము నుండి తిరిగివచ్చుచుండ, తారాచంద్ చక్రవర్తి, చంద్రశేఖర దేవ్ అను నిద్దఱుశిష్యులు "స్వసంప్రదాయములకును, సిద్ధాంతములకు ననువగు నాలయము లేకపోఁబట్టికదా యునిటేరియనులగుడికిఁ బోవలసివచ్చుచున్న" దని కించపడినట్లును ఈ విషయముఁ తనమనస్సులో బాధించుటవలన వెంటనే యాతఁడు తనస్నేహితుల రావించి, యొకసభ చేసి యందు జాతి, మత భేదము లేక యేకేశ్వరారాధనఁ జేసికొనుటకుఁ దగుసంస్థ నొక దానిని నెలకొల్పవలెనని తీర్మానించినట్లును మఱియొకగాథ కలదు. ధనికులగు తనస్నేహితు లనేకులు వలయు ధనసాహాయ్యముఁ జేయ వాగ్దానముఁ జేసిరి. రామకమల్ బోసుగారి గృహ మద్దెకు నిర్ణయింపఁబడెను.

సమాజసభలు ప్రతిశనివారము సాయంకాలము సక్రమముగ జరుగుచుండెను. అప్పటి పద్ధతి చిత్రముగ నుండెను. తెలుఁగుబ్రాహ్మణు లిరువు రొకప్రక్క గదిలో నితరులకుఁ

గనఁబడకుండ వేదపారాయణ మొనర్చుచుండెడివారు. అప్పటి కింకను బ్రాహ్మణేతరులు వచ్చుట కవకాశ ముండెడిది కాదు. ఉత్సవానందవిద్యావాగీశులవా రుపనిషద్వాక్యములఁ బఠించుటయు, రామచంద్రవిద్యావాగీశులవారు వంగభాషలో వాని యర్థములను జెప్పుచుండుటయు జరుగుచుండెడిది. పిమ్మట రామచంద్రవిద్యావాగీశులవా రొకయుపదేశమును గావించెడివారు. కడకు గులామ్అబ్బాస్ అను గాయకునిగానముతో ముగించుచుండెడివారు. రామచంద్రవిద్యావాగీశులవారు చేసిన యుపదేశములలోఁ గొన్ని రామమోహనుఁడే వ్రాసియుండెను. మొట్టమొదటి యుపదేశ మీశ్వరుని 'ఆధ్యాత్మికారాధన' యనువిషయముపై నుండెను. తారాచంద్రచక్రవర్తి యీ సమాజమునకు మొదటికార్యదర్శి. ఆయనయే మొదటియుపదేశము నాంగ్లమునఁ దర్జుమా చేసి ప్రచురించెను. కొన్నిప్రతులను రామమోహనుఁ డొక పాశ్చాత్యస్నేహితునకుఁ బంపుచు నాయుపదేశమందలి విశాలభావమును, సహనమును బేర్కొని యద్దానినే మొదటినుండియు హిందువు లవలంబించునట్లు తెలియఁజేసెను.

ఈబ్రహ్మసభా (ఏకేశ్వరోపాసకులసంఘము) సంస్థాపనము మరలఁ బూర్వాచారపరాయణులగు హిందువులయాగ్రహమునకు గుఱియయ్యెను. అప్పుడే సహగమనదురాచారనిషేధమునకై రామమోహనుఁడు ప్రయత్నించుచుండుటవలన

హిందూసంఘముయొక్క క్రోధావేశమునకు మేరలేకపోయెను. బ్రహ్మసభ స్థాపింపఁబడినపిమ్మట రాను రాను దానియెడ సాను భూతికలవారనేకులు సమాజమునకు వచ్చుచుండిరి. రెండు సంవత్సరములలో సమాజమున కొక ప్రత్యేకగృహము కొను టకు వలయుధన మేర్పడెను. చిట్పూర్‌రోడ్డులో 1830 వ సం॥రము జనవరి మాసమునకు ముందే రామమోహనుఁ డొక గృహము కొనియుండెను. ఈనూత్న దేవళప్రవేశ మొకయూఱు దినములకు జరుగుననఁగా రామమోహనుని శత్రువర్గమువారు కలకత్తాలోనున్న ప్రముఖులను పలువుర రావించి యొకసభఁ జేసి, 'ధర్మసభ' అను మఱియొక సంస్థను స్థాపించిరి. భవానీ చరణబెనర్జీ యను బ్రాహ్మణపండితుఁ డీనూతనసంస్థ కధ్యక్షుఁ డుగాను, రాధాకాంతదేవ్ అనునాతఁడు కార్యదర్శిగను నెన్ను కొనఁబడిరి. ఈవిధమున రామమోహనుని నాయకత్వమున నొకకక్షయు, రాధాకాంతదేవ్ నాయకత్వమున నొక సనాతన హిందూకక్షయు రెండుకక్షలు బయలుదేఱెను. 'సమాచార చంద్రిక' యను వార్తాపత్రికలో సంస్కరణప్రియులను ప్రతి దినము ధర్మసభవారు దూషించుచుండిరి. సంస్కరణకక్షవారు 'సంబంధకౌముది' యనుపత్రికలో జవాబుల నిచ్చుచుండెడి వారు. ఈ వాదప్రతివాదములవిషయమై నదీతీరమునందును, బజారులందును వీలగుచోట్ల నెల్లను బ్రజలు చర్చించు చుండిరి. సంస్కరణాభిలాషుల వ్రాతలు సామాన్యులకు సహితము చక్కఁగాఁ దెలియునట్లు వంగభాషయం దాకర్షణీయ

ములుగ నుండెడివి. ధర్మసభవారు హేళనయుక్తమై యుండు పదములు, పద్యములు రామమోహానునిపై నల్లి యన్నివీధు లందును బాడుచుండెడివారు. నవ్వులతోను, దిరస్కారముల తోను, బట్టణపువీధులు మ్రోఁగుచుండెడివి. కలకత్తాలో నెగాక నీ యల్లకల్లోలము చుట్టుప్రక్కల గ్రామములకు సహితము వ్యాపించెను.

ఇట్టి విషమపరిస్థితులలో నత్యంత సాహసముతోను, అసామాన్యమగు దూరదృష్టితోను, నిశ్చలమగు నీశ్వరవిశ్వాస ముతోను 1830 వ సం॥రం జనవరి 23 వ తేదీని (మాఘశుద్ధ ఏకాదశి) రామమోహానుఁడు తనజీవితకాలమున నిర్మింపఁదలఁచిన బ్రహ్మమందిరమును సుస్థిరముగ నెలకొల్పి ధర్మకర్తల హాస్తములయందుంచెను. ఈ నూత్న దేవాలయప్రవేశోత్సవము నకు సుమారు రెండువందల హిందువులు వచ్చియుండిరి. రామ మోహానునితో 'మాంటుగామరీ మార్టిన్' అను నొక పాశ్చాత్యుఁడుకూడ నేగియుండెను. ప్రార్థనలు, హరినామ సంకీర్తనము, అయినపిదప ననేక బహుమానములు రామమోహానుఁ డచ్చటి వారి కిచ్చియుండెను.

## బ్రహ్మసమాజ దానపత్రము

'ఈమందిరమును, దానిం జేరియున్న నివేశనస్థలమును ధర్మకర్త లేవిధమగు భేదమును లేక జనులెల్లరును గూడి సభఁ జేసికొనుట కెప్పుడు నిచ్చుచుండవలయును. అచ్చటఁ జేయువారు

మర్యాదగను, భక్తిపూర్వకముగను మెలఁగుచుండెడివారుగా నుండవలయును. అట్టిసభికులు నిత్యుఁడును, అగోచరుఁడును, అప్రమేయుఁడును నగు సృష్టికర్తయొక్క యారాధనలోఁ బ్రత్యేకమగు నేనామములు గాని, లక్షణములు గాని, బిరుదు గాని పేర్కొనరాదు. మఱియు నేవిగ్రహముగాని, శిలను గాని, చిత్తరువునుగాని, యేస్వరూపచిహ్నమును గాని ఈ యావరణలో నుంచరాదు. బలులు, నైవేద్యాదు లిందుఁ బనికిరావు. ఈయావరణమందు మతాచారములకొఱకుఁ గాని, ఆహారము కొఱకుఁ గాని యెట్టి జీవహింసయు జరుగరాదు. ప్రాణసంరక్షణార్థము ఆపత్సమయములందుఁ దక్క వేఱెన్నఁడు నీస్థలమందు భోజనపానములు గాని, విందులు వినోదాదులు గాని వీలు పడవు. ఈయారాధనసమయమునఁ జేయునుపదేశములోఁ గాని, ప్రార్థనలోఁ గాని, సంకీర్తనములలోఁ గాని, మఱి యేసాధనములలోఁగాని యితరులు తమపూజావిధానమున కుపయోగించు చేతనాచేతనములగు నెట్టివస్తువుల నెంతమాత్రమును దిరస్కారభావముతో సూచించుట గాని, దూషించుట గాని కూడదు. సృష్టికర్తనుగూర్చి ధ్యానించుట కుపయుక్తమైనట్టియు, ధర్మము, నీతి, భక్తి, యౌదార్యము మున్నగు సుగుణముల యభివృద్ధికిఁ దోడ్పడునట్టియు, సర్వమతస్థుల యేకీభావమునకు సహకారిగా నుండునట్టివియు నగు ప్రసంగములు, ఉపదేశములు, ప్రార్థనలు, గీతములేతప్ప వేఱొండిందుఁ బనికిరావు. మఱియు విజ్ఞానసంపత్తియందును, భక్తియందును, నీతివర్తనయందును బేరొందిన సుప్ర

సిద్ధపురుషుఁ డొకఁ డిచ్చటఁ బైఁబేర్కొనఁబడిన ప్రార్థనాదుల జరిపించు కార్యసచివుఁడుగ నుండుట కేర్పాటు చేయవలయును. ఈశ్వరారాధన నిత్యమును గాని, వారములో వీలగునన్ని సారులు గాని యిచ్చట గావింపఁబడుచుండవలెను'. పలువు రచేఁ బ్రశంసింపఁబడిన యిందలి వివేకము, దూరదృష్టి, ఔదార్యము పాఠకులే గ్రహించెదరుగాక !

ఇంతకుముందే 1825 వ సం॥రమున వేదాంతకళాశాల నొకదానిని రామమోహనుఁడు స్థాపించెను. నిజమగు వేదాంత సారమును దన దేశీయులకు నేర్పుటయే యాతని యుద్దేశము. పాశ్చాత్యశాస్త్రములుకూడ దేశభాషలలో నేర్ప నుద్దేశ మాతని కుండెడిదఁట; కాని బ్రహ్మసమాజస్థాపననాఁటి కీకళాశాల యంతరించెను.

ఇన్ని విధములుగఁ గార్యరంగమునఁ బోరాడుచుండియు నాంగ్లవంగభాషలందు మత సాంఘిక రాజకీయార్థిక విషయము లలో ననేకాద్భుతగ్రంథములను వ్రాసి ప్రచురించెను. సంస్కరణప్రియుఁడగు రామమోహనుఁడు మతసంస్కరణతో నాగక సర్వతోముఖమైన సంస్కరణకుఁ దన యావచ్ఛక్తిని ధారవోసి దేశాభ్యుదయమున కెన్నిరీతులఁ దోడ్పడెనో భారతీయు లూహించుటకుఁగూడ నలవికాదు.

## సంఘసంస్కరణ

సర్వతోముఖసంస్కరణాభిలాషి యైన రామమోహ నునిదృష్టి కానాఁటి నారీమణుల బానిసజీవితము సహితము

గోచరింపకపోలేదు. ఒక్క కలకత్తానగరమందే బ్రహ్మసభ స్థాపింపఁబడిన సంవత్సరమున (1828) 309 గురు వితంతువులు సహగమన మాచరించిరఁట! తనవ్రాఁతలందును క్రియలందును సమయానుకూలముగా స్త్రీల యభ్యుదయమునకు రామమోహనుఁడు కృషి సల్పుచుండెను. శాసనసమ్మతమగు హక్కుల కొఱకును, స్త్రీలకు విద్యకొఱకును, సహగమనాదిదురాచార నివృత్తికొఱకును దన శక్తి నంతయు ధారవోసెను.

1811 వ సం॥రమునఁ దాను రంగపురములో నున్నపుడు సోదరుఁడగు జగన్మోహనుఁడు మృతినొందెను. తా నత్యధిక ముగా గౌరవించు వదినెగారు సహగమన మాచరించెను. ఈఘోరమరణవార్త వినిననాఁటినుండియు నీక్రూరాచారమును రూపుమాపుటకు శపథముఁ జేసికొనెనని వాడుక. కావునఁ గలకత్తాలో నివాస మేర్పఱచుకొన్నపిదప మతసంస్కరణ కృషితోఁబాటు సహగమనదురాచారనిషేధమునకుఁ గూడఁ బాటుపడుచుండెను. 1789 వ సం॥రము నుండియు నాంగ్ల ప్రభుత్వ మీ దురాచారము నిర్మూలింప నాలోచించుచున్నను 1813 వ సం॥రమువఱకు నెట్టి నివారణప్రయత్నములు జరిగి యుండలేదు. మోరియాప్రభు వీక్రూరాచారమును గొంత వఱకు నరికట్టఁగలిగెను. 1815–17 సంవత్సరములలోఁగూడఁ గొన్ని శాసనములఁ గావించిరి. 1815 మొదలు 3 సంవత్సరము లలో సుమారు 2,365 వితంతువులు అగ్నిజ్వాలలలో దహింపఁ బడిరని తేలుచున్నది. అందు 1,528 గురు కలకత్తా ప్రాంత

నివాసులే. అప్పటికే కావింపఁబడిన ప్రభుత్వశాసనములు హిందూసంఘమునం దాందోళనను బయలుదేఱఁదీసెను. పూర్వాచారపరాయణు లాశాసనములను రద్దుచేయుట కొక మహజరును బంపియుండిరి. దాని నెదుర్కొనుచు రామమోహను(డు, నాతనిమిత్రబృందమును 1818 సం॥ ఆగష్టుమాసములో మఱియొక మహజరును బంపిరి. తాము కన్నారఁగాంచిన రాక్షస కృత్యములు శాస్త్రసమ్మతములు గాకపోవుటయేగాక ఘోర హత్యలక్రిందఁ బరిగణింపఁబడుట యావశ్యమని నిరూపించిరి. ఈయాందోళనాసందర్భమున సహగమనదురాచారవిషయమై రామమోహనుఁ డనేకప్రచురణలఁ గావించెను. అట్టిప్రచు రణలలో నొకదానియం దీవిధమున స్త్రీలవిషయమై జాలికలి గించునట్టి యమూల్యవిజ్ఞాపన మొనర్చెను.

"సర్వసాధారణముగా స్త్రీ లబలలనియే తెలిసియున్నది. ఈశరీరదౌర్బల్యమునుబట్టి వారికి సహజములగు నుత్తమగుణ ములుకూడ మనవారు లేవనుచున్నారు. అట్టి సుగుణముల నార్జించుటకైనను స్త్రీలు చేతకానివారనుచున్నారు. ఈనిందా రోపణ మెంతవఱకు న్యాయమో కొంచె మాలోచించినయెడల సులభగ్రాహ్య మగును. స్త్రీల సహజమగు శక్తిసామర్థ్యము లను జూపించుటకుఁ దగు నవకాశ మెన్నఁడు నీయకయే వారికిఁ దెలివియు, గ్రహణశక్తియు స్వల్పమని మన మెట్లు చెప్పఁగ లము ? జ్ఞానవిజ్ఞానములను వారి కలవఱచినపిదప, వారు గ్రహించక, జ్ఞప్తి యుంచుకొనకున్నచో వారిదే లోపమగును.

విద్య నేర్చుకొను సదుపాయములు వారికిఁ గలిగింపక, పురుషుల కంటెఁ దక్కువవారని శాసించు టేటిన్యాయము ? లీలావతి, కర్ణాటకరాకొమరుని పత్నియగు భానుమతి, కాళిదాసుని సతీ తిలకము శాస్త్రములో సంపూర్ణజ్ఞాన మార్జించి వన్నెకెక్కిన వారలేకదా ! ఇఁక యాజ్ఞవల్క్యుఁడు తన సహధర్మచారిణియగు మైత్రేయికిఁ గష్టసాధ్యమగు బ్రహ్మజ్ఞాన మెట్లుపదేశించెనో, యా పరమార్థము నామె గ్రహించి యెట్లు పొందఁగల్గెనో యజు ర్వేదమందలి బృహదారణ్యకోపనిషత్తు ఘోషించుచున్నది.

రెండవది : స్త్రీలకు సంకల్పశక్తి, ఇచ్ఛాబలము లేద నుట నా కత్యంతాశ్చర్యముఁ గల్గించుచున్నది. మరణ మను మాటయే మగవానిని గడగడ లాడించు నీదేశములోఁ జని పోయినభర్తతోఁ జితిమీఁదఁ గాలిపోవుట కాత్మసమర్పణఁ జేయుచున్న నారీమణుల మనోధైర్యస్థైర్యములు తక్కువ యనుట యెట్టి తెలివితక్కువ ?

మూఁడవది : స్త్రీలు నమ్మఁదగనివారందురు. స్త్రీ పురుషుల ప్రవర్తనలఁ బరీక్షించినచోఁ దఱచు మిత్రద్రోహ మును జేయువారు స్త్రీలో, పురుషులో స్పష్టము కాఁగలదు. ప్రతి యూరను పురుషులవలన మోసపోయిన స్త్రీలసంఖ్య, స్త్రీల వలన మోసపోయిన పురుషులసంఖ్యఁ బరిశీలించినచోఁ బురు షునివలన మోసపోయిన స్త్రీలు పదిరెట్లెక్కువ యుందురు. సాధారణముగాఁ బురుషుఁడు చదువను వ్రాయను నేర్చి లోక వ్యవహారములను నిర్వహించుచున్నాఁడు. కాఁబట్టి స్త్రీల నేర

ములను బదిరెట్లు పెంచి ప్రచారము చేయును. తాను వారి యెడల నొనర్చు నేరములు తప్పులుగాఁ దలఁపనైనఁ దలఁపఁడు. స్త్రీలయెడ నొకలోటున్నదనిమాత్రము మనము చెప్పకతప్పదు. తమవలెనే యితరులుగూడ నమాయకులని యెదుటివారిని నమ్మి యనేకములయిన యిక్కట్లపాలగుచుఁ దుదకుఁ జితుల పైకెక్కి దహనమైపోవుటకుఁగూడ సంసిద్ధు లగుచున్నారు.

నాల్గవది: స్త్రీల కింద్రియనిగ్రహము తక్కువయని యందురు. మన దేశమందు వివాహసంప్రదాయము లెట్టివో చూడుఁడు. ఒక పురుషుఁ డిద్దఱుముగ్గురస్త్రీలను బరిణయమాడ వచ్చును. పదిమందిభార్యలను సయితము పెండ్లి చేసికొనినవా రున్నారు. స్త్రీమాత్ర మొక్కనినే వివాహము చేసికొనును. లౌకికసౌఖ్యములను దృణీకరించి మరణమందుఁగూడఁ బతివ్రతయై పెనిమిటి ననుసరించును; లేదా భర్తమరణానంతరము తాను సన్యాసినియై జీవితయాత్ర సాగించును." ఈవిజ్ఞప్తియే కదా నేఁటికిని స్త్రీలు గావించుచున్న యాందోళనమం దిమిడి యున్నది!

పత్రికలద్వారా చేయు నిట్టియాందోళనతో నతఁ డాగ లేదు. ఆతఁ డొకసంఘమును స్థాపించి యా సంఘసభ్యు లెప్పు డెచ్చట సహగమనము జరుగుచున్నను బోయి శాసనములకు విరుద్ధముగా నేవిధమైన బలాత్కరణము లేకుండఁ జూచు నేర్పాట్లు గావించెను. ఈవిధమగు పోరాటము కొంతకాలము సాగుసరికి బెంటిక్ ప్రభువు రాజప్రతినిధిగా వచ్చెను. ఆతని

యమోఘమగు కృషివలన నెట్టకేలకు 1829 సం॥ డిశంబరులో సహగమనదురాచారము శాసననిషిద్ధముగాఁ జేసెను. శాస్త్రప్రమాణములఁ జూపి, రామమోహనుఁడు ప్రభుత్వమునకుఁ జేయూఁత నొసంగెను. భక్తిపూరితమైన విరాగిజీవితమే శాస్త్రము లాదేశించుచున్నవని నిరూపించెను. ఈ శాస్త్రప్రమాణములు బెంటిక్ ప్రభువున కెంతేని దోడ్పడెను.

బెంటిక్ ప్రభు వమలులోఁ బెట్టిన శాసనముతోనైనను రామమోహనునికృషి యంతరించలేదు. 1830 వ సం॥రము జనవరి 14వ తేదీ నెనిమిదివందల కలకత్తాపౌరుల సంతకముల తోను నిరువదిమంది పండితుల యభిప్రాయములతోను రామమోహనునియొక్క విరోధికోటిలోనివా రొకపెద్దమహాజరును బెంటిక్ ప్రభువునకు సమర్పించిరి. చుట్టుప్రక్కల గ్రామముల నుండికూడ 340 మంది సంతకములతో మఱియొకమహాజరు దాఖలుచేసిరి. రామమోహనుఁ డూరకొనక, 16 వ తేదీని 300 పౌరులచే సంతకములఁ జేయించి యొక యభివందనపత్రమును, 800 క్రైస్తవులచే సంతకములు చేయించి మఱియొకటియు బెంటిక్ ప్రభువునకుఁ బంపెను. మఱుసటిదినము విరోధివర్గమువా రొకబహిరంగసభఁ గావించి యాంగ్లప్రభుత్వాధికారులకు విజ్ఞాపన మొనర్చుటకుఁ దీర్మానించిరి. ఆసభయందే "ధర్మసభ" స్థాపింపఁబడి రామమోహనుని యుద్యమము నెదుర్కొనుటకు 11260-0-0 లు చందాలు వేయఁబడెను. ఈ జడిపింపులకు రామమోహనుఁడు వెఱవలేదు. నూటయిరువది

పండితుల యభిప్రాయములను ఖండించుచు, విధవల దహించుట మతసంప్రదాయము గాదని సహేతుకముగా నిరూపించు వ్యాసము నొకపత్రికలోఁ బ్రకటించెను. తా నాంగ్ల దేశమునకుఁ బయనమగుటకుఁ గలకారణములలో విరోధుల యక్రమాందోళన నణఁచు టొకటి. ఇట్లు జీవితాంతమువఱకుఁ దన సోదరీమణులకొఱకు కాతఁడు ఘోరసమర మొనర్చెను. "హిందూధర్మశాస్త్రము ననుసరించి వారసత్వపుహక్కులలోఁ బూర్వము స్త్రీలకున్న హక్కులయెడ నవీను లొనర్చిన యన్యాయ" మనుపేర నొకగ్రంథము 1832 లోఁ బ్రచురించెను. దానిలో బహుభార్యాత్వమును నిరసించుచు, భర్తృవిహీనయగు స్త్రీ పడు నిక్కట్లను నిదర్శనములతో నిరూపించి యట్టికష్టములవలననే స్త్రీలు ప్రాణత్యాగమునకైనను సిద్ధపడుచున్నట్లు వ్రాసెను. మొదటిభార్య జీవించియుండఁగా రెండవభార్యను వివాహమాడునాతఁడు హిందూశాస్త్రములలో నుదాహరింపఁబడిన కారణములలోఁ దనచర్య నంగీకరించు నొక కారణ మేదేని యున్నట్లు న్యాయాధికారిసమక్షమున ఋజువుచేయనిదే యట్లు వివాహమాడు టనుచితమని యతండు వాదించెను. రామమోహనుఁడు చిన్నతనముననే యిరువురభార్యల వివాహమాడుట తటస్థించుటచే వారిరువుర నేలుట విధి యయ్యెనేగాని 1824 సం॥లో నొకభార్య పోయినపిదపఁ దనయాశయముల ననుసరించి తా నేకపత్నీవ్రతుఁడుగానే యుండెను. కాని మొదటినుండియుఁ బూర్వాచారపరాయణ

లగు తనభార్యలు తనతో సుఖముగా నివసించుభాగ్యము లేకపోయెను. బహుభార్యాస్వీకరణవిషయమై యాతఁ డెంత నిరసనఁ జూపెనో యీయనకు సంబంధించిన యొకవిషయము లోనె తేటతెల్లము గాఁగలదు. రామమోహనుఁడు చనిపోవు నపుడు వ్రాసిన మరణశాసనములలోఁ దనకొడుకుగాని, తక్కిన వారసులుగాని ఏకపత్నీవ్రతులు గానిచోఁ దనస్వార్జితముపై నెట్టిహక్కును గలిగియుండఁగూడ దని నిర్ణయించెను.

## ఆంగ్లవిద్యావ్యాప్తికిఁ దోడ్పాటు

రామమోహనుని దూరదృష్టి యమోఘము. అతఁడు స్వదేశభాషలం దపారమైన పాండిత్య మార్జించియుఁగూడ నప్పటి దేశస్థితినిబట్టి భావిదేశాభ్యుదయమునకుఁ దోడ్పడు నది పాశ్చాత్యవిజ్ఞానమే యని సులభముగా గ్రహించెను. ఈ విశ్వాసముతో మొదటినుండియు నాంగ్లవిద్య నీదేశ ములోఁ బ్రవేశపెట్టుట కమితమగు కృషి సల్పెను. ఆంగ్లవిద్య యొక్కయావశ్యకతనుగూర్చి అమ్హరెస్టుప్రభువున కొకచరిత్రా త్మకమైన లేఖ నాంగ్లమున వ్రాసెను. డేవిడ్ హేర్ అను నొక యాంగ్లస్నేహితునితో సంప్రదించి యీ దేశయువకులకుఁ బాశ్చాత్యవాఙ్మయ విజ్ఞానశాస్త్రములు నేర్పుట కొకపాఠ శాలను స్థాపింప సమకట్టెను. అప్పుడు న్యాయాధికారిగానున్న సర్ హైడ్ ఈస్టు అనునాతఁ డీసూచనకుఁ దనసంపూర్ణాంగీ కారమును సంతోషముతో వెలిపుచ్చెను. ఆయన గృహము

నకు హిందూసంఘమందలి పెద్దలను సుమా రొకయేఁబది మంది నాహ్వానించి, 1816 వ సం॥ మే 14 వ తేదీ నొకసభఁ గావించెను. మొట్టమొదట రామమోహనుని కీయాలోచనలో జోక్య మేమియు లేదని యచ్చటివా రనుకొనిరి గాని, యతఁడే యీ ప్రయత్నమునకు ముఖ్యకారకుఁ డని తెలిసినవెంటనే హిందూవిరోధు లెల్లరు నాయనపేరు తీసివేయవలసినదిగాఁ బట్టుపట్టిరి. ఆ సమావేశమునందే సుమారు 50 వేల రూప్యములు చందాలాయెను. రామమోహనునియెడల హిందూ పండితుల ద్వేష మెంతవఱ కున్నదో యాసభఁ గావించిన న్యాయాధికారి యాంగ్లదేశముననున్న హేరింగ్టన్ అను నొక సోదరన్యాయాధికారికి వ్రాసిన జాబులో విశద మగుచున్నది. ఒక బ్రాహ్మణోత్తముఁడు రామమోహనునుండి మాత్రము చందా పుచ్చుకొనరా దనెనఁట. ఏల యని ప్రశ్నింప "మా సంఘమునుండి విడిపోయి, మా మతము నెదిరించుచున్నాఁడు గనుక" అని ప్రత్యుత్తర మిచ్చెనఁట. "ఆయనమత మేమో నాకుఁ దెలియదు కాని, నేను క్రైస్తవుఁడ నైనను మీ యుద్యమమునకు నా చందా నంగీకరించుట కేయాక్షేపణయు నుండ దనుకొనియెద" నని ఛలోక్తిగా సభాధ్యక్షుఁ డనెనఁట. అంత సరసముగనే "ఎంత మాట! ఏయాక్షేపణయు నుండదు. మీసొమ్ముఁ దీసికొందుము, కాని రామమోహనుని విషయము వేఱు. ఆతఁడు హిందువై యుండికూడ మమ్ములను దూలనాడి మాపైఁ దిరస్కారభావముతో వ్రాఁతలు వ్రాసియుండె" నని

యాబ్రాహ్మణుఁ డుత్తర మిచ్చెనఁట. మఱియొక సందర్భమున "రామమోహానునియెడలఁ దనవారికే యింత ద్వేష మెందుల" కని యాన్యాయాధికారి మఱియొక బ్రాహ్మణు నడుగ "బహిరంగముగా రామమోహానుఁడు హిందూసంఘముపైఁ జేయుదాడి మాకుఁ గష్టముగా నున్నది; అదియునుఁగాక మహమ్మదీయులతో సహవాసముఁ జేయుటయు, వారలచే నెప్పుడును చుట్టఁబడియుండుటయు మా కెంతమాత్రమును నచ్చదు; అటువంటి కర్మబాహ్యుఁడు, స్వమతద్వేషి, కుల ద్రోహి యగు నాతనిచే సంస్కరింపఁబడుటకంటె మఱి యొకరిచే సంస్కరింపఁబడుట మేలని మాతలం" పని యాతఁడు జవా బిచ్చెనఁట.

ఈ తిరుగుబాటు విషయమై రామమోహానుఁడు తన స్నేహితుఁ డగు సర్ డేవిడ్ హేరున కెఱుకపర్చి, సభ్యత్వము నకు రాజీనామా నిచ్చుచు ఈస్టుదొరవారికి జాబు వ్రాసెను. తా నందు లేకపోయినను నిరాఘాటముగఁ దన సంకల్పము సిద్ధించుటయే ముఖ్యముగా నెంచి యీ క్రొత్తసంస్థాపనకు రామమోహానుఁడు తోడ్పడెను. ఆయనత్యాగమును జాటుట కీ యొకనిదర్శనమే చాలును!

1817 సం॥రము జనవరి 29 వ తేదీని రామమోహా నుని కృషిఫలితముగా హిందూకళాశాల స్థాపింపఁబడెను. ఈ హిందూకళాశాలయే 'విద్యాలయము' 'ఆంగ్లోహైందవకళా శాల' 'మహాపాఠశాల' 'జాతీయ హిందూకళాశాల' యను

నామములతోఁ బరఁగుచుండెను. ఇదియే తరువాత 'రాజధాని కళాశాల'గ మాఱెను.

రామమోహనుఁడు స్వాంతసొమ్ము నాధారముచేసికొని యీనగరమందే మఱియొకచోట (సురిపర) నొక యాంగ్లపాఠశాలను స్థాపించెను. ఇచ్చటనే మహర్షి దేవేంద్రనాథఠాకూరు గారు విద్యాభ్యాస మొనర్చిరి. ఇచ్చట బాలుర కుచితముగా విద్య గఱపఁబడుచుండెను. సుమారు రెండువందలమంది విద్యార్థు లుండెడివారఁట. తనగృహమున బాలుర కాంగ్లభాష నేర్పుచు నందుఁ బ్రావీణ్యముఁ జూపువారి నీపాఠశాలకుఁ బంపుచుండెడివాఁడఁట. రామమోహనుఁడు మాసమునకు నూఱురూప్యముల వేతనముపై మోర్ క్రాఫ్ట్ అను ప్రధానోపాధ్యాయుని నియమించెను. 1822 వ సం॥రములో నీపాఠశాల కొక భవనము నిర్మించెను. అప్పటినుండియుఁ గొలఁదిమంది స్నేహితులుగూడ సాహాయ్యము చేయుచుండిరి. 1830 సం॥రములో రామమోహనుఁ డాంగ్లదేశమునకుఁ బయనముకాఁగా, పూర్ణచంద్రమిత్ర యను ప్రధానోపాధ్యాయుని బాధ్యతలో నాపాఠశాల నుంచెను. ఈపాఠశాలయే 1834 సం॥రమున 'ది ఇండియన్ ఎకాడమి' యనుసంస్థగా మాఱెను.

ఆనాఁటి పత్రికలనుండి యీపాఠశాలనుగుఱ్చి కొన్ని ముఖ్యవిషయములు తెలియుచున్నవి. సంవత్సరాంతపరీక్ష లెంతో యుత్సాహజనకముగ జరుగుచుండెడివఁట. పరీక్షలు జరుగునపుడు వర్తకులు, తక్కిన పెద్దమనుష్యులు, పలువురు

పురప్రముఖులును హాజరగుచుండిరఁట. వ్రాత, చదువు, వ్యాకరణము, భాషాంతరీకరణము మొదలగువిషయములందుఁ దరగతివారీగా మూఁడు పరీక్షలైనపిదపఁ బెద్దతరగతికి ఖగోళశాస్త్రము, గణితశాస్త్రము మున్నగు విజ్ఞానశాస్త్రములందుఁగూడఁ బరీక్షలు జరుపఁబడుచుండెడివఁట.

1822 వ సంవత్సరములోఁ బ్రథమవిద్యాపరిశీలనసంఘము ప్రభుత్వమువారిచే స్థాపింపఁబడెను. 1813వ సంవత్సరము నుండియుఁ బ్రత్యేకింపఁబడిన లక్షరూప్యములు విద్యావ్యాప్తికొఱకు వినియోగింపవలసినదిగా నీ సంఘమున కీయఁబడెను. ఆ సంఘసభ్యులలోఁ బలువురు ప్రభుత్వోద్యోగులగు నాంగ్లేయులు, సంస్కృతవిద్యాపారంగతులు. వారిసలహా ననుసరించి, అమ్హారెస్టుప్రభువు సంస్కృతకళాశాల నెలకొల్ప నుద్దేశించెను కాని, రామమోహనుఁడు "సంస్కృతవిద్యావిధానమువలన దేశ మంధకారముననే యుండును. స్వదేశస్థుల యభివృద్ధియే ప్రభుత్వమువారి యాశయమైనచో, శరీర, రసాయన, గణిత, ప్రకృతిశాస్త్రాదులను బోధించుటకుఁ దగు బోధకులను, వలయుచోఁ బాశ్చాత్యదేశములనుండి రావించి, వలయుపుస్తకములు, ఉపకరణములు సమకూర్చి, యొక యాంగ్లకళాశాల నేర్పాటు చేయు టుచితి" మని తీవ్రముగ అమ్హారెస్టుప్రభువునకు వ్రాసెను. బిషప్ హెబర్ అను సుప్రసిద్ధ క్రైస్తవప్రచారకుఁ డీజాబును 1823 సం॥రము డిశంబరు 11 వ తేదీని, అమ్హారెస్టుప్రభువున కందఁజేసెను, మెకాలే మున్నగువారు కావించిన విశ్వప్రయ

త్నములు విఫలమైన 12 సం॥రముల కీవిధానమునే తుద కాతఁడు చనిపోయిన 2 సం॥రములకు (1835 సం॥రమున) బెంటిక్ ప్రభువు సాయమునఁ బ్రభుత్వమువా రంగీకరించిరి.

ఈజాబునందలి భాష, శైలి, దూరదృష్టి, నాఁటికిని నేఁటికినిగూడ నద్భుతమైనవిగా నలరారుచున్నవి. ఆదినములలో నిట్టి దూరదృష్టితోఁ గూడిన విద్యాసంస్కరణము సూచించుచు రామమోహనుఁడు వ్రాసిన యీజాబును జూచి యాశ్చర్యపడనివా రుండరు.

ఆంగ్లవిద్యావ్యాప్తికి సాయపడుటకు రామమోహనుఁ డెప్పుడును సంసిద్ధుఁడే. 1830 సం॥రములో, 'అలెగ్జాండర్ డఫ్' అను నొక స్కాట్లాండు క్రైస్తవవిద్యాప్రచారకుఁ డరుదెంచి యాంగ్లపాఠశాల నొకదానిని స్థాపించునుద్దేశము నాతనికిఁ దెలుప, వెంటనే బ్రహ్మసభాభవనము పాఠశాల కేర్పాటుచేసి, మొదటి పండ్రెండుగురు విద్యార్థులను తానే యాపాఠశాలకుఁ బంపెను. మతవిద్య నేర్పు టావశ్యకమని యామోదించెను. ఆభవనమున నున్న 'పంకాను' జూపి, ఛలోక్తిగా "ఇదే నేను మీకు వదలెడియాస్తి" యనెనఁట. 1830 సం॥రము జూలై 13 వ తేదీని ఈ పాఠశాల స్థాపింపఁబడెను. అచ్చటఁ గూడినవారికి "క్రైస్తవముఖ్యులు మనహిందూశాస్త్రములను బఠించియున్నారు. కాని, వా రంతమాత్రమున హిందువులు కాలేదు. నేను ఖొరాను, బైబిల్ గ్రంథములను జదివియుంటిని. అంతమాత్రమున మహమ్మదీయుఁడనో, క్రైస్తవుఁడనో నేను

కాలేదు. కావున బైబిల్ చదువుట కెందుకు భయపడెదరు? చదివి యందలి సత్యాసత్యములు మీరే గ్రహింపుఁ" డని హితోపదేశము గావించి విద్యార్థులలోని భయమును బాఱఁ ద్రోలెను. ఇది స్థాపించిన నెలవఱకుఁ బ్రతిదినమును, తరువాత నాంగ్ల దేశమునకుఁ బోవువఱకుఁ దఱచుగను, నచ్చటికి బైబిల్ పాఠమునకు రామమోహనుఁడు పోవుచుండెడివాఁడు. ఆతఁడు హిందూదేశమును వదలినపిదపఁగూడ నతని జ్యేష్ఠ పుత్త్రుఁడగు రాధాప్రసాద్ రాయ్ వచ్చి విద్యార్థులను, ఉపాధ్యాయులను బ్రోత్సహించుచుండెడివాఁడఁట. కాని, క్రైస్తవ ప్రచారకులుమాత్రము తటస్థముగా నుండిరి.

## వార్తాపత్రికల యభివృద్ధి

రామమోహనుఁడు సర్వతోముఖసంస్కర్త యని యిదివఱకే చెప్పఁబడెను. జనసామాన్యమున కవసరమగు వాఙ్మయ మేమియు నాకాలమున లేకుండెను. రెండుమూఁడు శతాబ్దములనాఁటి పద్యకావ్యములుమాత్ర ముండెను. గద్యకావ్యములు లేవనియే చెప్పవచ్చును. సామాన్యజనులు చదువను, వ్రాయను నెఱుంగరు. అప్పుడే కొంతమంది క్రైస్తవప్రచారకులు, కళాశాలపండితులు గద్యరచనవిషయమై కొంతకృషి సల్పుచున్నను, నవీనవంగభాషాపితామహుఁడు రామమోహనుఁ డనియే చెప్పవచ్చును. వంగవచనభారతికిఁ దనరచనలచే వన్నె తెచ్చెను. వంగీయులు రచించిన సారస్వతరచనలోఁ దొలి

వచనకావ్య మాతనిదే! తన కరపత్రము లన్నియు సామా న్యుల కర్థమగు శైలిలో వ్రాసిన మార్గదర్శకుఁ డీతఁడే! పాఠ శాలల కుపయోగపడు వ్యాకరణశాస్త్రము, భూగోళశాస్త్ర మునుగూడ నీతఁడు వ్రాసెనఁట.

దేశభాషలందుఁ బత్రికల కతఁడే పితామహుఁడు. 1821 సంవత్సరములోఁ బ్రారంభింపఁబడి వంగభాషలో నాతఁడు ప్రచురించిన 'సంబంధకౌముది' యను వారపత్రిక దేశభాషా పత్రికలలో మొదటిది. 'మిరాతుల్ అక్బర్' అను వారపత్రిక పారశీకముననను, 'ది బెంగాల్ హెరాల్డు' అను పత్రిక నాంగ్ల మునునుగూడ నాతఁడు ప్రచురించుచుండెను. ఈపత్రికల నెదుర్కొనుటకు 'సమాచారచంద్రిక' 'జానిజహాఁ న్యూమా' అను రెండు పత్రికలను బ్రతికక్షులు బయలుదేఱదీసిరి. ఈపత్రికలలో మత సాంఘిక చర్చలు జరుగుచుండెను.

హేస్టింగ్సుప్రభువు పత్రికలకు స్వాతంత్ర్య మిచ్చిన సుది నము లంతరించెను. 1823 సం॥రములో స్వల్పకాలము జాన్ ఏడమ్ గవర్నరుజనరలుగా వచ్చి పత్రికాస్వాతంత్ర్య మణఁ చుట కనేక శాసనములు కావించెను. 'కలకత్తా జర్నలు' అను నాంగ్లపత్రిక కధిపతియగు బకింగుహామ్‌పై ప్రభుత్వమును నెదుర్కొను వ్రాఁతలు వ్రాసెనని నేర మారోపించి దొరతన మువా రాతని నీదేశమునుండి రెండునెలలలో వెడలఁగొట్టిరి. గవర్నరుజనరలువద్దనుండి 'లైసెన్సు' లేనిదే యేపత్రికలను బ్రచురింపరాదని 1823 సం॥రము మార్చి 14 వ తేదీని శాసిం

వఁబడి 20 రోజులలో నమలునం దుంచఁబడెను. ఈయన్యాయమును రామమోహనుఁడు సహింపలేక తాను బ్రచురించుచుండిన పర్షియన్‌వార్తాపత్రిక నాపుచేసెను. తనవంటిదీనుఁడు తోడిమానవుల సహాయార్థమే మాత్రము సేవ చేయకుండఁ బ్రభుత్వమువా రడ్డంకులు కల్పించుట శోచనీయమని వగచుచుఁ దన కడపటివ్యాసములో వ్రాసెను. ఇద్దఱి న్యాయవాదుల సాహాయ్యమునఁ, గోర్టువారియెదుటఁ దనమిత్రులతోఁ గలిసి యీయన్యాయమును బ్రతిఘటించుచుఁ బోరాడెను. ఈ శాసనమును రద్దుచేయుఁడని కోరుచు ననేకుల సంతకములతో మహజరు నంపెను. ఈప్రయత్నములలో విఫలమనోరథుఁ డయ్యుఁబట్టు విడువక యాంగ్లసార్వభౌమున కొక విజ్ఞాపనపత్రము బంపెను. పత్రికాస్వాతంత్ర్యమునకై పోరాడుచు నాతఁడు వ్రాసిన యమూల్యరచన భారతదేశస్వాతంత్ర్యవాఙ్మయమునం దాంగ్లభాషలోని 'మిల్టన్' మహాకవి రచించిన 'ఏరియోపజైటిక' వంటి దని వినుతి కెక్కెను. తాత్కాలికముగ నీతని పోరాటమంతయు నిష్ప్రయోజనమైనను 1835 వ సం॥రములో మెట్కాఫ్‌దొరగారిచేఁ బునరుద్ధరింపఁబడిన పత్రికాస్వాతంత్ర్య మీయనకృషికి ఫలితమే యని యొప్పుకొనక తప్పదు.

రాజకీయచర్చలయందుఁ దన ప్రతిభను జాటుకొనుటకుఁ బత్రికల నుపయోగించు టాతనియుద్దేశ మెన్నఁడును గాదు. జనసామాన్యమునకు లోకజ్ఞానమును గలుగుటయే

యాతని ముఖ్యోద్దేశము. అట్టి యవకాశమును గోల్పోకుం డుటకొఱకే పత్రికాస్వాతంత్ర్యమున కింతగా నతఁడు పోరా డెను. తన మరణాంతమువఱకు "కౌముది" మాత్రము ప్రచు రించుచుండెను. గ్రంథరచన పత్రికాప్రకటనలవలననే గాక యనేక కరపత్రప్రచురణములవలనఁగూడ జనసామాన్యము యొక్క జన్మహక్కులకుఁ బోరాడుచుండెను వంగ సంస్కృత భాషలలో మనోహరము లగు కృతులను, గీర్తనలనుగూడ నీతఁడు కూర్చియుండెను. తాను జమీందారుఁ డయ్యును రైతుల కష్టములను గూర్చియు, వారి నుద్ధరించు పద్ధతులను గూర్చియు మనదేశములో మొదట వ్రాసినవాఁ డాతఁడే! ఆ వ్రాఁతలు కరుణరసపూరితములై యుండును.

## ఐరోపాఖండయాత్ర

రామమోహనుని యంత్యదశలో నైరోపాఖండయాత్ర సంభవించెను. ఈ సంచారమువలనఁ దన మాతృదేశమున కనేక లాభములు చేకూఱినవి. బ్రహ్మసమాజకార్యములు యథావిధిగా జరుగుటకుఁ దగు కట్టుబాట్లొనర్చి ఐరోపాఖండ మునకుఁ బయనమయ్యెను. ఈయాత్ర తలపెట్టుటలో మూఁడు ముఖ్యోద్దేశము లుండెను.

ఆకాలమున నామమాత్రావశిష్టుఁడైన ఢిల్లీపాదుషా (రెండవఅక్బరు) తనకుఁ దూర్పిండియావర్తకసంఘము వారిచ్చు వార్షికము చాల తక్కువ యని యాంగ్లరాజున కెఱిఁగించి,

ఆ యన్యాయములఁ బాపి న్యాయదృష్టితో నాతని హక్కు-
లను దయచేయవలసినదిగా విన్నవించుటకుఁ దనతరఫునఁ బ్రతి
నిధిగా రామమోహను నాంగ్ల దేశమునకుఁ బొమ్మని 1828 సం॥
రములోఁ గోరియుండెను. రామమోహనుఁ డందుల కియ్యకొని
పర్షియన్, ఆంగ్లేయభాషలలో మొగలాయిచక్రవర్తి యాజ్ఞ
ననుసరించి యొక యద్భుతమగు విజ్ఞప్తిని దయారుచేసెను.

"ఒకానొకప్పుడు మాపూర్వులీదేశము నంతటిని
బరిపాలించిన ప్రభువులై యుండిరి. వారివారసుఁడనగు నేనిపు
డొకరిపై నాధారపడి యొక పాడువడిన కోటలో నుండవలసి
వచ్చెను. స్వదేశీయులయొక్కయు, విదేశీయులయొక్కయు
హేళనకును, జాలికిని బాత్రుఁడ నైతిని. నాహోదా నిలుపు
కొనుటకేకాక శాఖోపశాఖలతోఁ గూడిన కుటుంబవృక్షమును
బోషించుటకైనను నెంతమాత్రము సరిపడని యాదాయ
ముతో జీవించుచున్నాను. కాని, యిది నావాదము కాదు.
నా జన్మహక్కుగా సంక్రమింపవలసినది యొక పెద్ద మేలుగఁ
దాము నాకు దయచేయరు : నే నంగీకరింపను. తమ గౌరవము
పైని, తమ న్యాయదృష్టిమీఁదను, నా మొఱ నాధారము జేయు
చున్నారు. ఈలేఖ ప్రభువులగు తమకేగాక యావత్ప్రపంచము
నుద్దేశించి వ్రాయుచున్నాను. నేఁడు పతనమైనను నొకనాఁ
డుచ్చదశయందున్న తైమూరువంశపుఁ బ్రతినిధియగు నీ నిర్భా
గ్యునియెడఁ దాము చూపఁబోవు నౌదార్యము, సానుభూతి
రాఁబోవు తరతరములవారు వేనోళ్ళఁ బొగడుదురని చెప్పుటకు

సందియము లేదు. తమకు నేను వే జేమి విన్నవింపఁగలను ?" రామమోహనుఁడు వ్రాసిన విజ్ఞప్తియందలి భాగముఁ జూచి నచో నీతసిద్దృక్పథను తేటతెల్ల మగును. తన కవసరమగు కొన్ని కాగితములను గోర వర్తకసంఘమువా రీయనైరి. ఢిల్లీ పాదుషా స్పష్టముగాఁ జెప్పవలయును రామమోహనుఁ డాతని ప్రతినిధిగఁ గూడ నంగీకరింపనైరి. రామమోహనుని హోదా కుచితరీతిని 'రాజా' యను బిరుదు ఢిల్లీచక్రవర్తి యొసంగి సత్కరించెను. 1830 సంవత్సరము 8 వ తేదీని రామమోహనుఁడు దొరతనమువారి యామోదమునకు వ్రాయ దానిని గూడ వా రొల్లకుండిరి. ఎట్టకేలకు 1830 వ సం॥రము సెప్టెంబరు 20 వ తేదీని కొన్ని స్వీయవ్యవహారములు చూచుకొను నిమిత్తము సొంతబాధ్యతపైఁ జన నిశ్చయించినట్లు ప్రభుత్వమున కెఱుకపఱచెను.

ఢిల్లీపాదుషాకొఱకేగాక రామమోహనుఁడు మఱిరెండు కార్యములకొఱకుఁగూడ నాంగ్లదేశమునకుఁ బో నిశ్చయించెను. తూర్పిండియా వర్తకసంఘపు టధికారపత్రము మరలఁ గొన్ని సంవత్సరము లమలులో నుండుటకు తీర్మానింపఁబడు సమయమది. ఆ పట్టాషరతుల ననుసరించి మంచికిఁ గాని, చెడుగునకుఁ గాని హిందూదేశప్రభుత్వ మొకనూతనవిధానముఁ గాంచ నున్నది. ఈసందర్భములో రామమోహనుఁ డాంగ్లదేశమున నుండ నుద్దేశించెను. రెండవది సహగమనశాసనవిషయమై సనాతనులు జరుపుచున్న యాందోళన జయప్రదముగాఁ బ్రతి

ఘటించుటకు సంస్కర్తలతరఫున మహాజరు లాంగ్లప్రభుత్వము నకు స్వయముగా దాఖలుచేయు టత్యవసరమని యెంచెను. ఈ మూఁడుద్దేశములతో రామమోహనుఁడు పశ్చిమఖండప్రయాణమునకు సమకట్టెను.

ఐరోపాఖండమునకుఁ బోవలయునను నుద్దేశము రామమోహనుని మనంబున నప్పటికి సుమారు 15 సం॥రములనాఁటి నుండి నాటుకొనియుండెను. 1815 సం॥ములోనే యాంగ్లదేశమం దేదైన నొకవిశ్వవిద్యాలయమందుఁ జదువ నుద్దేశమున్నట్లు తెల్పుచు 'యేట్సు' దొరగారికి వ్రాసియుండెను. ఈతఁడు ప్రయాణమగుసరికే యైరోపాఖండమందలి వివిధదేశములందేగాక యమెరికాఖండమందుసహిత నీయన ప్రఖ్యాతి దశదిశలు వ్యాపించియుండెను. విద్యాధిక్యము, గ్రంథరచనలు, మతచర్చలు, ప్రజాహితకార్యములు మున్నగువానివలన దూరదేశములందుసహిత మారోజులలో నాయనయశస్సు వ్యాఁకి యుండెను. ఈయననామమును వ్యాప్తిచేసినవారు పాశ్చాత్యమతప్రచారకులు. రామమోహనుఁ డావైపునకు రానున్నాఁడని తెలియుటతోడనే వివిధప్రాంతములవారు సంతోషముగా స్వాగతము చెప్పుచు నీయననుగూర్చిన ప్రశంసావ్యాసములు పత్రికలలోఁ బ్రచురించిరి. ఈమహామహుని గన్నారఁ జూచు మహాభాగ్యముకొఱకు వేచియున్న గొప్పవార లనేకు లుండిరి.

ఎట్టకేలకు 1830 వ సం॥రము నవంబరు 15 వ తేదీని ఐరోపాఖండమునకుఁ బ్రయాణమై యాఫ్రికా దక్షిణతీరమున

నున్న గుడ్‌హోప్ అగ్రమును జుట్టి 1831 వ సంవత్సరము ఏప్రిల్ 8 వ తేదీని లివర్‌పూల్‌నగరముఁ జేరెను. హిందూ శాస్త్రములను దిరస్కరించి మహాసముద్రయానముఁ జేసి పర దేశముల కేగిన మొదటి హిందూబ్రాహ్మణుఁ డీతఁడే! ఆత నితోఁగూడ దత్తపుత్త్రుఁడగు రాజారామ్, వంటకు రామ్‌రోథణ ముఖర్జీ యనునాతఁడును, రామ్‌హరదాస్ అను సేవకుఁడు గూడ నుండిరి. పొగయోడలో నొక చిన్నగదిలో వారలతో భోజనము చేయుచు, భృత్యులనుసహిత మెంతో యాదరిం చుచు, నెప్పుడోగాని గదినుండి బయటికి రాక, కాలము గడపు చుండెడివాఁడట. ఇతరప్రయాణీకుల భోజనకాలమందు వారి కడకు వచ్చి లోకవృత్తాంతములను జెప్పుచుండెడివాఁడట. ఓడలో నుండువారి కందఱికిని నచిరకాలములోనే యాతఁడు గౌరవపాత్రుఁ డయ్యెను. అతనివెంట నొకయావును గొని పోయెనని వాడుక గలదు. అంతకుముందే యాతఁడు వచ్చు సమయము ప్రకటింపఁబడినందున రామమోహనుని యాగమ నము వినినంతనే లివర్‌పూల్‌పట్టణమందలి ప్రఖ్యాతపురుషు లెల్లరు నీయనను దర్శించుట కేగిరి. విలియమ్‌రాత్‌బోణ్ అను ప్రసిద్ధపురుషుఁడు తన విశాలభవనమున కాహ్వానించెను గాని రామమోహనుఁ డియ్యకొనక 'రెడ్లీ' వసతిగృహమున బస చేసెను. చిన్ననాఁడు కలకత్తా నగరప్రాంతమునఁ బొగయోడ యందుద్యోగియై యుండిన యొకయువకుఁ డాయనను సంద

ర్శించి తన పూర్వవృత్తాంతమును జ్ఞప్తిచేయ రామమోహనుఁ డెంతో యాదరించెను.

లివర్‌పూల్ నగరమునఁ జేయఁబడిన విషయములలో విలియమ్‌రాస్కోగారి పరిచయ మగ్రగణ్యమైనది. ఈతఁడు గొప్ప రసాయనశాస్త్రవేత్త; చరిత్రకారుఁడు. రామమోహను నిచే రచింపఁబడిన గ్రంథములను బరిశీలించి యాతనియం దత్యంతాభిమానముఁ గలిగియుండెను. ఈతఁడు రాకమున్నే తనగ్రంథములఁ గొన్నిఁటిని రామమోహనునకుఁ బంపియుం డెను. రాస్కో యప్పు డవసానదశయం దుండెను. రామమో హనుని సందర్శనభాగ్య మత్యాతురతతో నభిలషించుచుండెను. తన పక్షవాతస్థితిలోఁ గొన్ని సంవత్సరములనుండియు నెవరిని జూచుచుండుట లేదు. కాని, అప్పుడు తనకొమరులను దయచేసి తన్నుఁ జూడవలసినదిగాఁ బ్రార్థింప రామమోహనునొద్ద కం పెను. తనగదిలోనికి వచ్చినవెంటనే రాస్కో యధికగౌరవ ముతో రాయలవారి నాహ్వానించి మాట్లాడెనఁట. ఈమహా పురుషు లిరువురును సంభాషించునపుడు రాస్కోగారి కొమరులు తప్ప నితరు లెవరును లేరు. చలించిన ముఖబింబముతో నశ్రు పూరితనయనములతో రామమోహనుఁ డీవలకు వచ్చెనఁట. ఈసమాగమ మెన్నఁడును మఱవరానిదని రాస్కోపుత్రుఁడు వ్రాసియుండెను. స్వదేశపద్ధతిని గేలు మోడ్చి నమస్కరించి రామమోహనుఁడు 'ఐరోపాఖండమందే గాక ప్రపంచమందం తటను గీర్తి వ్యాపించిన యట్టి మహామహుని సందర్శించుట

నా యపూర్వభాగ్యము. అపరిమితానందభరితుఁడ నైతి' నని వక్కాణింప రాస్కోదొరగారు 'నాజీవితమం దీ సుదినము గాంచు భాగ్య మిచ్చినందుల కీశ్వరునకు ధన్యవాదము లర్పించుచున్నా' నని ప్రత్యుత్తర మొసఁగెనఁట. రామమోహనుఁ డా దేశమునకు వచ్చిన హేతువులనుగూర్చి వారిరువురు ముచ్చటించిరఁట. ఈసమావేశము జరిగిన కొంతకాలమునకే రాస్కో మరణించెను.

ఆదినములలో కామన్సుసభలో జరుగుచున్న రాజ్యాంగ సంస్కరణచర్చ వినుటకుగాను లివర్‌పూల్ నుండి రామమోహనుఁడు లండనునగరమునకుఁ బ్రయాణమయ్యెను. మంత్రులలో నొకఁడగు బ్రౌహేమ్‌ప్రభువునకు రాస్కోదొరగా రొకయుత్తర మిచ్చియుండిరి. రామమోహనుని కుచితాసన మేర్పఱచి సత్కరించవలెనని వ్రాసియుండెను. మార్గమధ్యమున నాంగ్లదేశ సౌభాగ్యమును గాంచుచు వచ్చి మాంఛెస్టర్ నగరమున దిగెను. ఈయన రాకవిషయమై విని కర్మాగారములందుఁ బని చేయు వేలకొలఁదిపనివాం డ్రానాఁటికి పని మానివేసి హిందూదేశమునుండి యెవరో యొక 'రా' జేతెంచినాఁడని చెప్పుకొనుచు నాయనను జూచుటకు గుమికూడిరి. చేతులు కడుగుకొనకయే కరస్పర్శకొఱకుఁ దహతహలాడిరి. పలువురు స్త్రీలాయన నాలింగనము చేసికొన నిచ్చగించిరి. అతికష్టముతో వీరలనుండి యాతఁడు తప్పించుకొనెను. యంత్రశాలకుఁ బోవు మార్గమున జనులను దప్పించుకొనుటకు రక్షకభటులు సాహా

య్యము కావలసివచ్చెను. గుంపు రాకుండఁ జేయుటకు ద్వారము మూయవలసి వచ్చెను.

లండన్ చేరుసరికి చీఁకటి పడెను. న్యూగేట్ వీథిలోనున్న రొకసత్రముఁ జూచి యసహ్యించుకొని వెంటనే గుఱ్ఱపుబండి నెక్కి 'ఎడన్ఫి' హోటలునకు రాత్రి 10 గంటలకుఁ బోయెను. ఆతఁడు నిద్రించిన కొంతతడవునకు జెర్మిబెంత్ హామ్ అను వృద్ధుఁడగు నాంగ్లతత్వవేత్త—కొన్ని సంవత్సరములనుండి యిల్లు కదలి యెఱుఁగనివాఁడు—అక్కడికి వచ్చి తాను వచ్చినట్లు వ్రాసి వెడలిపోయెను. తరువాత వారిరువురును మరలఁ గలిసికొనిరి. రామమోహనుఁ డీవసతిగృహమునుండి "రీజంటు వీథి"లో 125 వ నెంబరు గృహమునకు మారెను. అచ్చటఁ గొన్ని మాసములుండి హిందూదేశప్రతినిధిగా గౌరవింపఁబడుచుఁ గాలము గడిపెను. లండన్ నగరప్రముఖు లందఱుఁ దమ కాయన యందుఁగల గౌరవమును సూచించుటకు వచ్చి పోవుచుండెడి వారు. ఉదయము 11 గంటలనుండి సాయంకాలము 4 గంటల వఱకతఁ డున్న వీథియంతయు శకటావళితోఁ జూడఁ జోద్య ముగ నుండెను. అప్పటి దేశస్థితినిబట్టి వచ్చినవారలతో రాజ్యాంగవిషయములు తీవ్రముగా ముచ్చటించుచుండుటచేఁ గొలఁదికాల మాతఁడు వ్యాధిగ్రస్తుఁడాయెను. ఆయన నెవ్వరును జూడకుండునట్లు వైద్యులు నియమించిరి.

పార్లమెంటునందలి ప్రభువులసభలో రాజుగారి సోద రుఁడే రామమోహను నెఱుకపఱచెనఁట. ఇతఁ డాసమయమం

దచ్చట లేనిచో నప్పుడు చర్చింపఁబడుచున్న హిందూదేశపు జ్యూరీచట్టమును ప్రభువు లెదుర్కొనియుండెడివారలే! బ్రాహేమ్ మున్నగు ప్రభువులతో నత్యంతస్నేహభావమున మెలఁగుచుండెడివాఁడు. రాజుగారి సోదరుఁడగు ససెక్సుప్రభు వీయన కత్యంతస్నేహితుఁ డయ్యెను. డెవన్‌షైర్ ప్రభువుయొక్క యాతిథ్యమును బొందుచు నీయన యప్పుడప్పుడు లండన్ నాటకశాలల కేగుచుండెడివాఁడు. పూర్వపరిచితుఁడగు మన్‌స్టర్ ప్రభువు, సర్ హెన్రీస్ట్రాచీ, సర్ ఛార్లెస్‌ఫోబ్జు మున్నగు ప్రముఖులందఱును రామమోహానుని ప్రాణమిత్రులైరి. ఇట్లు గొప్పవారి స్నేహమును బొందుటయేగాక సామాన్యప్రజల సహవాసముగూడఁ జేసి వారలగౌరవమునకుఁ బాత్రుఁ డయ్యెను. లండన్‌నగరవీధులలో నీతఁడు మొదటఁ బ్రజలకుఁ గాన్పించినపుడు "టిప్పూ" "టిప్పూ" అని యఱచిరఁట !

పైని వివరింపఁబడిన వ్యక్తిగతస్నేహసంబంధము లేగాక మొత్తముమీఁద నాంగ్లేయులు రామమోహానునికిఁ జూపిన గౌరవము రాజగౌరవముతోఁ దులతూఁగుచుండెను. ఈయనకు గౌరవసూచకముగా ననేకసభలు జరిగియుండెను. మొట్టమొదట బ్రిటిషు యునిటేరియన్ సంఘమువారిప్రముఖునకు స్వాగతము చెప్పుట కొకమహాసభఁ గావించిరి. ఈవిషయ మంతయు 1831 వ సంవత్సరము జూన్ మాసపు "మంత్లీరిపోజిటరీ" యను మాసపత్రికలోఁ బొందుపఱుపఁబడి యున్నది. రామమోహానుఁడు సభామంటపము కరుదేఱఁగనే కరతాళ

ధ్వనులు మిన్నుముట్టఁ జెలరేగెను. డాక్టరు బేరింగ్ అను సుప్రసిద్ధగ్రంథకర్త స్వాగతోపన్యాసము గావించుచు "వేలకొలఁది యోజనములనుండి యరుదెంచిన యీ మహామహుఁడుగూడఁ గొన్నివందలసంవత్సరములక్రితము జీవించిన ప్లేటో, సోక్రటీస్, మిల్టన్, న్యూటన్ బోలినమహాత్ములను స్మరణకుఁ దెచ్చుచున్నాఁడు. వారిని జూచినచో నుదయించుభావములే యీ సమయమందుఁగూడ మనమనంబుల నుద్భవించుచున్న" వని పల్కెను. అమెరికా సంయుక్తరాష్ట్రములందలి హార్వర్డు విశ్వవిద్యాలయాధ్యక్షుఁడగు డాక్టరు కర్క్‌లేండ్ గారు "మాఖండమందీరాజుగారి ప్రతీతి యెల్లెడల నల్లుకొనియున్నది. వీరిరాకకై యచ్చటిప్రజ లత్యంతాతురతతో నిరీక్షించుచున్నా" రని యమెరికాఖండమున కాహ్వానించెనఁట. పిమ్మట ఫాక్సుదొర గారుకూడ రామమోహనుని బ్రశంసించిరి. ఈయుపన్యాసమైనపిదప రామమోహనుఁడొక చక్కని చిన్న యుపన్యాసముఁ గావించెను. తన కీయఁబడిన ఘనమగు స్వాగతమునకుఁ గృతజ్ఞతఁ దెల్పుచు నిట్లు ముగించెను. "హేతువు, మతగ్రంథములు, బుద్ధిబలము ఒకవైపునను, ధనము, అధికారము, ఈర్ష్య మఱియొకవైపున నుండఁ బ్రపంచమున నొక ఘోరసమరము జరుగుచున్నది. కాని కొంచెమాలస్యముగనో, త్వరితముగనో మీకు విజయము తప్పదని నాదృఢవిశ్వాసము. నాకు మీరొసఁగిన గౌరవము జీవితాంతమువఱకు నెన్నఁడు మఱవను."

గొప్పవారియొక్కయు, సామాన్యులయొక్కయు, సంఘములయొక్కయు మన్ననల నొందుటయేగాక దొరతనము వారికిఁ గూడ నీయనయెడఁ బ్రత్యేకగౌరవ ముదయించెను. తూర్పుఇండియా వర్తకసంఘమువారు మొదట రామమోహనుని ఢిల్లీచక్రవర్తిప్రతినిధిగ నంగీకరింపకపోయినను, "రాజా" బిరుదునకుఁ దమయనుమ్మతిని దెలిపినను, నాయనను 1831 వ సం॥రం జూలై 6 వ తేదీని గొప్పవిందొకటి కావించి సన్మానించిరి. ఆవిందున కెనుబదిమంది ప్రముఖు లాహ్వానింపఁబడిరి. మహారాజవైభవముగ సత్కారము జరిగెను. వర్తకసంఘాధ్యక్షుఁడు రామమోహను నభినందించుచు "ఉద్యానవనమందందములగు పుష్పకదంబముల మకరందమును గ్రోలు నిందిందిరమువోలె నీ బ్రాహ్మణశ్రేష్ఠుఁ డక్షయంబగు జ్ఞానభాండంబుల నుండి తన యాత్రలమూలమునను, పాండిత్యగరిమవల్లను నమూల్యంబగు ధీశక్తిని సేకరించె" నని నుడివెను.

రామమోహనుఁడు ప్రత్యుత్తర మొసంగుచుఁ దూర్పుఇండియా వర్తకసంఘముయొక్క పరిపాలనను గొనియాడి బెంటిక్ ప్రభువు హిందూదేశస్థులయెడఁ జూపిన సానుభూతియు, భారతీయు లితరదేశస్థులవలె నుచ్ఛస్థితిలోనుండుట కొనర్చిన సేవయుఁ బ్రశంసించెను. ఆవిందులోఁ దనచుట్టును జేరియున్నవారు మాంసభక్షణముఁ జేయుచున్నను, ద్రాక్షపాన మొనర్చుచున్నను సహించి, బ్రాహ్మణుఁడైన రామమోహనుఁడు మాత్రము వరియన్నము, శీతలజలముఁ దప్ప వేఱెద్దియుఁ

గైకొనకుండు టాశ్చర్యమైన విషయమని "ఏషియాటిక్ జర్నల్" అను పత్రిక వ్రాసియుండెను. (ఆగస్టు 1831)

ఆంగ్లదొరతనమువారు రామమోహనుని ప్రాతినిధ్యమును, "రాజా" బిరుదు నంగీకరించి యెక్కుడు గౌరవించిరి. సెంటుజేమ్సుభవనమున 1831 వ సం॥రము సెప్టెంబరు 7 వ తేదీని బోర్డు ఆఫ్ కంట్రోలు అధ్యక్షుండగు ఛార్లెస్ గ్రాంట్ దొరగారు రాజా రామమోహనరాయలవారిని సార్వభౌముండగు నాల్గవ విలియమురాజుగారికి పరిచయ మొనర్చెను. రాజుగా రెంతో యాదరణతో దర్శన మొసంగిరి. బ్రాహ్మణుల దుస్తులు, తలపాగ, ముఖమల్ జరీలతోను గూడిన 'కాబ' (ఉత్తరీయము) రామమోహనుఁడు ధరించియుండెను. ఇంతియేగాక విలియమ్‌రాజుగారి పట్టాభిషేకమహోత్సవమునాఁ డితరరాజ్యములనుండి యేతెంచిన రాయబారులతో సమానముగ నీ హిందూదేశపు రాయబారినిగూడ నుచితాసన మిచ్చి గౌరవించిరి. మఱియొకసమయమున లండన్ నగరపు వంతెన ప్రారంభోత్సవసందర్భమున రాజుగారు గావించిన విందునకు రామమోహనునిగూడ నాహ్వానించిరి. రాయల్ ఏషియాటిక్ సంఘమువారు తమ సంఘవార్షికోత్సవమున కీయన నాహ్వానింప కోల్‌బ్రూక్ అను వైజ్ఞానికుని కీయన వందనము లర్పించుచు నుపన్యసించెను. ఈరీతి ననతికాలములో నాంగ్లదేశమునఁ బెద్ద పెద్ద సంఘములలో రామమోహనుఁడు ముఖ్యపురుషుఁ

డయ్యెను. తన నివాసముగూడ మఱియొక మహాభవనమునకు మార్చుకొనెను.

రామమోహనుఁ డాంగ్లదేశముననున్న కాలములో పార్లమెంటువారు సంస్కరణచట్ట మొకదానిని (Reform Bill) తీవ్రముగఁ జర్చించుచుండిరి. మొదటిచట్ట మాతఁడు వచ్చుసరికే వీగిపోయెను. రెండవప్రయత్నము "కామన్సు" సభలో నెగ్గినను, ప్రభువులసభలో నోడిపోయెను. దేశమంతయు నల్లకల్లోలముగ నుండెను. మరల మూఁడవచట్టము 'కామన్సు' సభవా రంగీకరించిరి. ప్రభువులసభలో నామోదింపవలసియుండెను. ఈసమయమున దేశమంతట నావరించిన యుద్రేకములో రామమోహనుఁడు గూడఁ బాల్గొనెను. ఈచట్టముయొక్క విషయము తెలుపఱకును బ్రిస్టల్‌నగరప్రయాణ మాఁపుచేసెను. "ఈసమరము రాజకీయసంస్కర్తలకును, దత్ప్రయత్నముల నెదుర్కొనువారికేగాక, స్వేచ్ఛకును, బానిసతనమునకునుగూడ నని తెలిసికొనవలసి యున్నది. న్యాయమునకును, అన్యాయమునకే యీ యుద్ధము. సక్రమమైనహక్కులకును, అక్రమమైనపద్ధతికే యీపోరాటము. కాని రాజకీయరంగమందును, మతవిశ్వాసములందుఁగూడ నుదారాశయము లెప్పుడును నెమ్మది నెమ్మదిగ, నిరంకుశు లెన్నియంతరాయములఁ గల్పించుచున్నను, బట్టుదలతోఁ బ్రతిఘటించుచుండుటయే మనము గాంచుచున్నా" మని యొక యాంగ్లవిదుషీమణికి రామమోహనుఁడు వ్రాసియుండెను. ఆ చట్టము శాసనముగా నంగీకరింపఁబడనిచోఁ దా నాదే

శము వీడి బ్రిటిషురాజ్యముననే యుండక యమెరికాలోఁ దన కాలముఁ గడపెదనని యాతఁడు బహిరంగముగాఁ బ్రతిజ్ఞ గావించెను. సర్వజనులకు స్వేచ్ఛాభిలాష సహజమని గ్రహించి తోడి మానవుల స్వాతంత్ర్యజీవనమందుఁ దాను సంతసించుచు, వారి దౌర్భాగ్యమునకుఁ దాను విషాదపడుచు నతఁడు కాలముఁ గడపెను. రామమోహనునివంటి లోకశ్రేయోభిలాషు లాతనికి ముందు లేరని నొక్కి చెప్పవచ్చును. ఎట్టకేలకు ప్రభువులసభలో నీ చట్టము శాసనరూపముఁ దాల్చఁగనే రామమోహనుని యానందమునకు మేర లేదు.

రామమోహనుని మతవివాదములవలన ఫ్రాన్సులో సహిత మాయనపేరు 1818 వ సం॥రము నుండియే ప్రఖ్యాతిఁ గాంచెను. ఆయన మత సాంఘిక సేవనుగూర్చి యచ్చట పత్రికలలో నిదివఱకే ముచ్చటింపఁబడియుండెను. పారిస్ నగరముననున్న యొకసంఘములో నాయన నీవఱకే గౌరవసభ్యునిగాఁ జేర్చియుండిరి. ప్రకృతిసౌందర్యముతోను, నాగరికతతోను, స్వేచ్ఛాపరిపాలనావిధానముతోను నొప్పారుచుండెడి ఫ్రాన్సు దేశమును జూచుటకు రామమోహనుఁ డువ్విళ్ళూరుచుండెను. 1831 వ సంవత్సరాంతమునఁ బ్రయాణసన్నాహము చేసికొనెను. కాని తలవనితలంపుగా విదేశీయు లాదేశమునకుఁ బోవలెనన్న మొట్టమొదట లండనులోనున్న ఫ్రెంచిరాయబారి యనుమతిని బొందవలెనని యాయనకుఁ దెలిసెను. ఈ స్వేచ్ఛాభంగమునకు రామమోహనుఁడు కోపోద్దీపితుఁ డయ్యెను. "ఆసి

యాఖండమందుసహితము విదేశీయులయెడ నిట్టి నిబంధన లెచ్చటను లేవు. స్వాతంత్ర్యప్రియులగు ఫ్రాన్సుదేశస్థు లిట్టినిబంధనలను నియమించు టత్యాశ్చర్యకరముగా నున్నదని యీ సందర్భముననే ఫ్రాన్సుదేశపుమంత్రి యొక చరిత్రాత్మకమగు లేఖలో వ్రాసెను. నేఁటికిసహితము పండితులచే నా లేఖ యమూల్యముగఁ బరిగణింపఁబడుచున్నది. నేఁటి స్వాతంత్ర్యసూత్రములు నాఁడే రామమోహనుఁడు గొంతెత్తి ప్రపంచమునకు వాక్రుచ్చెను. ఈలేఖయందలి దూరదృష్టిని జూచి విస్మయమొందని రాజకీయవేత్తలు లేరు. ఈనాఁటి నానాజాతిసమితి యొక్క మూలబీజము లాలేఖయందుఁ గాననగును. మానవాభ్యుదయమునకు రామమోహనుఁ డెట్టిస్వప్నములఁ గాంచుచుండెడివాఁడో దానియందాతఁడు వక్కాణించిన సూత్రముల వలన స్పష్టము కాఁగలదు.

"ఏదేశమువారైనను, మానవు లొకరి నొకరు కలిసికొనుటకు, సాంగత్యలాభము నొంది సంతోషించుటకు నే యడ్డంకులు నుండరాదు. మతము విజ్ఞానశాస్త్రములు గూడ మానవజాతి యొకకవికుటుంబ మనియు, వివిధదేశములు, తెగలు, నందలిశాఖలే యనియు నొక్కి వక్కాణించుచున్నవి.

సర్వసాధారణముగా రెండుదేశముల కేవేని భిన్నాభిప్రాయము లున్నచో నిరుకక్షలవారు సమమగు సఖ్యముతోఁ గూడిన నొకమహాసంస్థ కాభేదములు విన్నవించి, అట్టిసంస్థలో

నధికసంఖ్యాకులచే నామోదింపఁబడిన తీర్మానములకు వారు బద్ధులై యుండవలయును. అట్టిమహాసంస్థయొక్క యధ్యక్షునిగ నొకసంవత్సర మొకదేశస్థుని, రెండవసంవత్సరము రెండవ దేశస్థుని నెన్నుకొనుటయు; ఈ సమావేశము జరుగు స్థల మొకసంవత్సర మొకదేశమునను, రెండవసంవత్సరము రెండవ దేశమునను నుండున ట్లేర్పాటు చేసికొనుటయు జరుగుచున్న చో సక్రమపద్ధతిని ప్రభుత్వవిధానములు సాగుచుండును. ఇట్టి సంస్థ యేర్పడినచో రాజకీయరంగమందుఁగాని వర్తకవిధాన మందుఁగాని, యేరెండు నాగరికదేశముల కభిప్రాయభేదము లున్నను అవన్నియుఁ జక్కఁగా, న్యాయముగాఁ బరిష్కరించు కొనుటకును, దరతరముల వెంబడి నాయాదేశస్థులలో శాంతి సద్భావములు పెంపొందుటకును వీలగు" నని రామమోహనుఁ డానాఁడే వ్రాసియుండెను. కావుననే యిప్పటి నానాజాతిసమితి కిని, నానాజాతుల యున్నతన్యాయస్థానమునకును ద్రోవఁజూపిన రాజనీతిధురంధరుఁడు, మహాప్రవక్తయునని రామమోహనుఁడు పరిగణింపఁబడుచున్నాఁడు. కడకు ఫ్రాన్సుదేశమునకుఁ బోవు టకు వచ్చిన విఘ్నములన్నియు సమసిపోవ 1832 వ సం॥రం లో నాతనిసంకల్పము సిద్ధించెను. పారీస్‌నగరముఁ జేరినతోడనే కవిశేఖరులు, రాజకీయవేత్తలు మున్నగు పెద్దలందఱుఁ దమ దేశమున కరుదెంచిన యపూర్వవ్యక్తి నుత్సాహముతో దర్శించి యాతిథ్య మొసంగిరి. ఇచట ఫ్రెంచిమహాకవియగు 'థామస్

మూర్'తో స్నేహము గలిగెను. ఈకవి తన దినచర్యపుస్తక ములో రామమోహనుని పాండిత్యప్రతిభలు ప్రశంసించి యుం డెను. "లూయీ" చక్రవర్తితో రామమోహనుఁడు పరిచయ మొందెను. అనేకపర్యాయము లాయనతో విందారగించెను. ఆ చక్రవర్తిగారి యాతిథ్యమును గూర్చియు, దయాదిసద్గుణ ములఁ గూర్చియు రామమోహనుఁ డెక్కువగాఁగొనియాడెను.

1833 వ సంవత్సరము జనవరి మాసములో రామమో హనుఁ డాంగ్లదేశమునకుఁ దిరిగివచ్చెను. ఈ పర్యాయము కల కత్తాలోఁ దనప్రాణస్నేహితుండగు "డేవిడ్" దొరగారి సోదరు లగు "జాన్; జోసెప్ హేర్" దొరగార్ల భవనమున విడిసెను. (48 బెడ్ ఫర్డుస్క్వేర్) రామమోహనుఁ డాంగ్లదేశమున నున్న తఱిఁ దాను హిందూదేశమునఁ బ్రచురించిన కరపత్రముల నాంగ్లస్నేహితులకొఱకు మరలఁ బ్రచురించెను.

## రామమోహనుఁ డాంగ్లదేశమున భారతమాత కొనర్చిన సేవ

స్వదేశమునకు రామమోహనుఁ డాంగ్లదేశమున నొన ర్చిన కృషినిబట్టి యాతఁడు రాజకీయరంగములో నెట్టి ప్రతిభా శాలియో, భారతాభ్యుదయమునకు నిరుపమానమగు దూర దృష్టితో నెన్నెన్నిబీజముల వెదచల్లెనో స్పష్టముగా గోచ రించును.

కలకత్తాసనాతనులు సహగమనమును దీసివేయరాదని శాసించిన విజ్ఞప్తికిఁ బోటీగా మఱియొక విజ్ఞప్తిని రామమోహ

నుఁడు "కామన్సు" సభవారికి 1831 సం॥రములో దాఖలు చేసియుండెను. 1832 వ సంవత్సరము జూలై 11 వ తేదీని ఆతనివాదమునే సమర్థించుచు, సనాతనుల మహాజరును ప్రీవీ కౌన్సిల్ వారు త్రోసివేయఁ జూచుభాగ్య మాతనికిఁ గలిగెను. ఆసమయమం దాతఁడు న్యాయమూర్తుల ప్రక్కనే యాసీనుఁడై యుండెను. రామమోహనుఁడు 'రాజప్రతినిధి' హోదాతోఁ గావించిన విజ్ఞాపనవలన ఢిల్లీశ్వరుని మొఘాలించి ప్రతిసంవత్సరము కొన్నిషరతులతోఁ జక్రవర్తికి మూఁడులక్షల రాఁబడి యెక్కువ చేయఁబడెను. ఢిల్లీశ్వరున కిది స్వల్పముగను షరతు లన్యాయముగను దోఁచినను రామమోహనుఁడు తిరిగి హిందూదేశమునకు రానికారణమున నాతఁడు వాని నంగీకరింపవలసి వచ్చెను. తన సేవకు రామమోహనుఁడు డెబ్బదివేల రూప్యములు వేతనముగాఁ బొందియుండెను. తనవాగ్దానప్రకారము ఢిల్లీశ్వరుఁడు రామమోహనునిపుత్రులకీయఁదలఁచిన పారితోషికము కంపెనీవారీయ నంగీకరింపలేదు.

తూర్పిండియా వర్తకసంఘాధికారపత్రము తిరిగి మంజూరుచేయువిషయమై 1831 సం॥రమున విచారణకు వచ్చెను. ఆ సందర్భములో హిందూదేశపరిపాలనవిషయమై చర్చించుటకేర్పాటుపఁబడిన 'సెలక్టు కమిటీ' యెదుట మాతృదేశమునకు సంబంధించిన యనేకవిషయములనుగూర్చి యమూల్యములగు విషయములఁ దెల్పి చరిత్రాత్మకమగు సాక్ష్యమొసంగి మేరలేని

దేశసేవ యొనర్చెను. ఆదినములలో నీమహామహుని సుందర విగ్రహము పెక్కుసార్లు పార్లమెంటుభవనములం దాంగ్లేయులు గాంచుచుండిరఁట. చాలవఱకతని యభిప్రాయము లన్నియు వ్రాఁతమూలమునఁ దెల్పెను. వానివలన నాతఁ డెంతమహాజ్ఞాన సంపన్నుఁడో యంత దేశభక్తుఁ డనికూడఁ దెలియఁగలదు. ప్రభుత్వమువారి కాయనయొక్క సలహాలమూల్యములై, వారేర్పఱుపనుండిన ప్రభుత్వవిధానమున కెంతేని సాహాయ్యకారిగా నుండెను. 1832 వ సం॥రము ఆగష్టులో 'సెలక్టు కమిటీ' వారి నివేదిక పార్లమెంటుసభవారికి సమర్పింపఁబడి 1833 వ సం॥రం మార్చి, ఏప్రిల్ మాసములలోఁ గంపెనీ డైరక్టర్ల యామోద మును బడసెను. అప్పు డాసలహాల నొకచట్టరూపమున జూన్ మాసములో కామన్సుసభలోఁ బ్రవేశపెట్టిరి. 1833 వ సం॥రం ఆగస్టు 28 వ తేదీని చక్రవర్తి యంగీకారముఁ బొంది శాసన మయ్యెను. కాని రామమోహనున కది తృప్తికరముగా లేదు. కొంతమంది ముఖ్యులగు స్వదేశీయులయొక్కయు, విదేశీయుల యొక్కయు సలహాలను బొందనగునని రామమోహనుఁడు గావించిన సూచనను గూడ దొరతనమువా రంగీకరింపరైరి. కాని యారోజులలో రామమోహనుఁ డొనర్చిన కృషియే లేనిచో ఆయన గతించినపిమ్మట హిందూదేశస్థులు పొందిన హక్కులైనను న్యాయముగా దొరతనమువారినుండి వచ్చియుండెడివి కావు. హిందూదేశపుఁ బరిపాలనావిధాన మభివృద్ధినొందుటకు రామమోహనుఁడు గావించిన సూచనలో ముఖ్యమైనవి

జ్యూరీపద్ధతి, న్యాయవిధానమందు హిందూదేశస్థులను 'ఎసెసర్లు'గా నేర్పాటు చేయుట, సంయుక్త న్యాయాధికారుల యేర్పాటు; ప్రభుత్వపు టుత్తరవులు సక్రమమగు గ్రంథరూపమున నుంచుట; సివిల్ క్రిమినల్ శాసనములను క్రోడీకరించుట; రెవిన్యూపద్ధతి, భూములకవులు, శిస్తు నిర్ణయము, ఆస్తిపై హక్కు మున్నగు విషయములలోఁ దగు మార్పులఁ జేయుట; రైతులయొక్కయు, మొత్తముమీఁద దేశస్థుల యొక్కయు, దుస్థితి నణఁచి వారిని పైకి లేవనెత్తుమార్గములు; న్యాయశాఖలోని కార్యనిర్వాహకవర్గముల విభజన; హిందూదేశపున్యాయాధికారులకు నైరోపియనులపై నుండఁదగు నధికారము; శాసననిర్మాణమందు దేశస్థుల యభిప్రాయముల నతిక్రమింపకుండుట; స్వదేశసైన్యపు యేర్పాటు; హిందూదేశస్థులకు గొప్ప గొప్ప పదవుల నియ్యవలసిన యావశ్యకత; శాశ్వతపువన్ను నిర్ణయము మొదలగు ననే కార్థిక రాజకీయ విశేషాంశములు గలవు. ఆకాలములో నొకవ్యక్తి నేఁటికి నెదుర్కొను సమస్యల నంత నేర్పుతోఁ బరిష్కరమొనర్చు టెంతయద్భుతావహమో పాఠకులే గుర్తింతురుగాక! ఈవివిధాంశములపై నాయన యొసంగిన యభిప్రాయములలోఁ గొన్ని మచ్చున కిందుదాహరింపఁబడుచున్నవి. హిందూదేశమునుండి యేఁటేఁటఁ గొల్లకొలఁది ద్రవ్యము విదేశములకుఁ బోవుదుస్థితినిగూర్చియు, నైరోపియనులు హిందూదేశమున స్థిరనివాసము లేర్పఱచుకొనవలసిన యావశ్యకత, దానివలనఁ జేకూరు లాభములఁగూర్చియుఁ గూడ నతఁ

డిచ్చిన యభిప్రాయము లమోఘము లైనవి. వానిలోనుండి కొన్ని యిచ్చటఁ బేర్కొనఁ బడుచున్నవి—

(1) రైతులదుస్థితిఁ బాపవలెనన్న జమీందారులు, కట్టవలసిన శిస్తు తగ్గింపనిదే, రైతులభారము తగ్గదు. ప్రభుత్వమున కాదాయము తగ్గినయెడల, సామాన్యజీవితమున కవసరమగు భోగములపైఁ బన్ను విధింపవలెను. ఎక్కువజీవితములు పుచ్చుకొను ఐరోపియనులను కలెక్టరుద్యోగములకు నియమించుట కంటె బుద్ధికుశలతతో వారికి తీసిపోనివారయ్యుఁ దక్కువజీతమునకువచ్చు హిందూదేశస్థుల నియమించుట లాభదాయకము.

(2) భూమిపన్నును, తదితరాదాయములను రాఁబట్టుట కేర్పడిన యుద్యోగస్థులకు దండనాధికారముగూడ నీయఁదగదు. వారట్టిచోఁ దమపనులను దామే విమర్శింపవలసినవారగుచున్నారు గాన తమపట్టుదలను విడువక న్యాయ మాలోచింపరు. అన్యాయములగుఱించి చెప్పుకొను స్థానములందు వీ రెప్పుడును ప్రతిపక్షులుగను, ఉత్తరవాదులుగను నుండవలెను. ఇట్లయినచోఁ బ్రతివ్యక్తియుఁ దనయెడల నెవ రేమి యన్యాయ మొనర్చినను నిర్భయముగ న్యాయస్థానమునఁ జెప్పుకొనుట కవకాశ ముండును.

(3) న్యాయవిధులు, శిక్షలు, అధికారులు నిర్వహింపవలసిన తదితరధర్మములను గూర్చియు గ్రంథరూపమునఁ బ్రకటింపఁబడవలయును.

(4) న్యాయస్థానములందు వాడఁబడుచున్న పారసీక లిపి యిప్పటిన్యాయాధికారులకును, ప్రజలకునుగూడఁ దెలియ కున్నది. ఇందువలన నాభాషను దగ్గించి యాంగ్లేయభాష వాడి నచో నధికారులకుఁ దెలియుటయేగాక క్రమక్రమముగఁ బ్రజ లకుఁగూడ నాభాషాధ్యయనముకొఱ కాతురత హెచ్చును.

(5) న్యాయవిధుల కేర్పడినచట్టము లన్నియు విద్యా ధికులకే తప్ప సర్వసాధారణముగ నందఱికిఁ దెలియకుండుట గొప్పలోపము కావున సామాన్యముగఁ బల్లెలలోనివారల కుపకరించెడి ప్రతిశాసనమును దేశభాషలలో వ్రాయించి ప్రతి పెద్దగ్రామమునందు నొకస్థాన మేర్పఱచి యచ్చట శాసనము లను బ్రకటించి వాటిరక్షణకై స్వల్పవేతన మిచ్చి యొకభటుని నియమించవలెను. ఎవ్వరైన వచ్చి చూచుకొనుటకును, గావల సివచ్చినచోఁ బ్రతి వ్రాసికొనుటకును అవకాశము నీయవలెను.

(6) న్యాయము దెలిసికొనుట కొన్నిసందర్భములలో మిక్కిలి కష్టము కాన నొక్కొక్క విషయములో బహు సూక్ష్మముగ బుద్ధిని వినియోగింపవలసియుండును. ఈ సూక్ష్మ విచారము నొక్కమనుష్యుఁడే చేయునెడల వాని జ్ఞానమున కొక్కొక్కప్పుడు భ్రాంతి కలుగవచ్చును, కనుక న్యాయాధి కారికిఁ దోడుగా మఱికొందఱి యాలోచనలుకూడ నవసరము. ముఖ్యముగాఁ బెద్దపెద్ద న్యాయస్థానములయం దిట్టిపద్ధతి నవ లంబించుట మిక్కిలి శ్రేయోదాయకము.

(7) ఒకశాసనము క్రొత్తగా దొరతనమువారి యను మతిఁ బడసి ప్రకటింపఁబడుటకుముందు ప్రజ లేమైన నభ్యంత రములఁ దెలుపుకొనుటకై కొంతవ్యవధి నిచ్చి యొకచిత్తుప్రతిని ముందుగఁ బ్రచురింపవలయును. పిదప శాసనవిషయములకు సంబంధించిన ప్రజలలో ముఖ్యుల యభిప్రాయములను బుచ్చు కొని సాధ్యమైనంతవఱకు వానిని సానుభూతితోఁ బరిశీలింప వలయును. అపుడు ప్రభుత్వమువారియెడలఁ బ్రజలలో విశ్వాస మేర్పడును.

(8) హిందువుల కున్నతాధికారముల నిచ్చుట నష్టదా యకంబను దురభిప్రాయము దొరతనమువారి కుండఁగూడదు. వారిని దూరముగ నుంచుటవలనఁ గలిగెడి పరభావముకంటె, దగ్గఱకుఁ జేర్చి సమానగౌరవము నిచ్చి వారి నభివృద్ధి నొందిం చుటవలనఁ గలిగెడు సుహృద్భావమే క్షేమకరము.

(9) యూరోపియనులు హిందూదేశమున హిందువు లతోపాటు నివాసము లేర్పఱచుకొన్నయెడల వారివలన వ్యవ సాయము, పంటలు నభివృద్ధిలోనికి వచ్చుమార్గములను బోధించు శాస్త్రములు బాగుగా వ్యాపించుటయేగాక వ్యాపా రముగూడ వృద్ధినొందును.

(10) ఒకవేళ నెప్పుడైన దైవికముగ నాంగ్ల, హిందూ దేశములకుఁగల ప్రస్తుతసంబంధముయొక్క స్వరూపము మాఱి నను, ఉభయదేశములకు వర్తకసంబంధమును, బరస్పరగౌరవ మును హెచ్చును.

ఆకాలపు హిందూదేశచరిత్రను జదివినవారికి 1835 వ సం॥రమునఁ బ్రకటింపఁబడిన చట్టమువలన హిందూదేశ రాజ్యాంగవిషయమున నెంతటి గొప్పమార్పులు జరిగినవో వేఱుగఁ జెప్పనక్కఱలేదు. ఆ సంవత్సరమునఁ దూర్పిండియా సంఘపువారి వర్తకసంబంధము తొలఁగెను. హిందూదేశము, చీనా మొదలగు ప్రదేశములలో వర్తకము చేయుట కందఱికి స్వాతంత్ర్య మీయఁబడెను. స్వదేశస్థులకు గొప్ప గొప్ప ఉద్యోగముల నీయవచ్చునని పార్లమెంటువా రంగీకరించిరి. వేయేల ? అప్పటినుండి హిందూదేశచరిత్రమునందలి యాంగ్ల ప్రభుత్వభాగమున నొక నూతనశక మేర్పడెను. దీనికంతకు రామమోహనుని ప్రబలప్రయత్నమే కారణమనియు, దీనికొఱ కాతఁడు తన భాగ్యమును, దన ప్రాణమునుగూడ ధారవోసె ననియు నెఱిఁగినవా రరుదుగ నున్నారు.

## అంత్యదశ

అహోరాత్రము లొక్కనిమిషమైనను విసుగు విరామము లేక పనిచేయుచుండిన రామమోహనుఁడు 1833 వ సం॥ సెప్టెంబరు మాసపు మొదటివారము "యునిటేరియన్" స్నేహితుల యాహ్వానముపైని "బ్రిస్టల్" నగరమునకుఁ బోఁగాఁ గొంత విశ్రాంతి కలిగెను. అచ్చటఁ గొంతకాలము గడపినపిదప స్వదేశమున కేగవలయునని రామమోహనుని తలంపు; కాని యీశ్వరేచ్ఛ వేఱుగ నుండెను.

ఆంగ్ల దేశశీతోష్ణస్థితి రామమోహనుని దేహారోగ్య మును గొంతవఱకుఁ బాడుచేసెను. పైత్యకోశము చెడిపోయెను. దేహము నీర్వట్టినట్లు స్థూలముగాఁ గనుపించుచుండెడిది. అంత్య దశలో ననారోగ్యము, మనోవేదన, కొంతవఱకు డబ్బులేమియుఁ బరదేశమున నాతని వెంటాడించెను. ఆతని వ్యవహారములు చూచుచుండిన కంపెనీదారులు నష్టముల పాలగుటచే నీతఁడు కష్టపడవలసినవాఁ డయ్యెను. తూర్పిండియా వర్తకసంఘము వారిని గొంత ఋణ మిమ్మని కోరఁగా వా రాతని ప్రార్థనను నిరాకరించిరి. ఆయన మనోవేదన హెచ్చుట కిది యొక ప్రబల హేతు వయ్యె.

"బ్రిస్టల్" నగరమున కీయనతో హేర్ కన్యకూడ వచ్చి యుండెను. "కేసెల్" కన్యయొక్క భవనమున దిగుటకుఁ దన స్నేహితుఁడగు డాక్టరు కార్పెంటర్ దొరగా రేర్పాటు చేసి యుండిరి. "కార్పెంటర్" దొరగారి పోషణలోనున్న 'కేసెల్' కన్యయు, నామె పెదతల్లియగు 'హెకెల్' కన్యయు రామమో హనునకు వలయు సదుపాయము లన్నియు, మిక్కిలి నేర్పుతోఁ గూర్చుచుండిరి. దత్తపుత్రుఁడగు రాజా రామ్ అచ్చటనే చదువు చుండెను. తన హిందూసేవకులగు రామ్ హరిదాసు, రామ్ రత్న ముఖర్జీ యను నిరువురుఁగూడ రామమోహనునితో నుండిరి. డాక్టరు కార్పెంటర్ ప్రతిదినము రామమోహనునికడకు వచ్చి చూచుచుండుటయు, నప్పుడప్పుడు రామమోహనుఁడే ఆయన

గృహమునకు వెళ్ళుచుండుటయు జరుగుచుండెను. ఈమైత్రివలనను, సంభాషణలవలనను రామమోహనునకుఁ గొంత మనశ్శాంతి కలిగెను. కార్పెంటరుగారి ప్రార్థనాలయమునకుఁగూడ రామమోహనుఁడు రెండుపర్యాయములు పోయియుండెను. చేరువనున్న జాన్ ఫాష్టరుగారితోఁ గూడ స్నేహము చేసెను. అచ్చటి యునిటేరియనులు రెండు పెద్దభసలు గావించి రామమోహనుని గౌరవించిరి. సెప్టెంబరు 16 వ తేదీని తన మాతృభూమియొక్క విశేషములనుగూర్చి రామమోహనుఁడు తన కడపటియుపన్యాసమును గావించెను. 17 వ తేదీని శరీరమందంత బాగుండిన ట్లగపడలేదు. 19 వ తేదీ గురువారమునాఁడు హఠాత్తుగా రుగ్మత ప్రారంభించెను. భరింపలేని తలనొప్పితో పాటు జ్వరము వచ్చెను. మఱుసటిదినము చాల కలఁతగా నుండెను. మంచమునుండి క్రిందికిఁ, గ్రిందనుండి మంచముమీఁదికి లేచుచుఁ బరుండుచు, నాదినమంతయుఁ గడపెను. ఆ యర్ధరాత్రమున హఠాత్తుగా దేహము చల్లఁబడి, నాడి తగ్గిపోయి ప్రాణము పోవునట్లాయెను. కాని, యౌషధములు సేవించిన పిదప మరలఁ దేరుకొనెను. ఆయనకుఁ బరిచర్యలు చేయుటకు హేర్ కన్య ప్రక్కనేయుండున ట్లేర్పాటు చేయఁగా మొదట రామమోహనుఁ డది మర్యాదలోప మని యెంచి యొప్పుకొనలేదు. కాని, యీ దేశాచారము లట్టిసేవ నొప్పుకొనునని వైద్యుఁడు స్నేహితులు నొక్కి చెప్పఁగాఁ దుద కానె తనకు

శుశ్రూష యొనర్చుట కొప్పుకొనెను. మరణమువఱకుఁ గూడ హేర్ కన్య కన్నకుమార్తెవలె నాయనకుఁ బరిచర్యఁ జేసి ధన్యురా లయ్యెను. 22 వ తేదీని ప్రిచర్డు అను క్రొత్త వైద్యుఁడు గూడ రావింపఁబడెను. సాయంకాలము కొద్దిగ బాగుండెను. తనకుఁ దగిన వైద్యసహాయ మంతయు నచ్చుటఁ గలదనియు, వారిసేవకుఁ దా నెంతయుఁ గృతజ్ఞుఁడ ననియుఁ జుట్టునున్న స్నేహితులతో రామమోహనుఁ డనెను. 23 వ తేదీని మరల వ్యాధి యెక్కు వయ్యెను. గతరాత్రి నిద్దుర పట్టలేదు. డాక్టర్ కేరిక్ అను మఱియొక వైద్యునిఁ బిలువనంపిరి. తలనొప్పి యధిక మగుటచేఁ బట్లు వేయఁబడెను. కాని, రోగ మతిత్వరితముగ వృద్ధినొందుచుండెను. స్పృహతప్పినట్లుండి మధ్యమధ్య నులికి పడి లేచుచుండెను. 25 వ తేదీ రాత్రికి నోరు కొంత వంకర తిరిగి యెడమచేయి, కాలు, పక్షవాత మొందిన ట్లుండెను.

సెప్టెంబరు 27 వ తేదీ యాసన్న మయ్యెను. అది శుక్రవారము. అనంతపద్మనాభచతుర్దశి. హిందూదేశ చరిత్రలో నొకపర్వదినము. రామమోహనుఁడు బంధుమిత్రులను స్వదేశవిదేశములను దుఃఖసముద్రమున ముంచివేసెను. ప్రపంచమున గాఢాంధకారము ప్రవేశించిన ట్లుండెను. ఒకవైపునఁ బ్రశాంతమగు వెన్నెలరాత్రి; నిద్రావస్థయందున్న యాంగ్ల గ్రామజీవితము— మఱియొకవైపున మరణవేదనఁ బొందుచున్న యొక్కయసాధారణవ్యక్తి. 61 సంవత్సరములకు ముందు

తూర్పుకొండలలో నుదయించిన భాస్కరుఁ డానాఁడు పశ్చిమ తీరమున నస్తమించుచుండెను. హేర్‌కన్య పొంగి పొరలివచ్చు దుఃఖ మాపుకొనలేకుండెను. రాజారామ్ జనకునిచేతి నానుకొని యుండెను. శ్వాస తగ్గిపోవుచుండెను. నాడి కొట్టుకొనుట లేదు. దక్షిణకరముమాత్రము కదలుచుండెను. "ఓమ్! ఓమ్!" అను ప్రణవమంత్రముమాత్ర మప్పుడప్పుడు కొనయూపిరినుండి వినఁబడుచుండెను. వేకువజామున గం 2-25 నిమిషములకు రామమోహనుఁడు తన జీవితేశ్వరు నాలింగనము నందుకొనెను.

డాక్టర్ "ఎస్ట్లిన్" దొరగారు తన దినచర్యపుస్తకములో రామమోహనుని చరమదశనుగూర్చి వ్రాసిన పై విషయము లన్నియుఁ గార్పెంటర్‌కన్య శ్రద్ధతో సేకరించి వ్రాసి మనదేశీయుల కృతజ్ఞతకుఁ బాత్రురాలయ్యెను. శనివారము దయమున రామమోహనుని యూర్ధ్వభాగముయొక్క ప్రతిమ తీయఁబడినపిదప నాసుందరవిగ్రహము పరీక్ష కంపఁబడెను. మెద డెక్కువగా నుబ్బి యందొక ద్రవపదార్థము చేరియుండినట్లు తెలిసికొనిరి. దాని పైపొర కపాలము నంటియుండెను.

## అంత్యక్రియలు.

తుదివఱకును రామమోహనుఁడు తనవిశ్వాసములకు విరుద్ధముకాని హిందూసంప్రదాయముల ననవసరముగా విడువలేదు. వ్యక్తిగతముగాఁ దనకు వానియం దిష్టమయి

లేకపోయినను దన దేశీయులను సాధ్యమగునంతవఱకుఁ దనచర్యలతో నొప్పింపకుండుటయే యాతని యాశయము. కడవఱకు నిరువురు బ్రాహ్మణసేవకులు సేవ చేయుచుండిరి. మరణానంతరము యజ్ఞోపవీతముసహితము శరీరము నంటియున్నట్లు కనఁబడెను. బాహ్యచిహ్నములఁ దాల్చుటయందుఁ గాని విడుచుటయందుఁ గాని యాతనిమన స్సనవసరముగాఁ బోక యెల్లపుడును బ్రధానవిషయ మగు పరమాత్మునియందు లీనమైయున్నట్లు కన్పట్టుచున్నది. తా నాంగ్లదేశమున మరణించినచో నొకచిన్న స్థలమును గొని యచ్చటఁ దనశవమును సమాధిఁ జేసి దానిపై నొకచిన్నభవనముఁ గట్టించి యందొక బీదవానిని గాఁపురముంచి సమాధిని జూచుచుండున ట్లేర్పాటు చేయవలసినదిగా రామమోహనుఁడు కోరియుండెను. కేసెల్‌కన్య తనసుందరభవనమునకు వెనుకనున్న చక్కనితోఁటలోఁ గొంతస్థల మిచ్చెను. అచ్చట అక్టోబరు నెల 18 వ తేదీని పగలు రెండుగంటలవేళ యీ మహాత్ముని భౌతికశరీరము నిరాడంబరముగ భూస్థాపన జేయఁబడెను. ఆసమయమున స్టేపుల్‌సన్‌గ్రోవులో హేర్‌దొరగారు, హేర్‌కన్య, రాజా రామ్, బ్రాహ్మణసేవకు లిరువురు, భిషగ్వరేణ్యులగు ఎస్ట్లిన్ దొరగారు, వారి వృద్ధమాత, యాయన కూఁతురు, జర్నార్డుదొరగారు, ఫాస్టర్‌దొరగారు, మేరీకార్పెంటర్ కన్య, ఆమెతండ్రిగారు చేరియుండిరి. దుఃఖపూరితవదనములతోఁ దమ మరణానంతర మాయనను జేరువిశ్వాసముతో నిశ్శబ్దముగా

వారెల్లరును నడచి వెళ్ళి యంత్యక్రియలఁ గావించిరి. ఒకమాట యైన నుచ్ఛరించుట కెవరికిని నోరాడదాయె.

ఈఘోరవార్త ఖండమంతయు వ్యాపింపఁగనే దేశ దేశములందుఁ బత్రిక లన్నిఁటిలోను రామమోహనుని బ్రశంసిం చుచు దీర్ఘవ్యాసములు ప్రకటింపఁబడియె. లండన్ నగరమున 'రెవరెండ్ ఫాక్సు' దొరగా రీరీతిని నుడివిరి. 'ఇంక నా సుందర వదనారవిందముఁ గాంచము. ఆదివ్యవిగ్రహము కన్నులయె దుటఁ దిరుగాడుచున్నటై యున్నది. భౌతికశరీరము నశించినను ఆమహామహుని యశోదీప్తులాచంద్రార్కముగ వెలుఁగొందును' దూరదేశీయులసహితము నెంతో దుఃఖమున ముంచిన రామ మోహనుని మరణవార్త యాతనిస్వదేశమునమాత్ర మాదిన ములలో సంచలనముఁ గలిగింపలేదు.

1843 వ సం॥రములో, ఆయనకుఁ బ్రాణస్నేహితుఁ డగు 'ద్వారకనాధ్ఠాకూర్' గా రాంగ్లదేశమున కరుదెంచి నపుడు తనస్నేహితుని కళేబర ముంచఁబడినపేటికను బైటకుఁ దీసి బ్రిస్టలుప్రాంతమున అర్నోస్ వేల్ అను సుందరోద్యాన వనమున భూస్థాపితమొనర్చెను. (29-5-1843) మఱుసటి సం॥ర మాప్రదేశముపై దేవళమునుబోలు నొకదివ్యసమాధిని గట్టిం చెను. 1872 వ సం॥రములో నాభవనమును బాగుచేయించి శాశ్వతముగా నుండున ట్లేర్పాటు చేసిరి. నేఁటికిని భారతీయుల

కది పుణ్యతీర్థము; యాత్రాస్థలము. ఆసమాధిపై నింగ్లీషుభాష లో నీక్రిందివాక్యము లోకపాలఱాతిపైఁ జెక్కఁబడియున్నవి.

'ఈతఁడు వంగదేశమందలి రాధానగరమందు 1774 వ సం॥రమున జన్మించి 1833 వ సం॥రము సెప్టెంబరు నెల 27 వ తేదీని బ్రిస్టల్ నగరమున మరణించెను.

ఈ రాతిక్రింద, యద్వితీయుఁడగు నీశ్వరునియెడల నిశ్చల చిత్తమును సత్యభావమును గలిగిన రాజా రామమోహనరాయ్ భహద్దర్ సమాధి చేయఁబడియున్నాఁడు.

ఈతఁడు తన జీవితమునంతను స్వచ్ఛమగు ప్రేమతో భగవంతుని కర్పించెను. మఱియు సహజమగు నద్భుతగ్రహణ శక్తిచే ననేకభాషలయందు సంపూర్ణమగు ప్రజ్ఞ నార్జించి చిన్నతనముననే తనకాలపువా రందఱిలో నొక పండితశ్రేష్ఠుఁ డను విఖ్యాతి నొందెను.

హిందూదేశపు సాంఘిక, విద్యావిషయములను సంస్క రించుట, యాదేశస్థులకుఁ బ్రతినిధిగ నిలిచి పనిచేయుట; ఈశ్వరశక్తియును, మానవస్వాతంత్ర్యమును బ్రకటించు ప్రతి మారాధన, సహగమనాదుల మాన్పుట మొదలుగాఁగల యనేకోత్కృష్టకార్యముల నాతఁ డొనరించియుంటఁ దనదేశ స్థులు మిక్కిలి కృతజ్ఞతాపూర్వకముగా స్మరించుచుందురు. ఈ గోపుర మాతని సంతతివారలచే నా మహాత్మునిగూర్చిన ఘనత కు జ్ఞాపకచిహ్నముగఁ గట్టఁబడినది.'

తనకొఱకుఁ దనజీవితమంతయు ధారవోసిన రామమోహనుని యద్భుతజీవితమును గృహీవలులు, నారీమణులు, మతకర్తలు, సంఘసంస్కర్తలు, పండితశ్రేష్ఠులు, గ్రంథకర్తలు మొదలుగాఁగల భారతీయు లెల్లరు నెప్పుడు కృతజ్ఞతతో గుర్తింతురు కదా? ఈయన శిష్యులను, జ్ఞాపకార్థము శివనాథశాస్త్రిగా రీదేశమునకుఁ దెచ్చియుండిరి.

"నా వినమ్రప్రయత్నము లన్నింటిని లోకము న్యాయదృష్టితోఁ బరిశీలించి కృతజ్ఞతతో స్వీకరించునట్టిదినము తప్పక వచ్చు" నని శ్రీ రాజారామమోహనరాయలవారు 1816 వ సం॥రమందే వ్రాసిన విశ్వాసపూరితములగు గంభీరవాక్యములు చదివి నేఁడు "సత్యము! సత్యము" అని వినయముతో నమస్కరింపనివా రెవరైన నుందురా?

## రామమోహనుని శీలము

రామమోహనుని నామ ముచ్చరింపఁగానే సాధారణముగా సహగమనాదిదురాచారభంజనుఁడో లేక బ్రహ్మసమాజసంస్థాపకుఁడో యని మనస్సునకుఁ దట్టును. కాని సత్యము నన్వేషించినచో నాయన యొక నూతనమతస్థాపకుఁడుగాని, సంఘసంస్కర్తగాని కాఁడు. ఇట్టి సంస్కరణము లన్నిఁటికిని నతీతుఁడైన యొక యపూర్వవ్యక్తి. మతసంస్కర్తలలో రెండు తెగలవా రుందురు. బుద్ధుఁడు, యేసుక్రీస్తు, చైతన్యుఁడు మున్నగు

మహాపురుషు లెల్లరును నొక పరమపవిత్రమైన యాశయము కొఱకు జీవితమంతయు ధారవోసి కొలఁదిమంది శిష్యులను వారి జీవితకాలమందు సంపాదించి సామాన్యమానవుల కందరాని యున్నతస్థితిలోఁ దాము విన్నవానిని లోకమునకు సందేశముగా నందఁజేసి పరమాత్మలో లీన మగుచుండెడివారు. వారి యను చరులుమాత్రము వారి సందేశమును గ్రహించి వారు గతించినపిదపనే వారిమతమును వ్యాప్తిఁ జేయుచుండిరి. కాని మహామ్మదుఁ బోలినప్రవక్త లాశయములలో లీనమైయుండక, సందేశములతోఁ దృప్తినొందక, సామాన్య దైనికప్రపంచమునం దీఁదులాడుచు, దేశాభ్యుదయమునకును, దోడిమానవుల శ్రేయముకొఱకును సకలకష్టముల ననుభవించుచు జీవిత మర్పించి ధన్యులైరి. ఈరెండవ తెగకుఁ జెందినవాఁడు రామమోహనుఁడు. గొప్ప మతసంస్కర్త యగుటయేగాక రామమోహనుఁ డొక యుగపురుషుఁడు. ఆయన మానవకోటియొక్క సేవకు, మానవుని మత, సాంఘిక, నైతిక, విద్యావిషయకార్థికైహికాముష్మికాభివృద్ధికిఁ బాటుపడిన సర్వతోముఖసంస్కర్త. ఒక్కొక్కవిషయమం దసమానమైన ప్రజ్ఞగలవా రనేకులు గలరు. కాని సమస్తజీవితసమస్యలను నిరుపమాన ప్రావీణ్యముతో నెదుర్కొని నవజీవనోదయము గావించువా రరుదుగ నుందురు. ఒక్క మెదడునో, హృదయమునో, ఆత్మనో మాత్రముగాక, ఈశ్వరప్రసాదితమగు ప్రత్యంగమును సమాన

నభివృద్ధి నొందఁజేసికొని వికసించిన సర్వాంగసుందరుఁ డీరామమోహనుఁడు. ఏయొక యవయవమునకో బలమునిచ్చి యితరములను క్షీణింపనిచ్చిన యెట్టివికారాకృతియగునో యూహించుకొనినచో, రామమోహనుని శారీరకసౌందర్యమేగాక యాత్మవికాసముగూడఁ దేటతెల్ల మగును. జాత్యభివృద్ధికి వలసిన సంపూర్ణవిధానములో నొక్కొక్క-తునుక నొకరు గ్రహించి యథాశక్తిని భారతీయకార్యరంగమున యీయన వారసులు పనిచేయుచున్నారు. ఆయన గతించినపిదప నాయన వహించిన మహాభారము నేయొక్క-పురుషుఁడును మోయలేకపోయెను. సురేంద్రనాథబెనర్జీ, దాదాభాయ్‌నౌరోజీ, చంద్రవార్కర్, రెనడీ, విద్యాసాగర్, వీరేశలింగం, మహర్షి దేవేంద్రనాథ ఠాకూర్ మున్నగు శూరులందఱు నాతని వెనువెంటనే రాజకీయరంగములో, విజ్ఞానసీమలో, సాంఘికోద్యమములో, ధర్మక్షేత్రములో, కార్యసాధనము చేసి ధన్యులైరి.

నేఁడుఁగూడఁ గార్యక్షేత్రమున విశేషముగ సాధనచేయుచున్న వీరులందఱును ఏదోయొకవిధముగ నాతని సంతతివారే యని ప్రతివారు నొప్పుకొనక తప్పదు. నూఱేండ్లకు మున్నే యొక లోకోత్తరపురుషుఁడు సాధింపఁ గలిగిన మహాకార్యములన్నియు నాయన తరువాత వచ్చినవారలు నేటికిఁగూడ ననేకులు పంచుకొనవలసివచ్చుచున్నదని తెలిసికొనినపుడు రామమోహనుని సమగ్రప్రతిభ, జాతిజీవన మంత సంపూర్ణమైన

దని వేటతెల్ల మగుచున్నది. కావుననే యాయనను నవభారత పితామహుఁడని చెప్పుకొనుచున్నారు. 'విశ్వకర్మయగుపరమేశ్వరుఁడు సామాన్యపదార్థములను సృష్టించుచు మధ్యమున నెన్నఁడెన్నఁడో యొకమహాపర్వతమునో మహానదినో కల్పించుచుండు ననియు, నావిధముగనే మానవులలోఁ గూడ నొకానొక లోకోత్తరు నుద్భవింపఁజేయు ననియు, రామమోహనుఁ డట్టి పురుషోత్తముఁ డనియుఁ' దత్వవేత్తయగు బ్రజేంద్రనాథ్ సీల్ గారు వచించుచున్నారు.

అచంచలమైన విశ్వాసము, నిశ్చలమైన గాఢభక్తి యుండిననేదక్క తానొనర్చిన కార్యము లన్నియు రామమోహనుఁ డొనర్చియుండుట యసాధ్యము. అతని గుణరత్నములలోకెల్ల యుజ్వలమైన దాతని బ్రార్థనాశీలము. చిన్నతనమందుఁ బ్రతి యుదయము భాగవతపారాయణము చేయుచుండెడివాఁడఁట. ప్రార్థనపూర్వకముగాఁ గాక యేకార్యము నాతఁడు చేయువాఁడు కాఁడు. తన దినచర్య బ్రతియుదయ ముపాసనతోఁ బ్రారంభించెడువాఁడని ఆయన వంటవాఁడు చెప్పియుండెను. లండన్ నగరవీథులలోఁగూడ నప్పుడప్పు డిట్టె యాఁగి కండ్లు మూసికొని యీశ్వరధ్యానములో నిమగ్నుఁడై బొటబొటఁ గన్నీరుఁ గార్చెడువాఁడఁట. ప్రాణేశ్వరునిసన్నిధికిఁ బోవువానివలెఁ బ్రార్థనామందిరమునకుఁ బరిశుభ్రవస్త్రముల ధరించి పాదచారియై పోవుచుండెడివాఁడఁట. సమాజమునకుఁ బోయినతోడనే యాయన

యొక చిన్న వెదురు పేముతోఁ జేయఁబడిన కుర్చీపీట పైఁగూర్చుండు వాఁడు. ఆయనకుఁ బ్రీతికరమగు కీర్తనలలో నొకటి "విగత విశేషమ్" అనుపదములతోఁ బ్రారంభమయ్యెడిది. 'విష్ణు' అను యువకుఁ డది చక్కఁగాఁ బాడుచుండువాఁడఁట. ఈశ్వరోపాసనకుఁ బ్రార్థనాలయమునకుఁ బోవుట పరమేశ్వరుని దర్బారునకేగుటవంటి దని యాతని భావము గాన బాహ్యాంతరశుచితో, నమ్రతతో, సంతోషముతోఁ బోవలెనని యాయన యభిప్రాయము. మన మొక రాజు దర్బారున కెట్లు వెడలెదమో రాజాధిరాజగు నీశ్వరుని యుపాసనకుఁ గూడ మంచిదుస్తులతో వెళ్ళవలెనని య నెడివాఁడు. ఇదికూడ యాయన కభిరుచియున్న మహమ్మదీయసంప్రదాయములో నొకటి. ద్వారకనాథ్ఠాకూర్ గారుమాత్రము 'కచేరీ' నుండి వచ్చి మరల వస్త్రముల ధరించు టెందుల కనియు, నీశ్వరోపాసన కతినిరాడంబరముగ నే పోవలయుననియుఁ జెప్పెడివారు. ఆయన సాధారణపుధోవతి, ఉత్తరీయము ధరించి పోవుచుండెడివాఁడఁట. రామమోహనున కిది యిష్టములేక ఆనందప్రసాద్ బాబు అను మిత్రునితో ననుచు, దూరమునుండి యాయనను హేళనదృష్టితోఁ జూచుచుండెడి వాఁడఁట. అప్పు డామిత్రుఁడు చనవుతో ముఖాముఖిని యాయనతోఁ జెప్ప ధైర్యము లేసియెడల నీ కెందుల కీబాధ య నెడివాఁడఁట. కాని తుద కాతఁడే ద్వారకనాథున కీసంగతి నెఱింగించెడువాఁడు. ఈ విషయములలో వినకపోయి

నను రామమోహనునియం దుండెడి యపారగౌరవముచేఁ దాను జపమాచరించుసమయమందుఁగూడ రామమోహనుఁడు వచ్చినచో వెంటనే బైటికి ద్వారకనాథుఁడు వచ్చువాడు. గాన సభకుఁ బోయి 'నాయనా! ఈశ్వరునిగూర్చిన కృతులు' కీర్తనములు ఏవైన వినుపింపవా?' యని గాయకునిఁ గోరెడు వాఁడు. దీర్ఘకాయుఁడగు రామమోహనుఁడు గంటకుఁ బైఁగా స్నానమొనర్చువాఁడఁట. మంచినూనె శరీరమునకంతయుఁ బట్టించుకొని బాలురకు భీతావహుఁడై కనుపట్టువాఁడు. స్నానమొనరించునపుడుసహితము ప్రార్థనశ్లోకములను బఠించుచుండెడి వాఁడఁట. ఒకమాఱు రామప్రసాదుని 'అజరామశోక; జగదాలోకమ్" అను తనకుఁ బ్రియమగు సంస్కృతగీతములఁ బాడ మనెనఁట. బాలుఁడు భయముతో మంచముక్రిందకుఁ బోయి చక్కఁగాఁ బాడి వినుపించెనని దేవేంద్రనాథుఁడు వ్రాసెను. తాను స్వయముగ నెనో్న యమూల్యమగు ప్రార్థనగీతములను వ్రాయుచుండువాఁడఁట. నేఁటికి నవి భక్తిరసపూరితములై యెంత కఠినశిలాహృదయమునైనఁ గరఁగించునట్టివిగా నలరారు చున్నవని 'పండిత రామగతిన్యాయరత్న' యను చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు. ఎచ్చటికిఁ బోయిన నక్కడనే యొకప్రార్థన కూటము స్థాపింపఁ బ్రయత్నించెడువాఁడు. నిత్యకుటుంబ ప్రార్థనల కెంతో యాశించెడువాఁడు. కాని స్వదేశమునకుఁ దిరిగి వచ్చి యాకృషి సల్పుట కాతఁడు జీవించియుండలేదు. మత

మును దెలిసికొనుటయందు సంస్కరించుటయందును- మతవిష యకగ్రంథములు పఠించుటయం దాయనకున్న యాధిక్యము కంటె సద్ధానిని స్వయముగ ననుభవించుటయందే, మతజీవితము ననుసరించుటయందే యాయన గొప్పతనము గోచరమగును. ప్రార్థనయే యాయన పరమావధి; అమూల్యమగు శరణము.

'హాఫీజు' 'సాదీ' మున్నగుభక్తవరేణ్యుల కవిత్వమాధు ర్యముఁ గ్రోలునపు డాయనసంతోషము చెప్ప నలవికాదు. జ్ఞాన, భక్తి, కర్మయోగములు మూఁడును సమముగా మిళి తమై మూర్తీభవించిన పుణ్యమూర్తి. మతమే యాయన కార్య ములన్నిఁటికి మూలము. మతమే యాయన జీవితములో నన్ని వైపులఁ బ్రవహించి- యనేకస్వరూపములఁ దాల్చి మానవసే వలో లీనమయ్యెను.

కలకత్తావీధులలో విగ్రహములయూరేగింపుఁ జూచి 'నన్నుఁ గన్న భారతదేశమం దెప్పు డీప్రతిమారాధన పోయి, యార్యఋషుల మానసికోపాసన, ఏకేశ్వరారాధనము వచ్చునా?' యని జలజలఁ గన్నీరు కార్చెడువాఁడు. చిన్నతనము నుండియు విగ్రహారాధనయం దాతని కెంతమాత్రమును విశ్వా సము లేకుండెను. పరిశుద్ధాస్తికమతమును బ్రబోధించు నద్వితీయ పరబ్రహ్మమును మానసికముగా నారాధించుటయే యాతనికిఁ బరమావధి యగుటంజేసి యొకవైపున హిందువులకు, మఱి యొకవైపున నేసుక్రీస్తుని దేవునిపుత్త్రునిగా నమ్ము క్రైస్తవులకుఁ గూడ నాతఁడు విరోధి యయ్యెను.

రామమోహనుని యుద్యానవనమున కొకనాఁ డొకబ్రాహ్మణుఁడు వచ్చి పూజకొఱకుఁ బుష్పములు కోసికొనుచుండెను. ఒకచెట్టుకొమ్మకుఁ దగిలించిన యాతని శాలువను రామమోహనుఁడు తీయించి దాచియుంచెను. శాలువకొఱకు వెదకుచు నాఛాందసుఁడు రామమోహనుని దూరసాఁగెను. 'ఎందుల కీయాగ్రహ' మని రామమోహనుఁడు ప్రశ్నింప 'నీతోఁటకు వచ్చినందులకు నాకు వచ్చినలాభ మిది' యని యాబ్రాహ్మణుఁడు పలికెను. 'ఎవరిది శాలువ' యని రామమోహనుఁడు ప్రశ్నింప, 'నాదే' యని బ్రాహ్మణుఁ డనెను. 'సరే! మీశాలువ మీకిచ్చివేసినచో సంతసించెదరా' యని తిరిగి యాతఁ డడుగ 'నాది నాకిచ్చినపుడు గొప్ప సంతోష మేమి?' యని బ్రాహ్మణుఁడు వచించెను. 'ఐతే మీ కాపుష్పము లెందు' కని రామమోహనుఁ డనెను. 'దేవుని పూజకొఱ' కని బ్రాహ్మణుఁ డనెను. 'ఎవరి వీపూవు' లని తిరుగ రామమోహనుఁడు ప్రశ్నింపఁగా, బ్రాహ్మణుఁడు 'ఈశ్వరుని వని వేదాంతివగు నీకుఁ దెలియదా?' యనెను. రామమోహనుఁ డప్పుడు 'మీ శాలువ మీకిచ్చిన సంతోషింపని మీ రతనిపూవు లాతనికే యిచ్చిన, దేవుఁ డెట్లు సంతసించు ననుకొనెదరు?' అని చిఱునవ్వుతో ననెను, ఆబ్రాహ్మణుఁడు చిన్నబుచ్చుకొని వెడలిపోయెను కాని యామాటలయందలి సత్యముమాత్రము గ్రహింపక పోలేదు.

ఒకసారి బాలుఁడగు దేవేంద్రనాథుఁడు తన తాతగారి యింట జరుగు దుర్గాపూజకు రామమోహనుని రమ్మని పిలువఁ

బోయెను. 'నన్నా ? పూజకుఁ బిలిచెదవు ?' అని సహజ గాంభీర్యముతో ననెను. బాల్యమున నాపదముల కర్థము తెలియకపోయినను, అప్పుడు వినిన యీమాట లోక మహామంత్రముగ గురువాక్యమువలె జీవితాంతమువఱకును దనకు వినఁబడుచునే యుండెనని మహర్షి దేవేంద్రనాథుఁడు వ్రాసియుండెను. ప్రతిమారాధనకంటె నా దినములలోఁ బెంపొందుచుండిన నాస్తికవాద మీతని కెక్కువ బాధను గలుగఁజేయుచుండెను. ఒకసారి యీతనిశిష్యులలో నొకఁడు సంభాషణవశమున నొక నాస్తికునిగూర్చి యాంగ్లేయభాషలోఁ జెప్పుచు 'మొదట నీతఁడు (థీస్టు) ఆస్తికుఁడుగా నుండెను గాని యిప్పుడు (ఎథీస్టు) నాస్తికుఁడుగా నున్నాఁ'డనెను. ఈమాటకు రామమోహనుఁడు చిఱునవ్వునవ్వి యింకఁ గొన్ని దినముల కాతఁడు (బీస్టు) పశువుగా మాఱునని శబ్దాలంకారముతోఁ బ్రత్యుత్తర మిచ్చెను.

వసుధయంతయు నొక్కకుటుంబమే యను సజీవాదర్శముతో జీవితము నడుపుకొనుచున్న యుదారచరితుఁడు గనుక నాంగ్లదేశమునఁ బాద మిడినంతనే యాశుధారతో 'స్వదేశ మేమి? విదేశమేమి? తూర్పుపడమర లేమి? నాతండ్రీ! నేనెచ్చట నున్నను నీ వున్నా'వని యానందపారవశ్యముతో నీశ్వరగానము జేసెను. 'ఏజాతియైన నేమి! మేల్గాంచుఁడు; ఇదే మీవిశ్వవిభు నాలోకించి యానందపరవశు లగుఁడీ!' యను విశ్వజనీనధర్మమును బ్రబోధించిన ధన్యమూర్తి రాజారామమోహనరాయ

లని యొకపాశ్చాత్యకవయిత్రి యాతని మరణానంతరమునఁ బాడియుండెను. మరణసమయమందుఁగూడ "ఓమ్" యను మంత్రోచ్చారణముతోనే యతఁడు చనిపోయెను గదా!

రామమోహనుని లక్షణములలోనెల్ల నగ్రగణ్యమైనది యాతని స్వాతంత్ర్యేచ్ఛ. ఆతఁడొనర్చిన కార్యము లన్నిఁటికిని మూలసాధన మదియే. స్వాతంత్ర్యప్రియుఁడు గనుకనే వినిన మాటలతోను, జూచిన యాచారములతోను దృప్తినొందక సత్యాన్వేషణకొఱకు సర్వమతగ్రంథములను స్వయముగఁ జదివి సారములను గ్రహించి గొప్పదూరదృష్టితో నొకవిశ్వజనీన మగు మతమును నెలకొల్పెను. 'సోదరా! మనది విశ్వజనీన మతము సుమా!' యని శరీరము పులకింప వచించుచుండెను. ప్రార్థన మానవుని జన్మహక్కని యాయన జీవితసందేశము. మతమును బ్రతిగృహస్థునియొక్క ద్వారముకడకుఁ దెచ్చినది రామమోహనుఁడు. స్వజాతీయాభివృద్ధి యాయన కెంతవాంఛనీయమో సర్వమానవజాత్యున్నతియు నాయన కంత ప్రియమైనదే. ఆయనదేశభక్తి సంకుచితమైనది కాదు.

నిజమగు భక్తుఁడుకనుకనే విశ్వమానవప్రేమ యాయనలో నాఁటుకొనియుండె. ఫ్రెంచివిప్లవకారుల విజయవార్తలెంతో యాతురతతోఁ జదివి సంతసించెడివాఁడు. తాను సముద్రముపైఁ బయనము చేయుచున్నపుడు, ఆఫ్రికాదక్షిణతీరమున రెండు ఫరాసుయోడలందలి స్వాతంత్ర్యపతాకములను గాంచి

తా సంతసముందే పైనుండి పడి కుంటుచున్నను, వాస్పైకి తన్ను గొంపోవుటకు నూరకుండ లేదు. ఆపతాకములను జూచి యపరిమితానందభరితుఁడై యావేశముతో జయధ్వాన మొనర్చెను. అమెరికాయందలి స్పెయిను దేశస్థులు మాతృదేశముపైఁ దిరుగుబా టొనర్చి జయ మొంద రామమోహనుఁడు కలకత్తాలోఁ దనస్నేహితులకు గొప్ప విందు చేసెను. ఈయుట్టహాస మంతయు నేమని ప్రశ్నింప "నాసోదరమానవుల సంతోషమునను, దుఃఖమునను బాల్గొనకుండ నే నెట్లుండఁగల" ననెను. ఇటలీయందలి నేపుల్సు దేశస్థులకు లభించిన కొలఁది స్వాతంత్ర్యము, దౌర్జన్యముగా మరలఁ గైకొనఁబడెనను ప్రజల యపజయవార్తకు వగచి, తా నానాఁటి కార్యములన్నియు విడనాడి, సాయంకాలము తాను 'బకింగుహామ్' దొరగారి గృహమునకు రావీలులేదని వ్రాసి, మతిపోయినవానివలె విచారమున మునిఁగియుండెను.

"స్వాతంత్ర్యేచ్ఛకు శత్రువులును, నిరంకుశత్వమునకు మిత్రులు నెన్నఁడును జయ మొందియుండలేదు. కడ కెన్నఁటికిని జయ మొందఁజాల" రని వ్రాసెను. ఆంగ్లదేశమున నున్నప్పుడు 'సంస్కరణశాసనము గెలువనిచో నీ దేశమును వీడి యమెరికాకుఁ బోయి నివసించెద' ననియుండెనుగదా! 'ఐర్లాండుప్రజల యసంతృప్తికిఁ గారణము' లను వ్యాసమున దూరదర్శియగు రామమోహనుని వాక్యములందలి యాథార్థ్యమే యొక శతాబ్ద

మునిదప నమాత్యశేఖరుఁడగు "గ్లేడ్స్టన్" ఐర్లండుప్రభుత్వ మున కొసంగిన సంస్కరణములలో సూచించియుండెను. కేథలిక్ కక్షకు జరిగెడి యన్యాయమునకు వగచి మహమ్మదీయ భక్తవరేణ్యుండును, కవిపుంగవుఁడును నగు "సాది" వ్రాసిన మహావాక్యముల నిట్లు ప్రచురించెను. "ఓ రాజకీయవేత్తలారా! రాజధనముఁ బ్రజల సౌఖ్యముకొఱకు వినియోగింపుఁడు. అప్పుడే యావజ్జీవము, ప్రజలు ప్రభువిశ్వాసపరాయణులై యుందురు." 'ఏజాతి లాభనష్టములందైనను, కష్టసుఖములందైనను యితరజాతులకుఁగూడ సమానమైన హక్కు గలదు' అని లవెలీకవి వచించిన మహోన్నతభావమే రామమోహనుఁడు తన జీవితములోఁ బ్రదర్శించెను.

ఎచ్చటనున్నను స్వదేశస్థుల మఱచెడువాఁడుకాఁడు. ఒకనాఁడు క్రైస్తవదేవాలయమున నీతఁడు గన్నీరుకార్చుట మిత్రులు చూచి "ఏందు" కని ప్రశ్నింప దూరముననున్న తనదేశస్థుల దుస్థితిని, పేదఱికమును దలఁచి దుఃఖించుచుండినట్లు ప్రత్యుత్తరమిచ్చెను. నూఱుసంవత్సరములక్రిందటనే యామహామహుఁడు స్వదేశస్వాతంత్ర్యోత్సవమున కువ్విళ్ళూరి, మాతృదేశసేవఁ జేయుచు మరణించెను. హిందూదేశమున నాంగ్లేయసంపర్కము భగవదాదేశమని సంతోషించినవాఁడయ్యు, రాజకీయముగ హిందూదేశ మెప్పటికిని సామంతరాజ్యముగ నుండవలెనని యాతఁడు భావింపలేదు. తనస్వాతంత్ర్యమును తిరిగి సంపాదించుకొనువఱకు నాంగ్లేయుల తరిఫీదు హిందూదేశమున

కవసర మనిమాత్రమే యాతనితలంపు. సుమా రర్ధశతాబ్దము మాత్ర మాంగ్లేయులతో సంపర్కమున్నచోఁ దనమాతృభూమి కూడ యితర దేశములతో పాటు స్వరాజ్యము సంపాదింపఁగలు గునని యూహించియుండెను. ఆనాఁడే యాశ్చర్యకరమగు దూర దృష్టితో నీవాక్యములు వ్రాసియుండెను. "ఒక నూఱుసంవ త్సరములపాటు పాశ్చాత్యనాగరికతాసంపర్క ముండినచో జాతీ యలక్షణమంతయు మాఱి 'భారతీయు లన్యాయమున కొడం బడక యాత్మగౌరవముఁ గాపాడుకొనకుందురా? నా దేశస్థితి యిర్లాండుతోఁ బోల్పఁదగదు. ఒక్క క్షణకాలములో నిర్లాండున కాంగ్ల నౌకాదళము వెళ్లి తిరుగుబాట్ల నణఁచివేయవచ్చును. కాని హిందూదేశమునకే యట్టి జ్ఞానోదయము, స్వశక్తి, సమ కూఱినయెడల, దూరముననుండియే సాటిలేనిధనబలముచేతను, అంగబలముచేతను, ఆంగ్లసామ్రాజ్యమునకొక లాభదాయి యగు మిత్రరాజ్యముగనైన నుండవచ్చును; లేనిచో నిర్భయ మగు శత్రువుగనైనను బరిణమింపవచ్చును.'

రైతుల కెక్కువపన్ను విధించుట యక్రమమనియుఁ బరి పాలకులకే శ్రేయోభంగమనియు వ్రాయుచు నాఁడే వ్రాసిన యీ మహావాక్యముల నుదాహరించెను. "మీప్రజలయెడ స్నేహభావముతో నుండుఁడు. శత్రువులదాడికి వెఱఁగొందకుఁడు. ఏలయన న్యాయమార్గము ననుసరించినప్రభువునకాతని ప్రజలే యొక గొప్పసైనికబలము."

తన దేశస్థులు క్రమాభివృద్ధిఁ గాంచుటలో నేయితర నాగరికజాతిని దీసిపోరని యూతనిదృఢాభిప్రాయము. ఆసియా ఖండవాస్తవ్యుల బలహీనతనుగుఱించి యొకక్రైస్తవుఁడు తూల నాడినపుడు రామమోహనుఁడు 'జీసస్ మున్నగు మహాప్రవక్త లందఱును ఆసియావారలే' యని ఆతనికి జ్ఞప్తిచేసెను. నవీన పరిశ్రమలం దాంగ్లేయులు ముందంజ వేయుటంబట్టి వారలకు మనము కృతజ్ఞతఁ దెలుపవలసినవారమైనను, శాస్త్రములం దును, వాఙ్మయమందును, మతమందును అనాదినుండియుఁ బ్రాగ్దేశములవారికే యాధిక్యము కలదనియు, అట్టివిషయము లలో ఆసియావారు సిగ్గుతోఁ దల వంచ నవసరము లేదనియు నతఁడు వక్కాణించెను. ఇవ్విధమున నవభారతభాగ్యోదయము నకు సక్రమమార్గముల నన్నివైపుల రామమోహనుఁడే సూచించియుండెను.

మతవిషయములోఁగూడ తన స్వాతంత్ర్యేచ్ఛయే పర మతములందలి శాశ్వతసత్యములనుగూడ కనుఁగొనఁజేసెను. తాను మరణించిన పిదపఁ దనవిషయమై మహమ్మదీయులును, క్రైస్తవులును, వేదాంతులును, దమతమవానిగా నెంతురని చెప్పి యుండిన జోస్యమక్షరాల నిజమయ్యెను. ఈయనను హిందువులు 'వేదాంతి' యనియుఁ, క్రైస్తవులు 'ఫాదరీ' యనియు, మహమ్మ దీయులు 'మౌల్వీ' యనియు ననుకొనుచుండిరి. దీనికిఁ గారణ మాతని సామరస్యవిధానమే యని చెప్పియుండెను. తనలోఁగల స్వాతంత్ర్యేచ్ఛవలననే ఆతఁ డితరులలోఁగూడ నా వాంఛను

గౌరవింపఁగలైను. అతని సహన, సామరస్యభావములకు హేతు వదియే.

ఆయన సాంఘికసేవ యంతయు స్వాతంత్ర్యేచ్ఛపై నాధారపడియున్నది. సహగమనము మాన్పెను. అతిబాల్యవివాహముల రూపుమాపుటకును, స్త్రీపునర్వివాహములకుఁ జేయూఁత నొసంగుటకును సమకట్టి మరణించెను. సంబంధకాముదిలోఁ గ్రైస్తవులవలె హిందూవితంతువుల సహాయార్థ మొక నిధి నేర్పాటుచేయ సూచించెను. ఈ యభీష్టములఁగూర్చి ఆంగ్ల దేశమునుండి స్నేహితుల కుత్తరములు వ్రాసియుండెను. తన మనుమరాలికిఁ బదునాఱేండ్ల వయస్సు వచ్చినపిమ్మట వివాహము చేసెనఁట. స్త్రీల అర్థము, విద్య మొదలగువాని హక్కులకు యావజ్జీవము పోరాడెను. హిందూసంఘముననున్న వర్ణభేద ములు నిరసించుచు నుత్తరములు వ్రాసెను. మృత్యుంజయాచార్యుఁడు రచించిన 'వజ్రసూచి' యను గ్రంథమందలి ప్రథమ ప్రకరణమును వంగభాషలోని కనువదించి జాతిభేదమును రూపుమాపుటకుఁ దోడ్పడెను. ఈ దురాచారమే మన దేశస్థులలో నైకమత్యము చెడఁగొట్టినదని వ్రాసెను. శైవుల వివాహ పద్ధతిలో వయస్సు, కులము, జాతి పాటింపరని ప్రశంసించెను. రామమోహనుఁ డేది తలపెట్టినను తన జీవితమందు స్వేచ్ఛాసక్తియే ప్రధానసూత్ర మగుటకు సందియములేదు. హిందూదేశమున నాంగ్లవిద్య ప్రవేశపెట్టుటలోఁగూడ స్వదేశస్థుల స్వాతంత్ర్యమునే యాతఁ డపేక్షించెను. దేశకాలపరిస్థితులను

బట్టి యావిధానము లేనిదే భారతీయులు తెల్లవారలతో సాటి రారని యాతని నమ్మకము.

స్వాతంత్ర్యప్రియుఁడగు రామమోహనుఁడు వ్యక్తిగతముగఁ దన యాత్మగౌరవము నెట్లు రక్షించుకొనునది తెలిసికొనుట కనేక నిదర్శనములు గలవు. డాక్టర్ మిడిల్‌టన్ అను క్రైస్తవప్రచారకుఁడు రామమోహనునితో "మామత మవలంబించినయెడల నధికారము, గౌరవము, ధనము, సంపాదింపఁ గల" రని చెప్ప, నామాటలు విని కోపోద్దీపితుఁడై 'కాసున కాసించి నాయాత్మగౌరవమును విడనాడువాఁడను గా' నని చెప్పి యంతటితో నాయనస్నేహము మానెను.

తనకు నుద్యోగము నిచ్చిన డిగ్బీదొరగారి నాతఁడు కోరినషరతులలో మరల ఆత్మగౌరవమే వ్యక్త మగుచున్నది. "గవర్నర్ జనరల్ బెంటిక్ ప్రభువుగారు మిమ్ములఁ జూడఁ గోరుచున్నా" రని రాజప్రతినిధి యంగరక్షకుఁడు వచ్చి రామమోహనునికి విన్నవింప నాతఁడు "అయ్యా! నేను లౌకికవిషయములను విడిచి యేదో ధర్మకృషితోఁ గాలము గడపుచున్నాను. ప్రభువుగారియొద్దకు నేను వచ్చుటకు వీలులే" దని మనవిచేసి "మన్నింపుఁ" డని కబురంపెను. బెంటిక్ప్రభు వామాటలువిని యాతురతతో "నీవేమని చెప్పితి" వని తనయంగరక్షకు నడిగెను. ఆతఁడు జరిగినది విన్నవింప "మిమ్ములను దయచేయుఁడని విలియంబెంటిక్ వేఁడుచున్నాఁ" డని స్నేహ

సూచకముగా మరల కబురంప రామమోహనుఁడు ఉపర్యా యము వెంటనే వెడలెను.

రామమోహానునియం దుండెడు మఱియొక ప్రముఖ లక్షణ మేమనఁ దనయంతరాత్మ ప్రబోధమున నమ్మినసత్యముల నెన్నికష్టములకైన నోర్చి యాచరణలోఁ బెట్టుట. ఈసత్య సంధతయే లోకములోనున్న యుత్తమోత్తమపురుషులలో నొకనిఁగా నాయనను జేసెను. పదునాలేండ్ల బాలుఁ డేమి? విగ్రహారాధనవిషయమై తల్లిదండ్రులతో నభిప్రాయభేద ములు కల్గి, యిల్లు విడిచి యా దినములలో దేశాటనము చేయుట యేమి? ఆయన జీవితచరిత్రలో నీ యొక్క విషయమే తీసికొన్నను, ఈయన యసాధారణవ్యక్తి యని యంగీకరిం పక తప్పదు. సహగమనదురాచారమును మాన్పుట కొనర్చిన కృషియందును, ప్రతిమతకక్షకు విరోధియైనను తాను విశ్వ సించిన శాశ్వతసత్యములను బ్రచారము చేయుటయందును, బ్రహ్మసమాజస్థాపనమందును నీ యుత్కృష్టలక్షణమే ప్రతి ఫలించుచున్నది.

ఈసత్యసంధతివలననే యపారమగు కార్యదీక్షగూడ నాయనయందుఁ గాననగును. బాల్యము గడచిపోయినను, దన కార్యక్రమమున కవసరమని తోఁచిన యాంగ్లభాషను దీక్షతో నభ్యసించుటయేగాక యందుఁ బ్రవీణుఁ డయ్యెను. వయస్సు ముదిరినపిదప గ్రీక్ హీబ్రూ భాషలు నేర్చుకొని, యద్భుత మగు గ్రహణశక్తిని జూపెట్టెను. ఓడలోఁ బోవునపుడుగూడఁ

జమువుట మానక సంస్కృతము, హీబ్రూ గ్రంథములు పఠించు చుండెడివాఁడఁట. బ్రహ్మమందిరమునకుఁ బోయెడిరోజులలో శత్రువు లెప్పటికప్పు డీయనప్రాణముఁ దీయుటకు వేచియుం డుటవలనఁ జేతియందు ఖడ్గమో, తుపాకియో యుంచుకొని పోవలసివచ్చుచుండెనఁట. అశ్వశకటారూఢుఁడై పోవుసమయ మందుఁగూడ నితరులు రాళ్ళు ఱువ్వుటవలనను దలుపులు మూసికొని పోవలసివచ్చుచుండెనఁట. మనోధైర్యమువలనను, సంపూర్ణమైన యీశ్వరవిశ్వాసమువలనను నాతఁడు తలపెట్టిన కార్యములన్నియు దీక్షతోఁ జేయుచుండెను. మతచర్చలలోఁ గ్రైస్తవు లాయనప్రత్యుత్తరములు ప్రకటింప నొల్లనందున నా దినములలో మఱియొక ముద్రణాలయము లేకుండుటంజేసి రామమోహనుఁడు వెంటనే వ్యయప్రయాసముల నోర్చి సొంత ముద్రణాలయమును నెలకొల్పి తానే తత్సంబంధమగు పనులు నేర్చుకొని, యితరబాలురకు నేర్పి, స్వయముగాఁ బ్రచురణలను గావించెను.

ఎంతపట్టుదలయో అంత మార్దవము, సౌశీల్యముగూడ నాయనహృదయమందు గోచరించును. ఆముఖ్యవిషయములం దెల్లప్పుడు నాతఁ డెంతో యడఁకువయు, సౌజన్యమును జూపు చుండెడివాఁడు. ఇతరులను నొప్పింపకుండుటకు బహు జాగ రూకతతోఁ బ్రయత్నించుచుండువాఁడు. వివిధజాతులతో, వివిధమతస్థులతో, నీసుగుణమువలననే యెంతో స్నేహగౌర వములతో మెలఁగుచుండెడివాఁడు.

తోటిమానవులలో నెల్ల నెంతటిమేటియో, పిల్లలలో నట్టిపిల్లవాఁడుగా నుండెడివాఁడు. ఈయనకొమరులు రామప్రసాద్, దేవేంద్రనాథుఁడు చిన్నతనమం దీయన స్థాపించిన పాఠశాలయందే సహాధ్యాయులుగ నుండెడివారు. దేవేంద్రనాథుఁడు ప్రతి శనివారము తన స్నేహితునింటికిఁ బోవుచుండెడివాఁడఁట. ఆతఁడన్న రామమోహనున కత్యంతప్రీతి. దేవేంద్రనాథుఁ డెట్టిసమయములందయినను నతిచనవుగా నాయనవద్దకుఁ బోవుచుండెడివాఁడఁట. భోజనము సేయువేళ నొకదినమున దేవేంద్రనాథుఁడు తొంగి చూచుటఁ గాంచి 'చూచితివా నే నిక్కడ రొట్టి, తేనె మాత్రము దినుచుండఁ బ్రజలు నేను గోమాంసభక్షకుఁడ ననుకొనుచుందు' రనెనఁట. రామమోహనుని యుద్యానవనమం దొకవృక్షమున నుయ్యాలఁ గట్టియుండెడిదఁట. అందు రామప్రసాద్, దేవేంద్రనాథు లెప్పుడు నూఁగుచుండువారఁట. రామమోహనుఁడుకూడ వారితోఁ జేరి కొంత తడవు దేవేంద్రనాథుని నూఁపి పిదపఁ దానే యుయ్యాల నెక్కి యాబాలుని నూఁపుమనుచుండెడివాఁడఁట. ఇదిచూచి మిత్రులదేమని ప్రశ్నించినచో 'రానున్న సముద్రయానమునందుఁ దరంగములమధ్య నోడలో నూఁగుటకు నిప్పటినుండియు నలవాటుపడుచున్నా'నని హాస్యముచేసెడివాఁడు. దత్తపుత్త్రుఁడైన రాజారామ్ చిన్నతనమందుఁ జాల తుంటరి. ఆతఁడు తండ్రికడఁ జాల నల్లరులఁ జేయుచుండెడివాఁడు. ఎంతవిసిగించిన నాయనకుఁ గోపము రాదు. అటువంటి నవనీతహృదయమును గాఁ

చుట దుర్లభము. ఒక మట్టమధ్యాహ్నమునఁ దనమంచముపై వెల్లకిలఁ బండుకొని గాఢనిద్రలో నుండెనఁట. రాజారామ్ 'నీకొకతమాషా చూపెదరె' మ్మని దేవేంద్రనాథునిఁ బిలిచి, తాను తండ్రిపనుపుదగ్గఱకుఁ బోయి హఠాత్తుగా నాయన మీఁద కొక్కుదుముకు దుమికి వక్షముపైఁ బడెను. రామమోహనుఁ డిసుమంతయుఁ జలింపక 'రాజారామ్! రాజారామ్' అని కౌఁగిలించుకొనెనఁట. రాజారామ్ ఆంగ్లదేశమునఁ జదువుకొను చున్నపుడు రామమోహనుఁడు బ్రిస్టల్ నగరమునకుఁ బోవుచు, నాతఁ డింట లేకున్నను, బిలువనంపి ముద్దాడకయే వేళ మించు చున్నను వెళ్ళలేదఁట. ఈ నాంగ్లదేశమునకుఁ బోవునపుడు కొమరుఁడు రామప్రసాద్, వెక్కివెక్కియేడువఁగ 'నాయనా! నీవు పురుషుఁడవు కావా? కన్నీరు గార్చవచ్చునా' యని యూఱడించి ధైర్యము చెప్పెనఁట. ఈవాక్యములే నిస్పృహతో నున్న నేఁటి భారతీయులుసైత మాయన యంత్యసందేశముగా గ్రహించి కార్యశూరులు కానోపుపిల్లల నెంతో జాగరూక తతోఁ జూచువాఁడు. దేవేంద్రనాథుఁడు తోఁటలో నెండవేళఁ బండ్లుకోసికొనుటకుఁ బోవుచుండుటఁ జూచినపుడెల్ల 'నాయనా! నీ విటురా! నీకు వలయునన్ని ఫలములు నే నిచ్చెదను. ఎండలో నెందులకుఁ బోయెదవు?' అని తోఁటమాలిచే ఫలములఁ దెప్పించి తనవితీఱ బాలునకుఁ బెట్టుచుండువాఁడఁట. రామమోహనుఁ డవుకుగానున్న యొకశకటములోఁ బోవుచుండెడివాఁడు. ఒకొక్కప్పుడు గుఱ్ఱము పాఱిపోవుటయు, బండిచక్రములు విడి

పోవుటయుఁ దటస్థించుచుండెను. చుట్టుపట్లవారందఱు నీచోద్యము జూచుచుండ నా శకటారూఢుఁడు బండినుండి బయటకు రావలసివచ్చుచుండెను. ఎంతమహామహుఁడో యంత నిరాడంబర జీవి, వినయభూషణుఁడు, రామమోహనుఁడు. ఈయనయమృత హృదయమును బ్రదర్శించు మఱియొక చిన్న గాథ కలదు. డేవిసన్ గారి కుమారుని కీయననామం బిడిరి. డేవిసన్ దొరసానిగా రిట్లు వ్రాసియుండిరి. "ఆయన తఱచు పురిటిగదిలోనికి వచ్చుచుండు వాఁడు. ఎట్టి నిగర్వము! ఎంత వినయము! ఆయన నాయెడఁ జూపు గౌరవాతిశయములకు నేను సిగ్గుపడుచుండెడిదానను. నేను సామ్రాజ్యాధికారిణినైనను చక్రవర్తినినైనను అంతకంటె నెక్కువగౌరవ మాయన నాయెడలఁ జూపించియుండఁడు."

కాలెట్ దొరసాని వ్రాసిన వచనము లివి: 'మాతృదేవికి నేవిధమైన కలఁతయుఁగలుగకుండఁ జిన్న బిడ్డను మనసారఁ జూచుటకుఁ దొందరపడు రామమోహనుని యుదారమనోహరమూర్తిని బురిటిగదిలోని రాజవిగ్రహమును భావికాలములోఁ దరతరములవా రాతని యనుచరులు తమపూలపురుషునిగూర్చిన దివ్యస్మృతులలో మధురతమముగా దాచికొని మననముఁ జేసికొనఁగలరు. మాతాశిశువులయెడ నొకవ్యక్తి చూపు గౌరవమే యాతని శీలమునకు ముఖ్యనిదర్శనము. ధర్మజీవితమున కీసూత్రము మఱింత ముఖ్యము. రాజస్థానములో, విద్యానిలయములలో, దేవాలయములలో నిలువంబడిన తేజస్వికంటెఁ బురిటిగదిలోని వినమ్రమూర్తియే బ్రహ్మకుటుంబములలోని తల్లుల

యొక్కయు, బిడ్డలయొక్కయు మనస్సులలో నెక్కువచనవుగా నిలిచియుండఁగలఁడు.'

రామమోహనుఁడు నిరుపమాననమేధావి; కానిచో బాల్యముననే అరబ్బీ, పర్షియను, సంస్కృతభాషలందుఁ బాండిత్య మెట్లు సంపాదించి యుండును ? మొత్తముమీఁదఁ బది భాషలలో నఖండజ్ఞానమునార్జించెను. అవలీలగాఁ దనచర్చలలో మహాగ్రంథములందలి యుపమానవాక్యములను స్మరణకుఁ దెచ్చుచుండువాఁడు. భాషాకోవిదుఁడేగాక సుప్రసిద్ధవక్తయని కూడ సమకాలికుల యభిప్రాయము. వ్యాపారవిషయములోఁ గూడ నీతఁడు కడుసూక్ష్మబుద్ధిని జూపెట్టియుండెనఁట. ఎట్టి కుశాగ్రబుద్ధియో తెలిసికొనుటకు రెండుమూఁడు నిదర్శనములు చాలును. ఒకదినమున నొక తాంత్రికుఁడు చర్చలో రామమోహను నోడింప వచ్చియుండెను. చర్చనీయాంశముఁ దానంతకు ముందుఁ జదువని గ్రంథమం దుంటంజేసి మఱునాఁ డొక నియమితకాలమున కా పండితుని రమ్మని కోరెను. అట్లు పంపి తత్క్షణమే యా తంత్రగ్రంథమును దెప్పించి తదేకదీక్షతోఁ బఠించెను. మఱునాఁ డనుకొన్న సమయమున కా పండితుఁడు రాఁగాఁ బ్రతిసూక్ష్మాంశమునందు నాతని నోడించెను. రాధానగరమం దున్నపు డొకయుదయమున స్నాన మైనపిదప వాల్మీకి రామాయణ పఠనమున కాసీనుఁడై తన్నెవరును బలుకరింప వలదని చెప్పి తదేకధ్యానముతోఁ జదువుచుండెను. భోజనపు వేళ యయినను ఎవ్వరుఁ బిలువసాహసింపరైరి. అట్లు తొమ్మిది

గంటలకాల మైనపిదపఁ దల్లి తారిణీదేవి యొుక్క వృద్ధభటుని గోమరుని బిలువనంపెను. ఆతనిని జూచి యడ్డు రావలదని సంజ్ఞ చేసెను. ఆదినమంతయు గ్రంథపఠన ముగించువఱకును లేవలేదు. రామాయణమును బోలిన పురాణగ్రంథములను నెవ రేకదీక్షతో ముగింపఁగలరు? ఒక దాక్షిణాత్యుఁడు రామమోహనునకుఁ దెలియనిభాషలో నొకయుత్తరము వ్రాసెను. దాని నెవరిచేతనో చదివించుకొని మూఁడుమాసములు పూనికతో నాభాష నభ్యసించి యాభాషలోనే తిరిగి ప్రత్యుత్తరము వ్రాసి పంపెను.

రామమోహనుఁడు దయార్ద్రహృదయుఁడు. తలిదండ్రులతని నెంతహింసించినను ఆయనమాత్రము వారియెడ నెప్పుడును భక్తివిశ్వాసములతో నుండెడివాఁడు. స్నేహితులయెడ నీయనయొుక్క యాదరణ యవ్యాజముగా నుండెడిది. తన భృత్యులయెడ విశేషమగు వాత్సల్యముండెను. రామదాసు అను తోఁటమాలి యుండెడివాఁడు. తన యజమానునియెడల నెంతో యనురాగముతో నుండి యాయనతో నాంగ్లదేశము నకుఁగూడ నేగెను. ఈతోఁటమాలియందు రామమోహనుని కత్యంతప్రేమ. అతఁడుగూడ నెమ్మదిగఁ జదువుకొని తనయజమానునియొుక్క ధర్మమే యవలంబించెను. "వానిని నాసోదరునివలెఁ గౌఁగిలింపనేర్తును" అని రామమోహనుఁ డనుచుండెడివాఁడఁట. ఈతోఁటమాలియే తిరిగివచ్చినపిదప బర్ద్వాన్ మహారాజుగారి తోఁటమేస్త్రీగాఁ బనిచేసియుండెను. బోలుప్రారునందలి

మహర్షి దేవేంద్రనాథ్ ఠాకూర్ గారి శాంతినికేతనోద్యానవ
నముగూడ నీతఁడే వేసియుండెనఁట. ఒకదినమున శుభ్రమగు
వస్త్రముల ధరించి రామమోహనుఁడు వీధిని బోవుచుండెను.
బీదవాఁ డొకఁడు తలపై బరువు నెత్తుకొనలేక యల్లలాడు
చుండె. ఎవరిమట్టుకువారు తమదారిని దాము పోవుచుండిరి
గాని వానికి సాహాయ్యముఁ జేయకుండిరి. రామమోహనుఁ
డాబీదవాని ముఖమైఖరిఁ జూచి యాబరువు నెత్తికొనుటకు
సాహాయ్యముఁ జేసెను. ఒకరోజున మేక నొకచోట బలి
యిచ్చుచున్నట్లు వర్తమానము రాఁగ నచ్చటి కేగి ఆ హింసను
దప్పించెనఁట. తనపుత్త్రుఁడగు రాధాప్రసాద్ సంతకు వచ్చు
వర్తకులనుండి పన్ను పుచ్చుకొనుట తన నెంతో బాధించుటచే
బీదలపై నట్టికార్యము తగదని కొమరుని మందలించి యా
సుంకము దీసివేసెను. ఈ పుత్త్రుఁడే యున్నతస్థానన్యాయ
మూర్తిపదవి నలంకరించిన ప్రథమహిందూదేశస్థుఁడు. ఆయ
నలో మూర్తీభవించిన సహజమగు నమ్రతామర్యాదలవల
ననే తన్ను బ్రతిదినము నెందఱు చూడవచ్చినను బొమ్మన
లేకుండెడివాఁడు. అనేకులు వ్యర్థవాదములకు వచ్చుచుండెడి
వారు. ప్రతివారు చెప్పునదియు నోపికతో వినువాఁడు. కొంత
తడవైనపిదప వృథాకాలయాపన సహింపనేరక 'తోఁటలోఁ
దిరుగుదమా ?' యని లేచెడివాఁడఁట. ఒకసారి లేచి నడచుట
ప్రారంభించినచో నాయనతో సమానముగ నెవరును నడువ
లేకుండిరఁట. కావున నాచూడవచ్చినవారలు వెడలిపోవువారు.

సమయస్ఫూర్తియుగుయుక్తి కాయనను మించినవారు లేరు. ఒకదినమున మిత్రుఁ డొకశంఖమును దెచ్చి అద్దాని నెవరో బైరాగి యేఁబదిరూప్యముల కమ్మనున్నాఁడని చెప్పుచు, దాని నెవరు తమయొద్ద నుంచుకొందురో వారు గర్భదరిద్రులైనను సంపదతోఁ దులతూఁగుదు రని యాబైరాగి చెప్పుచున్నాఁ డనెనఁట. 'అంతమాహాత్మ్య మున్నదాని కింత తక్కువనెల యేల? అట్టిదానిని దానే యుంచుకొనక యితరుల కేల యమ్మవలయు?' నని రామమోహనుఁడు ప్రత్యుత్తర మీఁయ, బైరాగి తలవంచుకు పోయెను.

స్కాట్లాండు దేశస్థుఁ డగు నొక మిత్రునితోఁ బ్రసంగించుచు, మాటవరుసకు రామమోహనుఁడు "అయ్యా! నీ దేశస్థుఁ డొకఁడును, పరదేశి యొకఁడును, ఎదుటనున్న నదిలోఁ బడిన చో ముం దెవరిని రక్షింపఁ బ్రయత్నింతు" వని ప్రశ్నింప 'సందేహ మేమి? నా దేశపువానినే' యని ప్రత్యుత్తరమిచ్చెను. అంత రామమోహనుఁడు 'నే నేమిచేతునన్న ఎవ రందు బాటులో నున్న వానినే ముందు సంరక్షింప నెంతును. ఇరువురిలో నొకరు స్త్రీయైనయెడలఁ బ్రప్రథమమున నామెనే కాపాడుదు' ననియె.

స్త్రీలయెడల నాయన కుండిన గౌరవము పేర్కొనఁదగిన గుణములలో నొకటి. సామాన్యస్త్రీలనైనను రాణివలె గౌరవించుచుండువాఁడు. స్త్రీజాతియెడల నంతటియభిమానముండుట కాయనకు టిబెట్టుకాంతలు ప్రాణదానముఁ జేసిన విషయము మఱవకుండుటయే కారణము. రాధానగరమందుఁ దన

వదినెగారు సహగమన మాచరించుటఁగూడ తనమనస్సులో నొక గొప్పమార్పుఁ దెచ్చెను. స్త్రీలసన్నిధానములో నున్నపుడతని పలుకు, వీక్షణము, ప్రవర్తనము మొదలయినవానిలో నసాధారణగౌరవము మాధుర్యమును ఎల్లరును ప్రశంసించుచుండిరి. తానున్నచోట నొకస్త్రీయైన నిలువఁబడియున్నచో నతఁడు కూర్చుండువాఁడు గాఁడఁట. వారియెడ నాతనికిఁగల గౌరవముచేతనే వారియభ్యుదయమున కన్నిశ్రమల నోర్చెను. మతవిషయములందుఁ జులకనఁగా మాట్లాడుటగాని, స్త్రీల యెదుట సరియగు మతసత్యము స్పష్టముగ నచ్చఁజెప్పలేకపోవుటగాని యాయనకుఁ గిట్టకుండెను. ఒకదినమున నొకతండ్రి వయస్సు మీఱిన తన యిద్దఱుకుమార్తెలును, ముగ్గురు పరస్త్రీలును నుండఁగా వారియెదుటఁ గ్రైస్తవమతమును గుఱించి తనసందేహములను వెలిపుచ్చుచుండెను. రామమోహనుఁడు మతమునందలి శాశ్వతసత్యమును వారికి నిరూపించెను. మఱునాఁడు, ఆదినమచ్చట నొకస్నేహితునితోఁ 'కుమార్తెల యెదుటనే మతమందలి యవిశ్వాసము వెల్లడించిన యా తండ్రియొక్క చర్య నెంతయు గర్హించుచున్నా' ననెను.

మతవిశ్వాసియగు రామమోహనునికి నీతివర్తనమందుఁ గూడఁ బట్టుదల యుండుటలో నాశ్చర్య మేమియు లేదు. మరణశయ్యపై నున్నపుడుఁగూడ నెందఱో మిత్రులు తమ దేశాచార మట్టిదని నచ్చఁజెప్పవఱకుఁ బరస్త్రీయొక్క పరిచర్యలను గ్రహించియుండలేదు. నీతిప్రవర్తనయొక్క యా

వశ్యకతఁగూర్చి యాతఁడు నిశ్చయముగా వ్రాసియుండెను. పాశ్చాత్యదేశములందలి కొన్నియలవాట్లు చూచి యాతఁడు చాల బాధపడుచుండెడివాఁడు.

రామమోహనుని కమితమగు వశీకరణశక్తి యుండెడిది. తనమిత్రులపై నేదోయొక వర్ణింపనలవికాని సమ్మోహనాస్త్రము వేయుచుండెడివాఁడు. ముఖ్యముగ దేవేంద్రనాథుఁడు చిన్నబాలుఁడైనను ఈయనచే నమితముఁగ నాకర్షింపఁబడెను. బండిలోఁ బోవుచు రామమోహనుని కెదురుగ విస్మయముతో బొమ్మవలెఁ గూర్చుండి యాతని సుందరవదనారవిందము దనివితీఱఁ గాంచుచుండువాఁడఁట. 'ఏదోయొక యపూర్వపుశక్తి నన్ను నిరంతర మాయనకడకుఁ బట్టి లాగుచుండెడిది. మాటలవలన నా కాతఁ డేబోధనలు చేసియుండలేదు. ఆయన యాంగ్లదేశమునకుఁ బయనము కానున్నపుడు మాతండ్రిగారి సెలవు గైకొన వచ్చెను. మాకుటుంబము వా రందఱును నాయనకడ సెలవు గైకొనఁ బోయిరి. అపుడు నేనుమాత్ర మచ్చట లేను. నేను గుఱ్ఱవాఁడనైనను నన్నుఁ బ్రత్యేకముగా రామమోహనుఁడు చూడఁగోరెను. నా కరస్పర్శఁ గావింపనిదే ప్రయాణము చేయ వీలు లేదని మాతండ్రిగారితో ననెనఁట. కావున నన్ను వెంటనే రావించిరి. అప్పుడు రామమోహనుఁడు నా కరస్పర్శఁ గావించి వెడలిపోయెను. ఆనాఁ డత్యంతప్రేమతో నాకరమును బట్టిన పట్టులో నొక యంతరార్థ ముండెను. నేను పెద్దవాఁడనైన

పిదప నద్దానిని గ్రహింపఁగల్గితిని. ఆయన మరణవార్త వచ్చిన వెంటనే నేనును నాతండ్రితోపా టెంతయో విలపించియుంటి" నని దేవేంద్రనాథుఁడు వ్రాసియుండెను.

నైతికాభివృద్ధి వాంఛించిన యితఁడు శరీరారోగ్యము నకుఁగూడ సమముగు ప్రాధాన్య మీయకపోలేదు. ఆయన యాజానబాహుఁడు. కొన్ని సేర్లపాలు త్రావుటయుఁ, జాలపండ్లొకేసారి భుజించుటయు నప్పటివారి కాశ్చర్యముఁ గొల్పుచుండెడివి. దేవేంద్రనాథునితో 'నీవు పోసి వృక్షము నెట్లు వృద్ధి పొందింతువో యట్లే శరీరమునుగూడ జాగ్రత్తగాఁ బోషింపవలసియుండు' ననెడివాఁడఁట. కాయముగూడ నీశ్వరప్రసాదమని యీతఁడు గ్రహించుచుండెను.

ఈతని మనస్స్థైర్యమును బరీక్షించుట కొకసారి తన పుత్త్రుఁడు చనిపోయినట్లు కొందఱు మందగులు ఒకవార్త నంపిరి. ఆవార్త యీతనికిఁ జేరకమున్నే వారచ్చటికి వచ్చియుండిరి. ఈతఁ డైదునిమిషములుమాత్రము పైకి లేచి పిమ్మట నిశ్చలముగా నుండుటఁ గాంచి వారచ్చెఱువు నొందిరి.

ఈతని యౌదార్యమును, హృదయవైశాల్యమును జూచువారల కద్భుతముగఁ దోఁచుచుండెడివి. ఇట్టి మహాజ్ఞాని నలుగురితోపాటు సంతోషమునిచ్చు సామాన్యకాలక్షేపములను వెనుదీసెడివాఁడు కాఁడు. సుప్రసిద్ధనాటకములకుఁగూడఁ బోయెడివాఁడు. "ఫెనీకెంబెల్" అనునటి "ఇసబెల్లా" యను

నాటకమున నటించుచుండెను. (ప్రేక్షకులసంఖ్య యెక్కువలేదు. "నేను చక్కఁగా నాపాత్ర నభినయించుచుంటిని. డెవన్‌షైర్ ప్రభువుతోఁ గూడ నున్న రామమోహనుఁడు పాపము వెక్కి వెక్కి యేడ్చుచుండెను" అని 1831 సం॥రము డిసెంబరు 22 వ తేదీని తన దినచర్యపుస్తకమందు వ్రాసి యుంచెను.

ఈతని త్యాగ మమోఘము. మొదటినుండి కడవఱకును ఆయన జీవితమంతయుఁ ద్యాగపూరితమే. సొంతవ్యయముతో ననేకగ్రంథముల నాయన యచ్చొత్తించెను. బీదసాదుల కెన్నియో దానధర్మములు చేయుచుండువాఁడని యీతని సమకాలికులు వ్రాసియుండిరి. ఈదేశమునకు వచ్చి బాధపడుచుండెడు క్రైస్తవప్రచారకులకు ధనము నిచ్చి పోషించువాఁడు.

"మానవజాతి యంతయు నొక్కవిశ్వాసముతో నుండుట నాజీవితమందుఁ గాంచవలెను గావున సహజమగు జీవిత మాధుర్యము తోడిమానవులపై వెదచల్లుటయే నావిధి" అని యతఁడు వచించియుండెను. మతము మార్చుట కాతఁడు ప్రయత్నించెడివాఁడు కాడు. మతవిశ్వాసములొకటే యాతఁడు ప్రచారము చేసెడివాఁడు.

## రా మ మో హ ను ని ఘ న త

పిత్రార్జితము నావంతయు నాశింపక మానము పోయినను, ధనము పోయినను మానవసేవయే ఈశ్వరసేవగా నెంచి యీశ్వరప్రీత్యర్థ మెన్నియో సాహసకార్యములు కడవఱకు

నాచరించి, పరదేశమందు జీవితము గోల్పోయి తుద కట్లు తన మరణమందుసైతము ప్రాక్పశ్చిమభేదములు, స్వజాతి, విజాతి భేదములును దన హృదయాంతరాళమున నెన్నఁడును జొచ్చియుండలేదని నిరూపించుచు, ఈశ్వరపితృత్వము, మానవసౌభ్రాతృత్వము పలుకకనే ప్రకటించిన ధన్యజీవి రామమోహనుఁడు.

పైని బేర్కొనఁబడిన గుణగణములలో నేయొక్కటి మాత్ర మున్నను రామమోహనుఁ డొకమహావ్యక్తిగాఁ బరిగణింపఁబడుట నిస్సంశయము. కాని యిన్నిసులక్షణము లాయనయందు మూర్తీభవించియుండుటచేతనే యాతఁ డొక యపూర్వ వ్యక్తి యని చెప్పకతప్పదు. సర్వసాధారణముగా నిట్టి లోకోత్తరపురుషు లేఖండమందో, యేజాతియందో, యేయుగమందో యనేకశతాబ్దముల కొక్కసారి యుద్భవించుచుందురు. అట్టివారొక్కదేశమునకుఁగాని, జాతికిఁగాని, ఒక యుగమునకుఁగాని చెందినవారు గాక సర్వమానవకోటిలోను సదా సజీవులై యుందురు. 19 వ శతాబ్దమందుఁ బేర్కొనఁదగిన యంశములలో నెల్ల రామమోహనుని జననమును జీవితమును నగ్రగణ్యములైనవని చెప్ప సాహసించుటలో వింత యేమియు లేదు. భారతీయనవజీవనమం దేయంశమును దీసికొన్న, నద్దాని కాతని జీవితమే ప్రథమసోపానము. మఱియొకవిషయ మాలోచించిన, ఆయనయాధిక్యము సాటిలేనిదని తేటతెల్ల మగును. రామమోహనుఁడే పుట్టియుండనిచో నేఁటి భారతదేశాకృతి యెట్లుండె

డిదో యూహింపుఁడు. ఈయుగమున భారతదేశజాతీయజీవనమందుఁ బ్రఖ్యాతి గాంచిన స్త్రీపురుషులనామములఁ బేర్కొనినచో వారెల్లరు నేదోయొకవిధమున రామమోహనుని యడుగుజాడలలో నడచిన ధన్యజీవులే కదా! వారు లేని నవభారత మెక్కడిది? బంగాళమున జగద్విఖ్యాతిఁ గాంచిన ఠాకూరు కుటుంబము, బ్రహ్మానంద కేశవచంద్రుఁడు, భాయ్ ప్రతాపచంద్ర ముజుందార్, పండిత శివనాథశాస్త్రి, ఆనందమోహన్ బోస్, జగదీశచంద్రబోస్, ప్రఫుల్లచంద్ర రే, సింహాప్రభువు, చిత్తరంజనదాస్, శ్రీమతి సరోజినీదేవి, బొంబాయిరాజధానిలో రేనడీ, భండార్కర్, చంద్రవార్కర్, నటరాజన్, పశ్చిమతీరమున రంగరావు, రఘునాథరావు, దక్షిణమున—ముఖ్యముగా నాంధ్రదేశమునఁ గందుకూరి వీరేశలింగంపంతులు, బ్రహ్మర్షి డాక్టర్ సర్. రఘుపతి వెంకటరత్నంనాయుఁడు—మున్నగు మహానామము లెన్నో చిరస్మరణీయములు గదా! తలఁచినంత మాత్రమున శరీరములు పులకరింపఁజేయునట్టివి. వీరిలోఁ గొందఱు నేఁటికిని సజీవులై యున్నవారలు. వీరెల్లరు నింకను ననేకులు రామమోహనుని యనుచరులే. ఆయన యాత్మబంధువులు, వారసులు ననదగు శ్రీపీఠికాపురాధీశ్వరులు రామమోహనరాయలవారి జీవితసారమును గ్రహించి వారి యుద్యమమునకు నాంధ్రదేశమునఁ దోడ్పడుచున్న ధనికులలో ముఖ్యులు.

రాజకీయస్వాతంత్ర్యమునకు సక్రమాందోళన జరపిన ప్రథమభక్తుఁ డీతఁడు. ప్రజల యజ్ఞానమును బోఁగొట్టి వారి జన్మహక్కులను దెలిసికొనుఁడని మేల్కొల్పుటకు సామాన్య దైనికవిషయములును, గొప్పగొప్ప స్వదేశవిదేశవార్తలును, ఏకరీతిని బత్రికాముఖమునఁ జాటఁజేసిన మొదటిభారతీయుఁ డీతఁడే. వార్తాపత్రికల స్వాతంత్ర్యమునకుఁ బోరు సలిపిన దీక్షాపరుఁ డీతఁడు. రైతులదుస్థితిని బాపి న్యాయమగు నార్థిక స్థితికిఁ బ్రయత్నించిన మార్గదర్శి యీతఁడు. విద్యావిధానమును జక్కపఱిచి హైందవుల నభివృద్ధికిఁ దెచ్చినవిద్యాదాత యీతఁడు. మొట్టమొదట సముద్రముల దాఁటి విదేశముల కేగిన హైందవుఁ డీతఁడు. ప్రథమమునఁ బేర్కొనఁ దగిన బహుళ గ్రంథకర్త యీతఁడు. సర్వమతసారమును గ్రహించిన మత సంస్కర్తలలో నగ్రగణ్యుం డీతఁడు. జ్ఞాన, భక్తి, కర్మమార్గములను దనజీవితములో సమన్వయించుకొనిన పరిపూర్ణుండగు సిద్ధపురుషుఁ డీతఁడు. మతజీవి యగుటయే యీతఁడు జీవన్ముక్తుం డగుటకుఁ గారణమాయెను. ఈశ్వరవిశ్వాసము, ఈశ్వరభక్తియే యీయనమతము. కనుకనే యీతనిని మహాద్రష్టగ నెన్నుకోవలసియున్నది.

## రామమోహనుని మతము

"సర్వమతసారమును సంపూర్ణముగా గ్రహించి సరియైన విశ్వాసమును సహేతుక విజ్ఞానమును సమన్వయించి

ర్భారతమునకేగాక నశేషమానవలోకమున మిక్కిలి సరములగు నీసిద్ధాంతముల నాతఁడు స్థిరపఱచెను.

1. సత్యాసత్యవిచక్షణముఁ జేయుటకుఁ బ్రేమస్వ ప మిట్టిదని గ్రహించుటకు వలయుశక్తి మానవు లందఱిలోఁ ను. పరమమంగళస్వరూపుఁడును, అనంతుఁడును, అద్వి యుఁడును, సర్వాంతర్యామియును నైన పరమేశ్వరుని నెట్టి హ్యాచిహ్నముల సాయము లేకయే మానసికముగా నుపా ంపనగును.

2. కేవలము సంగవివర్జితులగు సన్న్యాసులకేగాక బహ్మానిష్ఠాపరులగు గృహస్థులందఱకు బ్రహ్మజ్ఞానమును సంపా ఓంచి బ్రహ్మోపాసన మొనరించుట కధికారము గలదు. అట్లా చరించుట యందఱివిధి.

3. ఈశ్వరుఁడు కేవల మొక్కదేశమందే, యొక్క జాతివారికే, యొక్కకాలముననే తా నుపదేశముచేయవలసిన దంతయును జేసి యిట్లు తటస్థుఁడుగా నుండఁడు. ఎల్లజాతుల వారికి, నెల్లదేశములందు, నెల్లకాలములందు నాయన తన సత్యములనువెల్లడిచేయును. అన్నిమతములందు సత్యము కలదు. పైకిఁ గనంబడు భిన్నాభిప్రాయము లన్నియు నాయా దేశము లందలి జనులయొక్క యాచారవ్యవహారములనుబట్టి వచ్చిన వ్యత్యాసములేగాని మతమునకుఁ గావలసిన ముఖ్యవిషయము లలో సర్వమతస్థులు నేకీభవించుచున్నారు. కావున మూలమున

మతము లన్నియు నొక్కటే. వాని ప్రకాశముమాత్రము వేఱు వేఱురూపములఁ దాల్చినది. కావున బుద్ధిమంతుఁడగు మానవుఁడు మతజ్ఞానమునకును ఈశ్వరభక్తికిని వలయు ముఖ్యాంశములను మాత్రమే గౌరవించినయెడల వివిధమతస్థులు నొకరితో నొకరు వాదము పెట్టుకొనవలసిన యవసరము లేదు.

4. కనుక సర్వమానవులు నీశ్వరుని బరమపిత యని యెంచి యాతనిపుత్త్రులుగను, బుత్త్రికలుగను భావించుకొనుచు నొండొరులతో మైత్రి సల్పుచు నీశ్వరకుటుంబమగు నీ విశ్వమానవకుటుంబమున మెలంగవలయును. ఇట్టి మహోన్నతాశయములతోఁ గూడిన యాయన యుత్కృష్టమతజీవితమే, ఆయన యసమానప్రతిభకు మూలాధారము. "వివిధమతముల తారతమ్యజ్ఞానమును దీక్షతో నభ్యసించిన తొలిపండితుఁడీతఁడే" అని ఒక మహావేదాంతి "మానియర్ విలియమ్స్" వచించియున్నాఁడు. "పూర్వ పశ్చిమ నాగరకతలు అను రెండు మహాసముద్రములను గలుపుట కాధ్యాత్మికజలసంధిని ద్రవ్విన "ఇంజనీర్" అని రామమోహనుని మఱియొక గొప్పతత్త్వవేత్త ప్రశంసించియున్నాఁడు.

## రామమోహనుని జీవితసందేశము

"హిందూ, బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయాదిమతముల లోని సామరస్యము, ప్రాక్పశ్చిమనాగరకతలలోని సామరస్యము, భూతభవిష్యద్వర్తమానకాలములందలి సామరస్యము,

హేతువాదవిశ్వాసములకు సామరస్యము, రాజకీయ సాంఘిక ధార్మికాదివిషయములలోని సామరస్యము—ఇట్లు సమస్త విషయములలోని సామరస్యమే లోకమునకు ఈ శాంతిదూత యొక్క కళ్యాణసందేశము” అతని యుపాసనామందిరము హిందూదేవాలయము గాని, మహమ్మదీయుల మసీదు గాని, క్రైస్తవుల చర్చి గాని కాదు. అది సువిశాలమైన బ్రహ్మమందిరము. నిరాడంబరమై నిరంతరమును తెఱువఁబడినద్వారములతో సత్యప్రేమల కాలవాలమైన యొకదేవాలయమును మూఁడు వందలేండ్లకుఁ బూర్వము అక్బరుపాదుషా స్వప్నములోఁ గాంచి నటుల టెన్నిసన్ మహాకవి యాలపించె ననియు, ఆయవ్యక్త స్వప్నమే రామమోహనుని సన్నిహితదృశ్య మయ్యె ననియు బ్రహ్మఋషి వచించియున్నాఁడు. ఠేనడీమహాశయుఁడు రామమోహనుఁడు లిఖించిన బ్రహ్మసమాజదానపత్రము యొక్క యుత్కృష్టత, ఔదార్యము, ఇంకను గొన్ని శతాబ్దములవఱకు మానవకోటి గ్రహింపఁజాలదని వ్రాసియున్నాఁడు. మానవకోటి యంతయు నైక్యభావముతో నీశ్వరుని బ్రేమించి పూజించుటయే రామమోహనుని మతసందేశము. అట్టి యీశ్వరోపాసన మానవుని జన్మహక్కని యాతఁడు కనుఁగొనెను. ఈహృదయ వైశాల్యమునకును, ఔదార్యమునకును, సమన్వయకాంక్షకును బొంగిపొరలు స్వాతంత్ర్యప్రవాహమే నిజమగు మూలవాహిని.

తూర్పుండియా వర్తకసంఘముధికారపత్రము విషయమై, ఆంగ్లదేశమునఁ జర్చ జరుగుచున్నప్పుడొకానొక పత్త్యగ్రంథ

కర్త "హిందూదేశ పరిపాలనా విధానమునకు సూచనలు" అను నొకనాటకమును వ్రాసెను. అందులో 'శాసనసభాభ్యర్థి' యొకపాత్ర. అతఁడీరీతిని వచించెను. "ప్రప్రథమమున రాజా రామమోహనరాయ్ గారు హిందూదేశమునకు గవర్నరు జనరల్ గా నియమింపఁబడవలసినదిగా నే నుపపాదించుచున్నవాఁడను. న్యాయస్థానమందలి యుద్యోగము లన్నియు మహమ్మదీయులు చేయవలయును. (వారందుల కిష్టులని రామమోహనుఁ డిదివఱలో మహమ్మదీయ పరిపాలన విమర్శించుచు వ్రాసియుండెను) రెవిన్యూయుద్యోగము లన్నియు హిందువుల కొసంగవలయును. పోలీసువారి విధులన్నియు నాంగ్లహైందవులచేతులలో నుండవలయును. "మహాసీమంతులారా! పురుషవరేణ్యులారా! ఈ విధానమందలి యందమెందుఁగలదన రామమోహనరాయలు హిందువు కాని, మహమ్మదీయుఁడు కాని, క్రైస్తవుఁడు కాని కాఁడు.. కావున హిందూదేశములో నేజాతియెడలను ప్రత్యేకాభిమానము లేక నిష్పక్షపాతబుద్ధితో నేలఁగలఁడు. తక్కిన విషయములలో నేరెండుతెగలవారికిని బడదు గనుక నే మొత్తముమీఁద నెవరివిధులువారు నిర్వహించుచుఁ బ్రభుత్వచక్రమును సరిగాఁ ద్రిప్పఁగలరు." ఈవాక్యములు పరిహాసముగా వ్రాసినను, ఇందలి సత్యము గోచరింపకపోదు. సర్ గురుదాస్ బెనర్జీగారు వ్రాసియుండిన యీదిగువవాక్యములకంటె, రామమోహనుని సందేశమును దెల్పుటకు వేఱుగ వ్రాయ నెవరివశమగును? "దేశసేవలో వినియోగించుటకుఁ జక్కఁగ భాషాజ్ఞానము పొందనెంతురా? రామమోహనుని రచనలను విభ

కింపుఁడు. స్వయముగ మీరు ప్రతివిషయము చక్కఁగా నాలోచింప నెంతురా ? ఆంగ్లవిద్య దేశమునకు రాకముందే నేఁటి సమస్య లన్నియు నూహించి పరిష్కరించిన గురూత్తముఁ డగు నామహామేధావిని, రామమోహనుని శుశ్రూష చేయుఁడు. గీతాసందేశమును "నిష్కామధర్మమును" బాటింప నెంతురా ? తనకాలమున నఖండుఁ డనిపించుకొనియుఁగూడ నెంతో నమ్రతతోఁ దాను నిర్వహింపవలసిన ధర్మము లన్నియు నిర్వహింప లేదే యని వగచినట్టియు, నర్హత యుండియు విద్యాశాఖ యందలి యున్నతపదవిని గైకొనక, నిరాడంబరసేవమాత్ర మొనర్చిన శ్రీరామమోహనుని యాదర్శముకంటె వేఱెద్ది కావలయును ? అట్టిపురుషుని నామస్మరణయే మన సోదరదేశీయులయెడల మనము నిర్వహింపవలసిన విధులను జ్ఞప్తికి దెచ్చుచుండును. మన భేదముల మఱవ నుద్బోధించుచుండును. మన సోమరితనమును దఱిమివేయును. అట్టినామముకంటె నింక సందేశము, వాక్యరూపమున నేమి కావలయును ?"

దేవుఁ డొక్కఁడే ! జగత్పిత !
జాతి యొక్కటే ! మానవజాతి !
రాజ్య మొక్కటే ! స్వర్గరాజ్యము !

ఇదియే శ్రీరాజర్షి రాజా రామమోహనరాయలవారి పవిత్రజీవితసందేశము.

ఓమ్ ! శాన్తి, శ్శాన్తి, శ్శాన్తిః.

---

శ్రీపతి ముద్రణాలయము, కాకినాడ—౧౯౫౨.